



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | గురువారం 10-12-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:110 | పేజీలు:8 | వెల: రూ.1/-


# బయోలాజికల్ ఇవాన్సను సందర్శించిన విదేశీ బృందం

## టీకా అభివృద్ధిపై ప్రతినిధులకు వివరించిన మహిమా దాట్ల

హైదరాబాద్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): కోవిడ్ టీకా పురోగతిని తెలుసుకునేందుకు 64 దేశాలకు చెందిన రాయబారులు




హైదరాబాద్ పర్యటనలో భాగంగా బయోలాజికల్ ఈ లిమిటెడ్ సంస్థను సందర్శించారు. ఈ నేపథ్యంలో బయోలాజికల్ సంస్థ ఎండీ మహిమా దాట్ల మీడియాతో మాట్లాడారు. వ్యాక్సిన్ అభివృద్ధిలో ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపించినట్లు ఆమె తెలిపారు. కేవలం భారతీయులకు మాత్రమే టీకా అందించడం కాదని, ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ సరఫరా చేయడంలో భారతీయ కంపెనీలు కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రధాని మోదీ పేర్కొన్నట్లు ఆమె గుర్తు చేశారు. నగరానికి చెందిన బయోలాజికల్ ఈ లిమిటెడ్ సంస్థ.. కరోనా వైరస్ చికిత్స కోసం జంతువుల్లో యాంటీసెరా మందును అభివృద్ధి చేసింది. ఐసీఎంఆర్‌తో కలిసి అత్యంత శుద్ధీకరించిన ప్లాస్మాతో యాంటీసెరా మందును డెవలప్ చేశారు. వ్యాధి నివారణ కోసం యాంటీసెరా విధానాన్ని వాడుతారు. భారత్ అభివృద్ధి చేస్తున్న కోవిడ్ టీకాలపై డెన్మార్క్ రాయబారి ఎఫ్ సానే స్పందించారు. మీరు సాధించిన పురోగతి చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని ఆయన మీడియాతో అన్నారు. కోవిడ్‌పై పోరాటానికి విశేష పట్టుదలతో ఉన్నారో తెలుస్తోందని, మానవాళిని రక్షించేందుకు విశేష ఫోకస్ పెట్టారో తెలుస్తోందని ఆయన అన్నారు. టీకాను వాణిజ్యం చేయడమే లేక దేశమే ముందన్న వాదన కాకుండా, విశాలత ప్రపంచ దేశాల కోసం పనిచేస్తున్నారని ఆయన అన్నారు. ఇది ప్రజలందరికీ ఉపయోగపడుతుందని సానే తెలిపారు. ఆస్ట్రేలియా అంబాసిడర్ బారీ ఓ ఫారెల్ కూడా తన స్పందన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వ్యాక్సిన్లను ఉత్పత్తి చేసే దేశాలు చాలా ఉన్నాయని, కానీ అందరికీ సరిపోయే విధంగా ఉత్పత్తి చేసే సామర్థ్యం కేవలం భారత్‌కు మాత్రమే ఉందని ఫారెల్ అన్నారు.

# అదుపుతప్పి బోల్తా పడ్డ కారు

## నలుగురు వ్యక్తులు మృతి




నారాయణపేట జిల్లాలో దూసుకెళ్లి ప్రమాదానికి గురైన కారు దృవ్యాలు

నారాయణపేట,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల దగ్గర ఘోర ప్రమాదం జరిగింది. ఇందులో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. హైదరాబాద్ నుంచి రాయచూరు వెళ్తున్న కారు అదుపుతప్పి అతివేగంగా రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో నలుగురు అక్కడిక్కడే చనిపోయారు. ప్రమాదంలో కారు డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. అదృష్ట వశాత్తు ఐదేళ్ల చిన్నారి ప్రాణాలతో సురక్షితంగా బయటపడింది. కారు బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురు మహిళలతో సహా ఓ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో డ్రైవర్ తీవ్ర గాయాల పాలవ్వగా.. ఓ చిన్నారి సురక్షితంగా బయటపడింది. ప్రమాదవార్త తెలిసిన వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని మక్తల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అనంతరం మృతదేహాలను కూడా పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## చరిత్రలో నేటినిజం



-రాధశ్రీ

సెల్: 9494481210

# కరోనా పేషెంట్ల ఇంటిపై గుర్తులు వేయరాదు

## ప్రభుత్వానికి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): కరోనా పేషెంట్స్ ఇంటి పై పోస్టర్లు లేదా గుర్తులు అతికించకూడదని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కరోనాతో బాధపడుతున్న వారి ఇళ్ల మీద సంకేతాలు, గుర్తులు ఉండేలా ఎలాంటి పోస్టర్లు అతికించడం, గానీ రాయడం గానీ చేయకూడదని తెలిపింది. కొన్ని ప్రత్యేక కేసుల విషయంలో మాత్రం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ కింద అధికారులు పోస్టర్లు అతికించొచ్చని పేర్కొంది. ఐసోలేషన్‌లో ఉన్న పేషెంట్ల ఇళ్లపై పోస్టర్లు అతికించడంపై పలు రాష్ట్ర ప్రభుత్వాలు వేసిన కేసుపై జస్టిస్ అశోక్ భూషణ్, ఆర్.సుభాష్ రెడ్డి, ఎంఆర్ షాల త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పును ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్తా.. కేంద్రం చెప్పనప్పటికీ కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమంత తామే పోస్టర్లు అతికిస్తున్నాయని కోర్టుకు నివేదించారు. ఈ విషయంపై ఇప్పటికే అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల అడిషనల్ చీఫ్ సెక్రటరీలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీ (హెల్త్)లకు తగిన సూచనలను చేశామని అత్యున్నత ధర్మాసనానికి ఇచ్చిన అఫిడవిట్‌లో కేంద్రం పేర్కొంది.

# మంత్రి కెటిఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న బిజెపి

## పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాజన్నసిరిసిల్ల,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంత్రి కేటీఆర్‌కు నిరసన సెగ తగిలింది. ఎల్లారెడ్డిపేటలో మున్నూరు కాపు సంఘం భవనాన్ని ప్రారంభించి, కార్యకర్త వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న మంత్రి కేటీఆర్‌ను అడ్డుకునేందుకు బిజెపి కార్యకర్తలు యత్నించారు. డిగ్రీ కళాశాల కావాలని మంత్రి కాన్వాయ్ను అడ్డుకునేందుకు యత్నించగా పోలీసులు బిజెపి కార్యకర్తలను అడ్డుకొని పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

బిజెపి నేతల తీరుపై టిఆర్ఎస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. నలుగురు బీజేపీ కార్యకర్తలపై దాడిచేసి, ఓ బైక్ను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో సాయికుమార్ అనే బీజేపీ కార్యకర్త గాయపడ్డారు. ఇరువర్గాల ఆందోళనలతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టిఆర్ఎస్ కార్యకర్తల దాడిని నిరసిస్తూ బిజెపి కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. స్టేషన్ ముందు రోడ్డుపై బైఠాయించి దాడికి పాల్పడ్డ టిఆర్ఎస్ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్లిన బీజేపీ కార్యకర్తలపై టిఆర్ఎస్ గుండాలు దాడి చేశారని ఆరోపించారు. పార్టీకి సంబంధం లేని మైనార్టీ యువకుడిపై మంత్రి సమక్షంలోనే టిఆర్ఎస్ గుండాలు దాడి చేశారని, దాడికి మంత్రి కేటీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వారిని సముదాయించి చర్యలు తీసుకుంటామని చెప్పి ఆందోళనను విరమింపజేశారు.

# రైతుల ముందు 5 ప్రతిపాదనలు

న్యూఢిల్లీ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలంటూ డిసెంబరు 8న దేశవ్యాప్తంగా రైతులు చేపట్టిన బంద్ విజయవంతం కావడంతో కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడ్డట్లు తెలుస్తోంది. రైతులకు సంఘీభావంగా దేశ వ్యాప్తంగా బీజేపీ దాని మిత్రపక్షాలు మినహా దాదాపుగా అన్ని పార్టీలు సంఘీభావం తెలిపాయి. సామాన్యులు వ్యాపారులు సైతం రైతన్నలకు వెన్నుదన్నుగా మేమున్నామంటూ స్వచ్ఛందంగా బంద్ పాటించారు. దీంతో దిగివచ్చిన కేంద్రం ప్రభుత్వం...యుద్ధ ప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు చేపట్టింది. రైతు సంఘాలతో చర్చలు జరిపాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను పురమాయించింది. ఈ నేపథ్యంలోనే కొత్త వ్యవసాయ చట్టాలకు కొన్ని సవరణలను కేంద్రం ప్రతిపాదించింది. ఆ సవరణలపై రైతు సంఘాల నేతలతో కేంద్రం చర్చలు కొనసాగుతున్నాయి. తాము చేసిన 5 సవరణలపై లిఖిత పూర్వక హామీ ఇచ్చేందుకూ కేంద్రం అంగీకరించింది. రైతుల ప్రధాన డిమాండ్ అయిన కనీస మద్దతు ధర విధానాన్ని యథాతథంగా కొనసాగిస్తూ కేంద్రం కొత్త వ్యవసాయ చట్టాలకు సవరణను ప్రతిపాదించింది. మండి వ్యవస్థ (ఏ.పి.ఎం.సి) ను రైతుల అభిప్రాయానికి తగ్గట్టు మార్పులు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రభుత్వ ,ప్రైవేటు మార్కెట్లలో ఒకే పన్ను విధానం ఉండేలా కొత్త చట్టాన్ని కేంద్రం సవరించింది. ప్రభుత్వ మార్కెట్లను బలోపేతం చేసే విధంగా రైతులకు సవరణలను ప్రతిపాదించింది. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ప్రైవేట్ కంపెనీ పేరు నమోదు తప్పనిసరి చేసింది. కొత్త చట్టం ప్రకారం 'పాన్' కార్డు ఉన్న వారంతా పంట కొనుగోలు చేయొచ్చు. అయితే రిజిస్టర్ చేసుకున్న వారే పంట కొనుగోలు చేయాలన్న సవరణను కేంద్రం చేసింది. ప్రైవేటుతో పాటు ప్రభుత్వం కూడా పంట సేకరణ చేసేలా మార్పులకు కేంద్రం అంగీకరించింది. వ్యాపారులు రైతుల కాంట్రాక్ట్ వ్యవసాయం ఒప్పందాలలో వివాదాల పరిష్కారానికి రైతులు సివిల్ కోర్టును ఆశ్రయించేలా సవరణ చేసింది. కొత్త చట్టంలో ఆ అధికారం జాయింట్ కలెక్టర్ కు ఉండడంపై రైతులు అభ్యంతరం తెలపడంతో ఈ సవరణ చేసింది. ఒప్పంద వ్యవసాయంలో రైతుల భూములకు రక్షణ కల్పించే విధంగా సవరణ చేసింది. పంట వ్యర్థాల దహనం వ్యవహారంపై పంజాబ్ హర్యానా రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా సవరణ చేసేందుకు కేంద్రం అంగీకరించింది. మరి ఈ సవరణలకు రైతు సంఘాల నేతలు అంగీకరిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే చాలామంది రైతులు యథావిధిగా పాత విధానాన్ని అమలు చేయాలని...కొత్త చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## సవరణతో కూడిన కొత్త వ్యవసాయ చట్టం ప్రతిపాదించిన కేంద్ర ప్రభుత్వం

# కేంద్ర ప్రతిపాదనలకు రైతు సంఘాల తిరస్కారం

## 12 ఢిల్లీ-జైపూర్, ఢిల్లీ-ఆగ్రా రహదారుల దిగ్బంధనం

## ఆందోళనల్లో భాగంగా 14న దేశవ్యాప్త నిరసనలు

## ఆందోళనలను మరింత ఉధృతం చేయాలని నిర్ణయం

న్యూఢిల్లీ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): వ్యవసాయ చట్టాలపై కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను రైతు సంఘాలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో డిసెంబర్ 12వ తేదీన ఢిల్లీ-జైపూర్, ఢిల్లీ-ఆగ్రా రహదారులను అడ్డుకుంటామని రైతుల నాయకులు బుధవారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. డిసెంబర్ 14న దేశవ్యాప్త నిరసనకు కూడా వారు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని అన్ని రహదారులను ఒక్కొక్కటిగా అడ్డు కుంటామని రైతు సంఘాల నాయకులు తెలిపారు. మూడు వ్యవసాయ చట్టాలు రద్దు చేయలేదని రైతు నాయకులు విలేకరుల సమావేశంలో అన్నారు. వివాదస్పద వ్యవసాయ చట్టాలపై కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన ప్రతిపాదనను రైతులు ఏకగ్రీవంగా తిరస్కరించడమే కాకుండా డిసెంబర్ 14న దేశవ్యాప్త నిరసనకు పిలుపునిచ్చారు. అంతే కాకుండా డిసెంబర్ 12 ఢిల్లీ-జైపూర్, ఢిల్లీ-ఆగ్రా రహదారులను దిగ్బంధిస్తామని సింఘూ సరిహద్దు రైతులు ప్రకటించారు. కేంద్రం ప్రతిపాదనలు ఏమాత్రం ఆమోద యోగ్యంగా లేవని, తమ డిమాండ్లను తూచా తప్పకుండా కేంద్రం ప్రభుత్వం ఆమోదించే వరకు వెనక్కి తగ్గేది లేదని వారు పేర్కొన్నారు. రైతు ఉత్పత్తుల సేకరణకు ప్రస్తుతం అమలులో ఉన్న కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) విధానం కొనసాగు తుందని, ఈ మేరకు లిఖిత పూర్వక హామీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ ప్రతిపాదనలో కేంద్రం పేర్కొంది. అయితే వ్యవసాయ చట్టాలు రద్దు చేయడం మినహా మరే ప్రతిపాదనకు ఒప్పుకునేది లేదని రైతులు మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే బుధవారం కేంద్రం ప్రభుత్వం ప్రతిపాదనను అన్ని రైతు సంఘాలు కలిసి ఏకగ్రీవంగా తిరస్కరించాయి.




# మ్యాన్‌హోల్‌లో పడి వ్యక్తి మృతి

చెన్నై, డిసెంబర్ 9:: ఓపెన్ మ్యాన్‌హోల్‌లో పడి వ్యక్తి మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో బుధవారం ఈ ఘటన జరిగింది. ఇటీవల కురిసిన వర్షానికి నగరంలో కొడంబాకం వంతెన సమీపంలో రోడ్డుపై వరద నీరు నిలవడంతో మున్సిపల్ సిబ్బంది మ్యాన్‌హోల్ తెరిచారు. మధ్యాహ్నం అటుగా నడుచుకుంటూ వెళ్లిన అదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ నర్సింహన్ (56) అందులో పడి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మ్యాన్‌హోల్ సమీపంలోకి రాగానే నర్సింహన్‌కు గుండెపోటు రావడంతో అందులో పడినట్లు మున్సిపల్ అధికారులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నియంతృత్వ ధోరణిలో కేంద్రం

## రాష్ట్రపతికి వివరాలు వెల్లడించాం: ఏచూరి

న్యూఢిల్లీ,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): రైతుల పట్ల కేంద్రం నియంతృత్వంగా ప్రవర్తిస్తోందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మండిపడ్డారు. 3 బిల్లులను కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బిల్లులను ఉపసంహరించుకుని కొత్త ప్రతిపాదనలపై చర్చించి.. బిల్లులు ప్రవేశపెడితే అభ్యంతరం లేదన్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరామని తెలిపారు. కేంద్రానికి నచ్చజెప్పాలని రాష్ట్రపతిని కోరామని సీతారాం ఏచూరి ప్రకటించారు. రాష్ట్రపతిని కలిసి వివరాలు వెల్లడించామన్నారు. మరోవైపు కేంద్రం ప్రతిపాదనల్ని రైతు సంఘాలు తిరస్కరించాయి. కొత్త వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. కొత్త చట్టాలను రద్దు చేసే వరకు ఆందోళన చేస్తామని రైతులు స్పష్టం చేశారు. ఇకపై కేంద్రంతో చర్చలు ఉండవని రైతు సంఘాలు తేల్చిచెప్పాయి. పారిశ్రామిక వేత్తలు అదానీ, అంబానీ జియో ఉత్పత్తులను బహిష్కరిస్తున్నామని రైతులు ప్రకటించారు. డిసెంబర్ 14న దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని రైతు సంఘాలు హెచ్చరించాయి. ఈ నెల 12న జైపూర్- ఢిల్లీ హైవేపై ఆందోళన నిర్వహిస్తామని, ఈ నెల 12న దేశవ్యాప్తంగా టోల్‌ప్లాజాల వద్ద నిరసన తెలుపుతామని రైతులు తెలిపారు. 12వ తేదీ నుంచి బీజేపీ ఆఫీసుల ఎదుట నిరసనలు తెలుపుతామని రైతులు ప్రకటించారు. సోమవారం ఢిల్లీలో భారీ ప్రదర్శన చేస్తామని రైతులు హెచ్చరించారు

# కొనసాగుతున్న వరదసాయం

## 7939 మంది బాధితుల ఖాతాల్లో రూ. 7.90 కోట్ల జమ

హైదరాబాద్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): వరద బాధితులకు ఆర్థిక సహాయం అందించే పక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, అది కొనసాగుతున్నదని జీహెచ్ఎంసీ అధికారులు ప్రకటించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వరద బాధితులకు ఆర్థిక సహాయం పక్రియ నిన్నటి నుంచే ప్రారంభమైందని తెలిపారు. మంగళవారం ఒక్కరోజే 7939 మంది బాధితులకు రూ. 7.90 కోట్లను అందించామని, ఈ మొత్తాన్ని లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. ఆర్థిక సహాయం అందించే విషయంలో తమపై వస్తున్న ఆరోపణలను ఖండించారు.

# వనపర్తి అభివృద్ధికి నిధులు విడుదల

## -సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి

హైదరాబాద్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): వనపర్తి జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. వనపర్తి పట్టణంలో రహదారుల విస్తరణతో పాటు పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేసింది. రాబోయే రోజుల్లో వనపర్తి పట్టణంలో రహదారుల స్వరూపం మారనుంది. నాలుగు వరుసల రహదారులను ఏర్పాటు చేయనున్నారు. వనపర్తి జిల్లా అభివృద్ధికి భారీగా నిధులు విడుదల చేయడంతో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధుల్లో భాగంగా వనపర్తి పట్టణంలో నాలుగు వరసల రహదారి విస్తరణకు రూ.22.50 కోట్లు కేటాయించారు. జెర్రిపోతుల వాగు వద్ద బ్రిడ్జ్ కు రూ.2 కోట్లు, తాళ్లవాగు వద్ద బ్రిడ్జ్ కు రూ. 2.50 కోట్లు, వనపర్తి - బుద్దారం రహదారి విస్తరణకు రూ.6.50 కోట్లు, వనపర్తి - పెబ్బేరు రహదారి విస్తరణకు రూ.5.85 కోట్లు, చింతల హనుమాన్ వద్ద నల్ల చెరువు బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.5.65 కోట్లు కేటాయించారు. వీటితో ఆయా పనులను చేపడతారు.

# ఎమ్మెల్యే మహిపాల్ బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే

## -తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం డిమాండ్

హైదరాబాద్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): విలేకరి సంతోష్ నాయక్ ను బెదిరించడంతో పాటు, అసభ్యకర పదజాలంతో దూషించిన పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై కేసు నమోదైనంత మాత్రనా తాము శాంతించేది లేదని, జర్నలిస్టులకు, మీడియాకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీలు డిమాండ్ చేశారు. జర్నలిస్టులను దూషించడం, బెదిరింపులకు గురిచేయడం ఇది కొత్త కాదని, పదేండ్ల క్రితం ఆయన ఎంపీపీ అధ్యక్షుడిగా కొనసాగిన రోజుల్లో కూడా అక్కడి జర్నలిస్టుల పట్ల ఇదే వైఖరిని అనుసరిస్తే అప్పటి ఏపీయూడబ్ల్యూజే సంఘం అతనికి సరైన రీతిలో బుద్ధి చెప్పిందని శేఖర్, విరాహత్ అలీలు గుర్తుచేశారు. అతను ఎమ్మెల్యే అయ్యాక కూడా తన ప్రవర్తన మార్చుకోలేదని, ఇది మూడో సంఘటన అని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే పటాన్ చెరువు సంఘటనను కొన్ని రాజకీయ పార్టీలు సొమ్ము చేసుకునే వైఖరి మంచిది కాదని వారు సూచించారు. జర్నలిస్టుల ఐక్య పోరాటాలతోనే వీటిని తిప్పిగొడతామని, మీడియా పట్ల గానీ, జర్నలిస్టుల పట్ల గానీ ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా ఇలాంటి చేష్టలకు పాల్పడితే సరైన రీతిలో బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు. ఎమ్మెల్యే వైఖరి పట్ల నిరసన తెలిపేందుకు రేపు పటాన్ చెరువుకు టీయూడబ్ల్యూజే సైన్యం తరలివెళ్లనున్నట్లు వారు స్పష్టం చేశారు.

# మరో పదినెలల్లో కాజీపేట కొత్తబ్రిడ్జి పూర్తి

## పనులను పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి

వరంగల్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): కాజీపేట బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్‌సమస్య తగ్గిపోతుందని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఇప్పటికే పాత బ్రిడ్జి పై ఒత్తిడి బాగా పెరిగిందన్నారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పాత బ్రిడ్జిపై భారం తగ్గుతుందన్నారు. అంతేకాకుండా ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. కాజీపేట కొత్త బ్రిడ్జి పనులను మంత్రి ఎర్రబెల్లి మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ పనిచేస్తున్న కాంట్రాక్టర్లతో మాట్లాడారు. పనులు మరో 10 నెలల్లో పూర్తవుతాయని వారు మంత్రికి వివరించారు. పనులు వేగంగా నాణ్యతతో జరగాలని ఆదేశించారు.





## వాసా ఫౌండేషన్ మరియు నేటి నిజం దినపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి

## స్మారక కవితల పోటీలో

ఆసక్తిగా పాల్గొన్న వారందరూ అభినందనీయులు.

కరోనా మహమ్మారి విజృంభన నేపథ్యంలో ప్రజలెదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై "వలస కార్మికులు" అన్న అంశం మీద రెండు వందలకుపైగా కవులు, కవయిత్రులు స్పందించడం, లాక్‌డౌన్ సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న భయంకర పరిణామాలను కవులు హృదయావిష్కరణ చేశారు.

ఈ పోటీకి వచ్చిన కవితల నిశిత పరిశీలనానంతరం ఈ పేర్కొన్న కవితలను బహుమతికి అర్హంగా భావించి నిర్ణయించడమైంది.

## 'వలస కార్మికులు' కవితల పోటీ ఫలితాలు

| | కవిత పేరు | కవి పేరు |
|---|---|---|
| ప్రథమ బహుమతి రూ.5,000/-లు జ్ఞాపిక, ప్రశంసాపత్రం | దుఃఖగీతం | కొప్పోలు యాదయ్య. 9494273703 |
| ద్వితీయ బహుమతి రూ.2,500/-లు జ్ఞాపిక, ప్రశంసాపత్రం | మహా ప్రస్థానం | దేవ యనగందుల 9666036288 |
| తృతీయ బహుమతి రూ.1,000/-లు జ్ఞాపిక, ప్రశంసాపత్రం | ఎవరి మనుషులు వీళ్ళు | డా॥ఉదారి నారాయణ 9441413666 |



## ప్రోత్సాహక బహుమతులు


| | కవిత పేరు | కవి పేరు |
|---|---|---|
| ఒక్కొక్కరికి రూ.500/-లు జ్ఞాపిక, ప్రశంసా పత్రం | ఈ ప్రశ్నకు బదులేది | దోరవేటి 9866251679 |
| | పాదరక్ష | ఈతకోట సుబ్బారావు 9440529785 |
| | ఇంకా కుదుటపడని.. | వురిమళ్ల సునంద 9441815722 |
| | వలస బాటలు | డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు 9441046839 |
| | వలస దీపాలు | చొప్పదంటి సుధాకర్ 9177348349 |
| | వలస పాట | చిత్తలూరి 8247432521 |
| | వలస మా వారసత్వం | సి. నర్సప్ప 7989634754 |
| | వలసజీవుల లాంగ్‌మార్చ్ | బాలసాని నారాయణగౌడ్ కలంపేరు: సత్యావతి. 9440372842 |
| | అర్ధరాత్రి వేసిన తాళంతో | జోగు అంజయ్య 8008957480 |
| | వలస కార్మికులు | జవేరియా 8919147373 |



న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు డా॥ నాళేశ్వరం శంకరంగారికి ధన్యవాదాలు.

- ప్రకాశ్ వాసా, ఫౌండర్ వాసా ఫౌండేషన్

-బైస దేవదాసు, సంపాదకులు: నేటినిజం దినపత్రిక




# బాల వికాసం

## బాలవర్ధన్

ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల

( ప్రసిద్ధ జానపద కథ బాలనాగమ్మ కథ స్ఫూర్తితో ఆధునిక సృజన)




ప్రసిద్ధ బాలల రచయిత డా॥ వి.ఆర్.శర్మ కలం నుండిజాలువారిన ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల 'బాలవర్ధన్'. ప్రతివారం 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...

**15**

చుట్టూ కనుచూపు మేరంతా వరుసలు వరుసలుగా, పొరలు పొరలుగా కనబడుతున్న మంచు పర్వతాలు. అవి అంతూ పొంతూ లేనట్టుగా అనిపిస్తున్నాయి. అక్కడక్కడా నూరూ నూటయాభై అడుగుల ఎత్తు పెరిగి ఆకాశాన్ని పడిపోకుండా ఎత్తిపెట్టిన పిల్లర్లలా కనిపిస్తున్న దేవదారు, సరుగుడు, కోనిఫర్ వంటి మహా వృక్షాలు. కొండల నడుమ లోయల్లో నేల కనబడకుండా పరుచుకొని, పర్వతాలను చుట్టుకొని, అక్కడి ఏవో రహస్యాలను బయట పడకుండా దాచిపెడుతున్న మేఘాలు. కింద ఎక్కడా నేల కనబడని మంచు తెల్లటి ఎడారిలా, భరించ లేనంత తెల్లదనంతో కళ్ళు చెదరగొడుతున్నది.

వాళ్ళ వాహనం అక్కడికి చేరుకొని, వాళ్ళు బయట అడుగు పెట్టేసరికి నవ్వు మొహంతో ఎదురుగా నిలబడి ఉందొక పద్నాలుగేళ్ళ అమ్మాయి. గుండ్రటి మొహం. మిలమిలా మెరిసిపోతున్న అందమైన పెద్ద కళ్ళు. తెలుపుకన్నా నలుపే ఎంతో అందంగా ఉంటుందని ఆమెను చూస్తే ఎవరికైనా అనిపించేలా ఉంది. నీలి రంగు జిన్ ప్యాంట్ పైన రౌండ్‌కాలర్ చాక్లెట్ కలర్ టీషర్టు, పైనుంచి బూడిద రంగు నిండుచేతుల ష్వటర్ వేసుకుంది. భుజాల మీదకు వేలాడుతున్న శిరోజాలు. కాళ్లకు స్పోర్ట్ షూ కనిపిస్తున్నాయి. ఆ అమ్మాయి నిలబడ్డ పద్ధతి ఆమెకున్న ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని తెలియజేస్తున్నది.

"స్నేహితులకు స్వాగతం! నా పేరు ప్రాచీ. గిరి నా తమ్ముడు!" అంటూ, తన కుడిచేతిని షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ముందుకు జాపింది. "మిమ్మల్ని కలవడం ఎంతో సంతోషంగా ఉంది ప్రాచీ!" అన్నాడు ఆమెతో చేయి కలుపుతూ బాలవర్ధన్. రాము కూడా చేయి కలిపి చిరునవ్వుతో పలకరించాడు.

వాళ్లు బయటకు రాగానే ఆ వాహనం చిన్న చక్రంలా మారి ఆమె ఎడమ చేతిలోకి ఎగిరి వచ్చింది.

''ఏ ప్రాంతం ఇది?'' చుట్టూ కలియచూస్తూ అడిగాడు రాము.

'తెలియదు. హిమాలయాల్లో అని మాత్రం తెలుసు. ఇది ఏ ప్రాంతమో, ఏదేశమో నాక్కూడా తెలియదు.

హిమాలయాల్లో ఏదో ఒక చోట ఉన్నామని మాత్రం నాకు తెలుసు. ఈ ప్రాంతాన్ని గురించి బయటి ప్రపంచానికి కూడా బహుశా ఏమీ తెలిసివుండక పోవచ్చు. ఇక్కడ మన లోకపు ఏ విధమైన సిగ్నల్సూ, ఎలక్ట్రానిక్ సిస్టమ్ వస్తువులూ ఏవీ పనిచేయవు. ఏవిమానాలూ, సాటిలైట్లూ ఈ ప్రాంతం మీదినుంచి ప్రయాణం చేయవు. ఇదంతా మాయ సామ్రాజ్యం" చెప్పింది ప్రాచీ.

"సుమారు రెండువేల అయిదు వందల కిలోమీటర్ల పొడవున, దాదాపు ఐదు వందల కిలోమీటర్ల వెడల్పున, మూడు ప్రధాన శ్రేణులుగా, మరెన్నో ఉపశ్రేణులుగా, ఎన్నో దేశాలలో వ్యాపించి ఉన్న హిమాలయాల్లో ఎక్కడ ఉన్నామో మనం ఇక్కడ ఉండి ఊహించడం సాధ్యం కాకపోవచ్చు." అన్నాడు బాలవర్ధన్ చుట్టూ పరీక్షగా చూస్తూ.

"ఇలా ఈ మంచులో నిలబడి మాట్లాడుకోవడం సరికాదు. పదండి. మరో సురక్షితమైన చోటికి వెళ్దాం!" అని తాను వాళ్ల మధ్యలో నిలబడి, వాళ్ళ చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని గట్టిగా పట్టుకుంది ప్రాచీ. చటుక్కున వాళ్ళు అక్కడ మాయమై మరోచోట ప్రత్యక్షమైయ్యారు.

ఓ చిన్న గుహలా ఉందది. కానీ ఓ ఇంటిలా తీర్చి దిద్దినట్టుంది. లోపల సంధ్యాకాంతు ల్లాంటి అందమైన వెలుగులు. హాయిగొలిపే వెచ్చదనం. ఓ ఇంటిలో ఉన్న గదిలా అవసరమైన సామాగ్రి అంతా ఉంది అక్కడ. "ఇది నా నివాసం. కూర్చోండి" అంటూ వాళ్ళు కూచోవడానికి అక్కడ ఉన్న ఫేము కుర్చీలు చూపించింది ప్రాచీ. వేడి వేడిగా ఉన్న ఏదో సూప్‌లాంటి పానీయాన్ని ఇచ్చి "ఇది సేవిస్తూ మాట్లాడుకుందాం" అని, తానూ ఓ కుర్చీలో కూర్చుంది.

"ప్రాచీగారూ!..." అంటూ ఏదో అడగబోతున్న బాలవర్ధన్‌తో "నన్ను ప్రాచీ అని పిలవండి చాలు. అలాగే నేనూ మిమ్మల్ని వర్ధన్, రామన్నా అనే పిలుస్తాను, ఏమైనా అభ్యంతరమా?" చిరునవ్వుతో అడిగింది ప్రాచీ.

"ఔను, అదే బాగుంటుంది!" అంగీకారంగా తల ఆడిస్తూ అన్నాడు రాము. "నీకు మాయలూ మంత్రాలూ తెలుసా? అక్కడ మాయమై ఇక్కడ ఎలా తేలాం?" ప్రశ్నించాడు మళ్ళీ.

"మాయలూ మంత్రాలూ కాదు. ఇవి మాయ ఇచ్చిన యంత్రాలు" అంటూ తన రెండు చేతుల వేళ్ళను చూపించింది. వాటి చిటికెన వేళ్ళు, బొటన వేళ్ళు తప్ప మిగతా వేళ్లన్నిటికీ ఉంగరాలున్నాయి. కంచుతో చేసిన ఉంగరాల్లా కనిపిస్తున్నాయవి. "ఇవి ఉంగరాలు కాదు, యంత్రాలు. అత్యాధునిక శాస్త్రీయ పరికరాలు" చెప్పింది "ఐతే ఇలా వీటితో ఎక్కడికైనా మాయమై పోవచ్చా?"

"లేదు రామన్నా! ఇవి మాయ నిర్దేశించిన పరిధిలోనే పనిచేస్తాయ్. మీరు వచ్చిన వాహనంకూడా అలాంటిదే. అందుకే మన ఇష్టం ఉన్న చోటికి పోవడానికి వీలు లేదు" చెప్పింది ప్రాచీ.

"ఇంత మాడ్రన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నాడు! ఏ దేశం వాడీ మాయ? వాడి కార్య కలాపా లేమిటి? ప్రాచీ! నీకు తెలిసిన విషయాలు వివరంగా చెప్తావా?" అడిగాడు బాలవర్ధన్.

"చెప్తాను! అందరూ అనుకుంటున్నట్టు మాయ ఓ మాంత్రికుడు కాదు. అసలు ప్రాణే కాదు. అతడో యంత్రం. ఆర్టిఫిషల్ ఇంటలిజెంట్!" చెప్పడం ఆపి వాళ్ళ ముఖాలను చూసింది. వాళ్ళ ముఖాల్లో నమ్మలేనంత ఆశ్చర్యం. వాళ్ళ ఆశ్చర్యాని రెట్టింపు చేస్తూ మళ్ళీ చెప్పింది. "మరో లోకంనుంచి వచ్చిన శాస్త్రవేత్త మాయ. ఇక్కడ పరిశోధనలు చేయడానికి వచ్చిన ఓ రోబో అది!"

"నిజమా!..ఇదంతా నమ్మలేక పోతున్నాము. ప్రాచీ! నువ్వేం చదువుకున్నావ్? ఇన్ని ఇంగ్లీష్ మాటలు, సైన్స్ పదజాలం ఎలా ఉపయోగిస్తున్నావు నువ్వు? నీకు తెలుగు ఎలా తెలుసు?" బాలవర్ధన్ ప్రశ్నించాడు.

"కేవలం స్కూల్‌లో చదివిందే చదువుకాదు కదా వర్ధన్! మాయ శిష్యరికంలోనే ఇవన్నీ నేర్చుకున్నాను. తనే నేర్పాడు నాకు. తెలుగు మాత్రం మీ అమ్మ నాగమణి గారి దగ్గర నేర్చుకున్నాను."

నమ్మలేని విషయాలు అలా ఒకదాని వెంట ఒకటి వింటున్నారు వాళ్ళు. "అంటే మాయ గ్రహాంతర వాసులు పంపిన ఓ ఏలియన్ రోబోనా? ఓ ఆర్టిఫిషల్ ఇంటలిజెంటా?"

"ఔను! తన అసలు పేరు మాయ కాదు. దానికి మనం పెట్టుకుని పిలుచుకుంటున్న పేరు మాయ. తన అసలు పేరు ఏమిటో అది నేను అడిగినా చెప్పలేదు. అంతే కాదు. మనుషులు అనుకుంటున్నట్టుగా తను చెడ్డదీ, దుర్మార్గురాలూ, క్రూరురాలూ కాదు. తను తన జాతిని రక్షించుకోవడానికి పరిశోధన చేస్తున్న మెదడున్న ఓ యంత్రుడు అంతే."

"ఇలా మనుషుల్ని, ఆడవాళ్ళను ఎత్తుక పోవడం కూడా మంచి తనమేనా? ఎంత అమానుషం ఇది" రాము అసహనంగా కోపంగా ప్రశ్నించాడు. అలా మాయ మంచిదంటూ ప్రాచీ మాట్లాడ్డం రాముకు నచ్చలేదు. చాలా అసహనాన్ని కలిగించింది.

''ఔను రామన్నా! మన లెక్క ప్రకారం అది అమానుషమే. కానీ మనుషులు మాత్రం జంతువుల మీద, ఇతర ప్రాణులమీద ఎన్ని ప్రయోగాలైనా చేయొచ్చు. అంతేకాదు, అమాయకులైన మనుషులను మోసంచేసి, డబ్బిచ్చి, ఎత్తుకు పోయి ప్రమాద కరమైన ప్రయోగాలు చేయొచ్చు" కొంచం విసురుగానే మాట్లాడింది ప్రాచీ బాలవర్ధన్ కల్పించుకోకుండా నిశ్శబ్దంగా వింటున్నాడు. రాము ఏదో అనబోతుంటే ఆగుమన్నట్టుగా చేత్తో వారిస్తూ తనే మాట్లాడింది ప్రాచీ, "రామన్నా! ఈ మాయ ఎవరినీ చంపలేదు. అది ప్రయోగాలు చేస్తుంటే కొందరు చనిపోయి ఉండొచ్చు. ఆ ప్రయోగాలు సక్సెస్ కాకపోవడం వల్ల."

"అవి ఏం ప్రయోగాలో తెలుసా ?" ప్రశ్నించాడు బాలవర్ధన్.

''ఏదో వైరస్ కు విరుగుడు మందు కనిపెట్టడానికి, వ్యాక్సిన్ ఏదో తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు మాత్రం తెలుసు. అంతే..."

"ఆ ప్రయోగాలేవో వాళ్ళ గ్రహం లోనే చేసుకోకుండా ఇంతదూరం వచ్చి చేయడానికి కారణం ఏమిటో ఏమైనా తెలుసా ? "

"ఉహు, తెలియదు."

కొద్దిసేపు ఏదో ఆలోచిస్తూ ఉన్నాడు బాలవర్ధన్. కొంతసేపటికి ఏదో జవాబు దొరికినట్టు తల పంకిస్తూ అన్నాడు, "ప్రాచీ! ఇది మాయ మంచి చెడ్డలకు సంబంధించిన అంశం కాదేమో! ఇది కేవలం మన వాళ్ళను కాపాడుకోవడానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదని నాకు అనిపిస్తున్నది. మొత్తం మానవ జాతిని రక్షించుకునే సమస్య మన ముందుందేమో! నా సిక్స్‌సెన్స్ అలా చెప్తున్నది. కొంచం ఆలోచించి చూడు. మామూలు వైరస్‌కు చెందిన ప్రయోగాలకోసం మరో గ్రహం నుంచి ఇలా రావడం అసహజంగా లేదా?"

"నిజమే!" వెంటనే అంది ప్రాచీ. "నువ్వు చెప్తుంటే నిజమే అనిపిస్తున్నది. నాకూ ఈ సందేహం వచ్చింది. తరువాత ఆ ప్రయోగం మీ అమ్మ మీదనే చేయబోతున్నాడు మాయ. కనుకనే హుటాహుటిన మీరు ఇక్కడికి వచ్చేలా చేశాను." చెప్పింది ప్రాచీ.

"మేం ఇక్కడికి వచ్చిన విషయం మాయకు తెలుసా?"

"తెలియదు. తెలిసే అవకాశం లేదు. తను ఇక్కడి స్థావరంలో ఈరోజు లేదు. కనుకనే మిమ్మల్ని రప్పించాను. కానీ రాత్రికల్లా వచ్చేస్తాడు. తను వచ్చేలోగా మనం మాయ స్థావరానికి వెళ్ళి, మీ అమ్మను కలుసుకోవాలి. నువ్వు వస్తున్నావని మీ అమ్మకు చెప్పాను. మాయకు సంబంధించిన విషయాలూ, రహస్యాలూ అన్ని మాయను మాయచేసి అడిగి తెలుసుకొమ్మని చెప్పాను. ఈ పాటికి ఆ విషయాలన్నీ మీ అమ్మ తెలుసుకునే ఉంటుంది."

"ఆ విషయాలు మాయ మా అమ్మకెందుకు చెప్తాడు?"

" చెప్తాడు. ఎందుకంటే ఈ ప్రయోగం విజయవంతం కావాలంటే అందుకు మీ అమ్మ సహకారం మాయకు కావాలి. పూర్తిగా శారీరకంగా, మానసికంగా సహకరించే వాళ్లమీద ఆ ప్రయోగం చేస్తేనే అది సక్సెస్ అయ్యే అవకాశం ఉందట. అలా ఇంత వరకు ఎవరూ సహకరించలేదు. ఎందుకంటే ఆ ప్రయోగంలో వాళ్ళు బతికే అవకాశాలు వన్‌పర్సెంట్ కంటే తక్కువ. అందుకే ఇక్కడికి మాయ ఎత్తుకొచ్చిన వాళ్ళెవరూ సహకరించలేదు. తాను సహకరిస్తానని చెప్పి, అలా నటించి మాయ రహస్య విషయాలు తెలుసుకొమ్మని నేనూ, మా అమ్మా మీ అమ్మకు చెప్పాం. అలా మీఅమ్మ తాను సహకరిస్తానని మాయతో చెప్పింది. అందుకు బదులుగా 'మాయ తన వివరాలతో బాటు, ఆప్రయోగం ఏమిటి? ఎందుకు, ఎక్కడ జరుగుతుంది? మొదలైన వివరాలన్నీ తనకు చెప్పాలని' షరతు పెట్టింది. ఆ వివరాలన్నీ నిన్ననే మాయ మీ అమ్మకు చెప్పాడని మా అమ్మ నాకు కబురు పంపింది."

"ఐతే మనం వెంటనే అక్కడికి వెళ్ళి మా అమ్మను కలుద్దాం. ఆ విషయాలన్నీ అడిగి తెలుసుకుందాం. మంచి చెడుల ప్రసక్తి తర్వాత ఆలోచిద్దాం. ముందు ఆ ప్రయోగాలను అడ్డుకుందాం." ఉత్సాహంగా అన్నాడు బాలవర్ధన్.

"ప్రాచీ! ఆ మాయ ఇప్పుడు మరెక్కడికో వెళ్ళాడన్నావు కదా. మరి ఇప్పుడే అందరినీ మనం అక్కడుంచి తప్పించి, విడిపించి తీసుకొని పోవచ్చు కదా?" అడిగాడు రాము.

"అసాధ్యం! ఆ స్థావరం లోంచి అలా బయట పడడం సాధ్యం కాదు. అసలు ఆ స్థావరంలో ఎక్కడో ఉన్న వాళ్ళను కలవడం కానీ, చూడడం కానీ మాయ అంగీకరిస్తే తప్ప సాధ్యం కాదు."

"మరి నువ్వూ, మీ అమ్మా స్వేచ్ఛగానే ఉన్నారు కదా?"

మా అమ్మ గత పదమూడేళ్ళుగా మాయకు నమ్మిన బంటులాగా కావలసిన పనులు చేసి పెడుతున్నది. ఆమెను తనకు అవసరమైన పనులు చేయించు కోవడానికే తెచ్చాడిక్కడికి. మా నాన్నను రక్షించు కోవడానికి మరో మార్గం లేదని అర్థం చేసుకున్నది మా అమ్మ. మాయకు అవసరమైన పనులు శ్రద్ధగా చేసి పెడుతూ పూర్తి నమ్మకాన్ని సంపాదించుకున్నది. తన దగ్గరికి నన్ను రప్పించుకున్నది. క్రమంగా నన్ను కూడా నమ్మి కొన్ని, కొన్ని పనులు, బాధ్యతలు నాకు అప్పగిస్తున్నాడు మాయ. కొంత కాలంగా మాయ శరీరంలో ఏదో సమస్య ఏర్పడుతున్నది. ఉండి ఉండి నీరసంగా కూర్చుండి పోతాడు. తన కమ్యూనికేషన్ వ్యవస్థలో కూడా ఏదో అంతరాయం కలుగుతున్నట్టుంది. అలాంటి సమయంలో నాతో చెప్పి, ఏవేవో నాకు అర్థంకాని పనులు కూడా ఎలా చెయ్యాలో చెప్పి చేయిస్తాడు. అలా చేసిన వెంటనే కోలుకుంటాడు. నేనంటే ఎందుకో చాలా ఇష్టం ఉన్నట్టు మాట్లాడుతాడు. తనకు నాలాంటి కూతురు ఉంటే బాగుండేది అంటాడు. మాయ అనే ఆ యంత్రానికి కూడా ఏదో తెలియని మానసిక బంధం ఏర్పడినట్టుంది విచిత్రంగా."


కొంత సేపాగి మళ్ళీ చెప్పింది ప్రాచీ "మాయకు కూడా తన ప్రయోగం పూర్తి చేసుకుని, తన గ్రహానికి వెళ్ళి పోవాలనే ఉన్నది. మాయకు ఇక్కడ ఎవరికీ కావాలని కీడు చేసే ఉద్దేశ్యం లేదని మాకు అర్థమైంది. మేం కూడా మన వాళ్ళను క్షేమంగా విడిపించి తీసుకొని పోయే అవకాశం కోసమే ఎదురు చూస్తున్నాం. పరిమితమైన స్వేచ్ఛతో ఉంటున్నాం."

"యంత్రానికి కూడా అనుబంధాలు కలిగించే గుణం ఇంకా మనుషుల్లో మిగిలివుండడం మన అదృష్టం!" అన్నాడు రాము.

"సరే, ఇప్పటికే ఆలస్యమైంది. ఇక మనం వెళ్ళాలి. కానీ, రామన్నా!...అక్కడికి ఒక్కడినే తీసుకెళ్ళే అవకాశం ఉంది. కనుక నేనూ, బాలవర్ధన్ వెల్తాం. నువ్వు ఇక్కడే ఈ ఇంట్లోనే వేం వచ్చేవరకు ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు పోకూడదు...సరేనా రామన్నా!"

"ఇన్ని రోజులకు మళ్ళీ నాగమ్మగారిని చూస్తానని అనుకున్నాను. కానీ నా బ్యాడ్‌లక్. సరే, ఏంచేస్తాం. కానివ్వండి. కనీసం బాలవర్ధన్‌కైనా వాళ్ళ అమ్మను చూసే అవకాశం కలుగుతున్నది...రైట్!" అంటూ ఒప్పుకున్నాడు రాము.

(సశేషం..)



-డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749

---

## బాల గేయం

### శీతాకాలం


శీతాకాలం వస్తుంటే
చలి చలి గాలులు వీస్తుంటే
చిన్నారులను జలుబు వ్యాధులు
చిత్రంగా వేధించే మాసం!

అందుకె అంతా ముందు చూపుతో
అన్ని శ్రద్ధలూ పాటించాలి!
హృదయం, చెవులు, తలరక్షణకై
ఉన్ని దుస్తులను ధరియించాలి!

మసక వెలుగులో గాకుండా
మంచి ఎండలో చరియించాలి! ॥శీ॥

ఉబ్బసమ్ముతో గాలి పీల్చుకొని
ఇబ్బందులు ఎదురవుతుంటే
వైద్యుల్నే సంప్రదించాలి!
వ్యాధుల్ని నివారించాలి!

జామ, నిమ్మ, దానిమ్మలతో
జలుబునెల్ల అరికట్టాలి!
వ్యాయామం, ప్రాణాయామంతో
ఆరోగ్యం జతగట్టాలి!



– డా॥ వద్దేపల్లి కృష్ణ
9246541699

### బోరు కొడుతోందా?

పొద్దు పోవడం లేదా?
బోరు కొడుతోందా?
అలా అనిపిస్తోందంటే మీరు బోల్తా పడ్డట్టే
కాలంతో పాటు సాగితే
బోరు ఎప్పుడూ చెంత చేరదు
మనిషెపుడూ వర్తమానంలో బతకాలి
పనులు ఇంకా బోలెడన్ని
పనుల విస్మరణలో కాలం గడుపుతూ
వర్తమానాన్ని గాలిలో కలిపేసి
భూతకాలాన్ని తిరగదోడుతూ
చెరపలేని జ్ఞాపకాల ధ్యాసలో
వర్తమానం సమాధి అవుతోంది
గతజల సేతుబంధమెందుకు
భవిష్యత్తులోనూ
బతుకు వృధా చేయకు
ఎప్పుడేమవుతుందో తెలియక
తెగని తలపులతో హీనంగా
బతుకు గడపడమెందుకు
వర్తమానం విలువ తెలియడం వల్లే
నవీన ఆవిష్కరణలు పురుడు పోసుకున్నాయి
నువ్వూ అదే మార్గంలో నడువు
కాలం విలువ తెలిస్తేనే
సఫలీకృతుడివి అవుతావు.



-ఆచార్య సువర్ణ అలివేలు,
98660 75231

### మంచు తెరలు

దేహాన్ని కంబళి తో పొట్లంలా చుట్టేసి
తాబేలు లా కాళ్ళు చేతులు ముడిచి
చలించ కున్న వెన్ను తట్టే చలి పులి

పొగ మంచు అలుముకున్న తొలి పొద్దు
కన్నుల విందు వీక్షించ మంచు పొరలు
తెల్ల వోణి ముసుగు అలవోకగా వేసి
తొంగి చూస్తున్న చక్కని పడతిలా!

చలి మంటల వెచ్చదనాన్ని ఆస్వాదిస్తూ
హేమంతములోని చలికి అడ్డు కట్ట వేస్తూ
నలుగురు చేరి నచ్చిన కాలక్షేపం చేస్తూ
కాలాన్నే మరచిన తీరు కనిపిస్తుంది

ఉదయపు నడక కోసమో!
రోజూ వారీ పనులకోసమో
మంచు పొరలను చీల్చుకుంటూ ముందుకు వెళితే..
వణుకు అప్పుడు చలికేనా!

ప్రకృతి మాత్రం పరవశిస్తుంది ఎప్పటిలాగే
అన్ని కాలాలు ఇష్టమే నాకు అంటూ
మంచులో మురిసిన..వానలో తడిసిన
వేడి సెగలకు అలసినా సాగాల్సిందే!



-లక్ష్మి మదన్
9959186838

---

## ఎవరు గొప్ప (కథ)

రామాపురం అనే ఊరిలో రాము,సోము,భీము అనే ముగ్గురు స్నేహితులు ఉండేవారు. చిన్నప్పటి నుండి కలిసి మెలిసి తిరిగేవారు. రాము కాపు కుటుంబమునకు చెందినవాడు. రాము పంటలు పండించే రైతు. సోము కుమ్మరి, కుండలు తయారు చేస్తాడు. భీము చాకలి, ప్రతిరోజు బట్టలు ఉతుకుతాడు.

చెరువు గట్టున భీము బట్టలు ఉతికేవాడు. చెరువు ప్రక్కన రాము పొలం ఉండేది. రాము పొలం ప్రక్కన సోము కుండలు తయారు చేసేవాడు. ఇలా ముగ్గురు ఒకే దగ్గర పని చేస్తున్నారు. ఒకరోజు ముగ్గురు పని చేస్తుండగా

"నేను ఎంతో గొప్పవాడిని, నా కులం చాలా గొప్పది " అన్నాడు సోము. అది విని రాము "మీ కులం కంటే మా కులమే చాలా గొప్పది " అన్నాడు. అప్పుడు భీము " కాదు, మా కులమే గొప్పది " అని అన్నాడు.

" మీరు పండించిన పంట ధాన్యాలు దాచుకోవడానికి కుండలు కావాలి. అవి మేమే చేస్తాము. కాబట్టి మేమే గొప్ప " అన్నాడు సోము.

దానికి రాము జవాబు గా "మీరు తినడానికి కావలసిన ఆహారం మేమే పండిస్తాము .కావున మేమే గొప్ప "అని అన్నాడు. అప్పుడు భీము కూడా

"మీరు వేసుకునే బట్టలు మేమే ఉతుకుతాము . మేమే గొప్ప " అన్నాడు. ఇలా ఈ ముగ్గురి స్నేహితుల మధ్య గొడవ మొదలయింది.

అటు వైపు నుండి వెళ్తున్న ఒక పెద్దమనిషి వచ్చి వీరి గొడవ ను ఆపి ఇలా అన్నాడు

" మీరు ఎందుకు గొడవ పడుతున్నారు " అందుకు వారు ముగ్గురు " ఈ సమాజంలో ఎవరు గొప్పవారు, ఏ కులం గొప్పది "అని అడిగారు. దానికి ఆయన "ఈ సమాజంలో ఎవరు తక్కువ కాదు, ఎవరు ఎక్కువ కాదు"అన్నాడు.

"అదెలా సాధ్యం " అడిగారు ముగ్గురు స్నేహితులు.

"కాపు కులం లేకపోతే మనకు ఆహారం ఉండదు, కుమ్మరి కులం లేకపోతే ధాన్యం దాచుకోవడానికి కుండలు ఉండవు. చాకలి కులం లేకపోతే బట్టలు ఉతికేవారు ఉండరు. బట్టలు మురికిగా ఉంటాయి. ఇవే కావు, అన్ని కులాలు గొప్పవి. వారు చేస్తున్న పనులు కూడా " అర్థమయ్యేలా చెప్పి వెళ్లిపోయాడు పెద్దమనిషి. ఆ తరువాత ముగ్గురు ఆయన చెప్పిన మాటలు విని ఆలోచించారు. కులాలనే అడ్డుగోడలు లేకుండా జీవించాలనుకున్నారు.

నీతి : మనిషి అనేవాడు ఏ కులవృత్తిలో నైన పని చేయవచ్చు. కానీ ఆ పనికి వారి కులమే అడ్డు రాకూడదు. కులాలనే అడ్డుగోడలు తీసివేసి సంతోషంగా జీవించాలి.



- మట్టే తేజస్విని
8వ,తరగతి
జక్కాపూర్ సిద్దిపేట జిల్లా -502276
సెల్ :80081 68642

---

## చదువులమ్మ

బాతమ్మనడిగి
బంతిపూలు తెచ్చా
కొంగమ్మనడిగి
కనకాంబరం తెచ్చా
చిలకమ్మనడిగి
చామంతులు తెచ్చా
కోయిలమ్మనడిగి
కాకడాలు తెచ్చా
ఉడతమ్మనడిగి
మల్లెపూలు తెచ్చా
కోడెమ్మనడిగి
సంపంగులు తెచ్చా
హంసమ్మనడిగి
మందారాలు తెచ్చా
పిచ్చుకమ్మనడిగి
సన్నజాజులు తెచ్చా
పూలన్ని మాలచేసి
చదువులమ్మకిచ్చా.



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
944179139

## మనిషొక విషాద గీతం!

ఎన్ని దీపాలు వెలిగించినా
వెలుగు వెలుగులా లేదు
చీకటి నీడలా ఉంది!
పంటి బిగువన
బతుకు బండి లాగుతున్నా
భయమొకటి వెంటాడుతునే ఉంది!
ఫోన్లో అవసరానికి మించే
మాట్లాడుకుంటున్నా
ఎదుట మనిషి కానరాక దిగులు!
యుద్ధం వచ్చినా బాగుండు
విజయమో వీర స్వర్గమో తేలిపోయేది
కలుగులోని ఎలుకలా ఏందీ బతుకు?!
ఒక్క
అకాల మరణాన్ని జయించడానికి
భూగోళం పండుటాకై వణికిపోతున్నది!
భయంతో విడివిడిగా మనం
వడివడిగా కాలం
కవీ! ఈ అర్థ రహిత జీవిత మెంత కష్టం!
ఆశ నిరాశల మధ్య
నలిగిపోతున్న మనిషి
ఇప్పుడొక విషాద గీతం!!



-కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261.

## బతుకు పువ్వు నవ్వింది

బతుకు పువ్వు నవ్వింది
సమస్యల ఆకులు ముడుచుకున్నాయి

ఈ పువ్వే కదా...
కాయై పండిపోయేది
పండడం ప్రకృతికి వెన్నతో పెట్టిన విద్యలే...
మరి...వెన్న యాడుంటారా...
భలే వారే ఆ నవ్వులో
నాజుగ్గా కనబడుతుందిగా...



-అభిరామ్
9704153642

---

## నేటి నిజాలు

నేనుసైతం.. కాళ్ళు మోపని దేశం
నేను సైతం' అటకెక్కించుకునే తడుస్తానంటుంది
ఆత్మవిశ్వాసం తోడుండే చాలు
అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తానంటుంది
అంగవైకల్యం దేనికైనా కాదే.. మనసుకు కాదుకదా ?
విజయం సాధించేదాకా
ఈ పోరాటం ఆగదంటుంది.. అంతే కద..!

- కెరె జగదీష్



---

## సంపుటాల పోటీలు

భువన సాహిత్య విజ్ఞాన వేదిక జిల్లా పెద్దపల్లి తెలంగాణ ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కారం 2021 కి గాను స్వీయ ముద్రిత గ్రంథాల పోటీలను నిర్వహిస్తున్నాము.

పద్య, వచన,కథ,నవల, నూతన ప్రక్రియలలో 2000 నుండి 2020 వరకు ముద్రితమైన సంపుటాలను పోటీకి పంపవచ్చు..

పోటీ కోసం తప్పకుండా 3 పుస్తకాలు పంపాలి..

పద్య,వచన,కథ,నవల,నూతన ప్రక్రియలలో గెలుపొందిన పుస్తకాలకు విడివిడిగా పురస్కారం అందించబడును అదేవిధంగా 5 పుస్తకాలకు ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేయబడును.

**మీ పుస్తకాలు చేరడానికి చివరితేది 30.01.2021.**

మీ పుస్తకాలు పంపవలసిన చిరునామా.

-దూడపాక శ్రీధర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు భువన సాహిత్య విజ్ఞాన వేదిక.

ఇంటి నంబరు: 20-126/24, కూచిరాజ్ పల్లి, పోస్ట్ : మంథని, జిల్లా: పెద్దపల్లి.పిన్ : 505184 తెలంగాణ సెల్ : 966637577.

పూర్తి వివరాలకు 9666375277 లో సంప్రదించగలరు.

### డా॥ నాగభైరవ అవార్డు కమిటీ-నెల్లూరు

### ఉత్తమ విమర్శ గ్రంథ పురస్కారం-2019 ఫలితాలు

**ప్రథమ బహుమతి:** **పుట్ట బంగారం,**
రచయిత **శ్రీ గుడిపాటి**-హైదరాబాద్,
**విజేతకు రూ.5,000/-నగదు**
**మరియు సత్కారం ఉంటుంది.**



**మరో మూడు ప్రత్యేక బహుమతులు**

1 **బలుపు**- డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు
2. **అనంత పద్యం**- డా॥ అమళ్ళదిన్నె వెంకట రమణప్రసాద్, అనంతపురం
3. **అద్దేపల్లి శ్రీశ్రీ కవితా ప్రస్థానం**- శ్రీ కెవి. రమణారెడ్డి, మార్కాపురం
విజేతలకు **రూ.1,000/-లు** నగదు మరియు సత్కారం ఉంటుంది.

త్వరలో జరుగబోవు డా॥ నాగభైరవ 10వ అవార్డు ప్రదాన కార్యక్రమంలో పైన పేర్కొన్న విజేతలకు బహుమతి ప్రదానం గావించబడును.

న్యాయ నిర్ణేతలుగా శ్రీ మేడిపల్లి రవికుమార్, శ్రీ మోపూరు వేణుగోపాలయ్యలు వ్యవహరించారు.

**-వెన్నెలకంటి,** అధ్యక్షులు **-చిన్ని నారాయణ,** ప్రధాన కార్యదర్శి

---

ప్రతికూల భావజాలం తీరుతో
ప్రయోజనమేమైనా ఉంటే
నాకు మరవకుండా చెప్పండి.
(Negative attitude) మెంబర్ షిప్ ని
పెద్ద సంఖ్యలో పెంచుదాం...!

సానుకూల దృక్పథం,
(Positive attitude)సకారాత్మక వైఖరి,
సడలని ప్రయత్నాలే
జిరాఫీలాంటి జాతినే అందించాయి.
(పొట్టి మెడ) జంతువుకే అంత ఉంటే..
(ఎంతో పొడవైన అనుభవం,
జ్ఞానమున్న) మనిషికి ఎంత ఉండాలి !

-మునిమడుగుల రాజారావు

---

## రాత - గీత


### శంఖారావం

ఆకలి పుడమి నుండి
ఆవిర్భవించిన
ఆర్తనాదమే
'విప్లవం'



### హమాలి

భూగోళాన్ని
భుజంపై మోస్తున్న
అట్లాస్ వీరుడు





రాత-శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత-వర్చస్వి

## నమ్మలేని నిజాలు

కవిత వేస్తాం
పత్రిక ప్రకటన
పంపాలి రొక్కం.

ఆకలి జ్వాల
పిడికెడంత బువ్వ
రాచదహనం.

తేడలేనిది
బూతు సర్వాంతర్యామి
మాటల బాంబు

ఊబిలో దున్న
మారని అలవాట్లు
సాగని సాగు.

యువ మేధావి
దిగితే దివికేదారి
మత్తుల ఊబి



- రేడియమ్
సెల్: 9291527757



నేటినిజం
# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

గురువారం 10-12-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3



## శ్రీనిజాలు

ఐదుసార్లు చర్చించగ
తయ్యారైన విందు!
అఖిలవిపక్ష, కార్మికుల
అదే భారత్ బంద్!

పనికిరాని పనిచేయని
పనిలేని పాతచట్టం!
రైతు రాజ్య సంక్షేమం
రావాలి కొత్త చట్టం!



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


# భావ ప్రకటనాదీప్తి డా॥ కేతవరపు రాజ్యశ్రీ: డా॥ కె.వి. రమణాచారి

ప్రపంచాన్ని చూసి, స్పందించి కవిత్వం వ్రాసే కవులు, రచయితలు కరువైపోతున్న ఈ రోజుల్లో ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న భయంకర మహమ్మారి కరోనా విలయతాండవాన్ని నిశితంగా పరిశీలించి సమాజానికి కవితల రూపంలో సందేశమిచ్చిన భావ ప్రకటనాదీప్తి డా॥ కేతవరపు రాజ్యశ్రీ అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్ డా॥కె.వి.రమణాచారి అన్నారు. అలాగే నియోగి ఋషితుల్యుడని, మహాను భావుడు, విస్మృతకవి, పండితుడు, పంచసహస్రావధాని జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రిని తెలుగులోకి తీసుకు కావడం మన అదృష్టమని ఆయన అన్నారు. ప్రముఖ సాంస్కృతిక, సాహిత్య సేవాసంస్థ జీవిఆర్ ఆరాధన కల్చరల్ అసోసియేషన్, కేతవరపు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం రెడ్‌హిల్స్‌లోని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో ప్రముఖ రచయిత, విమర్శకుడు నియోగి రచించిన 'అక్షరాల అడుగుజాడల్లో పంచసహస్రావధాని' (జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రిగారి సాహితీ సమాలోచన-విమర్శ), భారత్ భాషాభూషణ్ డా॥కేతవరపు రాజ్యశ్రీ రచించిన "కరోనా.. టూరిస్టు కాదు" (లఘు కవితలు) పుస్తకాల ఆవిష్కరణ సభ ఘనంగా జరిగింది. రచయిత్రి, ప్రభుత్వ పూర్వ ఉపకార్యదర్శి డా॥ కేతవరపు రాజ్యశ్రీ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి, పుస్తకాల ఆవిష్కర్తగా డా॥కె.వి. రమణాచారి, విశిష్ట అతిథులుగా సీనియర్ సంపాదకుడు బైస దేవదాసు, జి. కష్ణవేణి, గుదిబండి వెంకటరెడ్డి, చంద్రాదిత్య, జంధ్యాల కుసుమ కుమారి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ముందుగా ముఖ్య అతిథి డా॥కె.వి.రమణాచారి చేతుల మీదుగా 'అక్షరాల అడుగుజాడల్లో పంచసహస్రావధాని, కరోనా టూరిస్టు కాదు' పుస్తకాలను ఆవిష్కరింపజేసి 'కరోన టూరిస్ట్ కాదు' తొలి ప్రతిని నిమ్స్ వైద్యుడు డా॥ పరంజ్యోతికి అందజేసి సత్కరిం చారు. అనంతరం రమణాచారి మాట్లాడుతూ ప్రపంచ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ కనీవినీ ఎరుగని విలయాన్ని సృష్టిస్తూ ప్రపంచ దేశాలన్నింటినీ గడగడలాడించిన మహమ్మారి కరోనా ప్రారంభం నుండి ఇప్పటిదాకా దాని పూర్వాపరాలను నిశితంగా పరిశీలించి, కవితా రూపంలో అక్షరీకరణ చేసి తన కవిత్వం ద్వారా కేతవరపు రాజ్యశ్రీ సమాజానికి మంచి సందేశాన్ని చారని కొనియాడారు. నియోగి తెలుగు జాతి చరిత్రజ్ఞానం కలిగివున్నారని, ఆయనే గ్రంథం వ్రాసినా సమగ్రంగా పాఠకులకు విలువైన విషయ పరిజ్ఞానాన్ని అందిస్తుందని, అందుకే నిదర్శనమే అక్షరాల అడుగు జాడల్లో పంచసహస్రావధాని గ్రంథమని స్పష్టం చేశారు. ఈ గ్రంథంలో తర్కం, వ్యాకరణం, మీమాంస, అలంకారశాస్త్రాలు ప్రస్ఫుటిస్తాయని, ఇలాంటి మరిన్ని గ్రంథాలను ఆయన రచించిన నేటి, రాబోయే తరాలకు అందించాలని ఆకాంక్షించారు.




డిసెంబర్ 5 శనివారం డా॥ కేతవరపు రాజ్యశ్రీ రచించిన "కోరోనా.. టూరిస్టు కాదు" కవితా సంపుటి ఆవిష్కరణ సభలో గుదిబండి వెంకటరెడ్డి, జి. కృష్ణవేణి, డా॥ పరంజ్యోతి, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥కె.వి. రమణాచారి, డా॥ కేతవరపు రాజ్యశ్రీ, నియోగి, జంధ్యాల కుసుమ కుమారి, చంద్రాదిత్య




నిమ్స్ వైద్యులు డా॥ పరంజ్యోతికి మొదటి ప్రతిని అందజేసి సత్కరిస్తున్న బైస దేవదాసు, డా॥కె.వి. రమణాచారి, డా॥ కేతవరపు రాజ్యశ్రీ

# "ఆర్తి" చిప్పిల్లిన బైరెడ్డి కవిత్వం







బైరెడ్డి కృష్ణారెడ్డిది నాలుగు దశాబ్దాల కవన ప్రస్థానం. మొట్టమొదటి కవితా సంపుటి 2000 సం॥లో, మలి సంపుటి 2002 సం॥లో మూడవ సంపుటిని 2007 సం॥లో వెలువరించిన బైరెడ్డి యిప్పుడు తాజాగా తన నాలగవ కవితా సంపుటితో బాటు తన కవితలన్నీ ఒకచోట పేర్చి సమగ్ర సంకలనం ప్రకటిస్తున్నాడు. విశేషం ఏమిటంటే ఆయన సంపుటాల శీర్షికలన్నీ 'ఆర్తి' కావడం. ఆర్తి అంటే దుఃఖం.. వేదన లేదూ ఆర్ద్రత. ఉద్వేగంతో గుండెలోతుల్లోంచి ఎగిసిబడ్డ కవిత్వం. అక్షరాలు పాఠకుల గుండెల్ని తడి తడిగా స్పృశిస్తున్నాయి. ఆర్తి అంటే మరో అర్థం 'హారతి'. తన కవిత్వాన్ని అక్షర హారతిగా కూడా అన్వయించుకోవచ్చు.

బైరెడ్డి కవిత్వంలో ఒక ప్రత్యేకత పాఠకుణ్ని యిట్టే ఆకర్షిస్తుంది.

"ప్రసవ వేదనల పెల్లుబికిన
ఆమని వనికందులు నా
కవితలు" అంటున్న ఈ కవిత "పురుడు" గమనిద్దాం.

**దుర్భేద్యపు నిగూఢాన్ని**
**యుగాలుగా పుక్కిట పుణికిన**
**అంతు తెలియని సృష్టి**
**సృష్టి ఎల్లెడలందా విష్మృతమై వున్న**
**అనంత సౌందర్య లహరుల**
**అవిరళ నర్తనం.**
...
**మోహార్తి తాపాల చెరనుండి**
**విముక్తి కాంక్ష**
**విముక్తి కాంక్షించి**
**పచ్చదనాల క్రొవ్విన ప్రకృతి కౌగిట**
**ఆనంద రతికేళి**
**శ్వాస నిశ్చేష్టమౌ రతికేళిహేలలో**
**దాహం అసలే తీరక**
**వాపోయిన అంతరంగం.**

మరో కవితలోని పంక్తులని గమనిద్దాం.

**ధరణి పులకరిస్తుంది**
**చినుకుల మునివేళ్ళ తాకిడితో**
**చినుకు కురుస్తుంది**
**మేఘాల గుండెలు కరిగిపోవడంతో**
**మేఘాలు ఆవిర్భవిస్తాయి**
**అఖాత జలాలు ఆవిరవడంతో**
**అఖాత జలాలు ఆవిరిలౌతాయి**
**అగ్ని సెగలు చిలికే వేడిమిలతో.**
...

యిలా లయబద్ధంగా పాదం చివరి పదాన్ని రెండో పాదం మొదట వాడుతూ ఒక పద సమూహం రెండో పద సమూహంలోకి చొచ్చుకుపోతూ.. పదం పునరావృతమైనా వేరే అర్థాన్ని స్ఫురింపజేస్తు చదువరులకు చక్కని అనుభూతుల్ని కలుగజేస్తుంది. ప్రాచీన కవిత్వ నిర్మాణంలో ఈ శిల్పాన్ని మనం గమనించవచ్చు. 'ముక్త పదగ్రస్త'మనే ఈ అలంకారాన్ని బైరెడ్డి చాలా కవితల్లో ప్రయోగించాడు. ఒక ధారగా, గొలుసులు గొలుసులుగా కట్టలు తెంచుకుని ఉప్పొంగిన ఉద్వేగానికి ప్రతీకగా నిలుస్తుంది ఈ ప్రయోగం.

**"అహర్నిశలు స్రవించే**
**నయాగరా జలపాతపు హెూరు**
**నా కవన కేతనం"** అని ప్రకటిస్తున్న ఈ కవి కలం నుండి తాత్వికత చిప్పిల్లిన సందర్భాలు అనేకం.

**"నేడు నిజమైతే.. నిన్న ఒక భ్రమ**
**రేపొక శూన్యం"**
ఏమిటీ శూన్యం? ఏమని నిర్వచిస్తున్నాడో చూడండి.
**"చీకటి వెలుగుల కాద్యాంతాలు శూన్యం**
**రేయింబవళ్ళకు ముందూ వెనుకలు శూన్యం**
**శూన్యమైన సంధ్య వెలుగులే**
**రేయింబవళ్ళ వెలుగు నీడల అస్తిత్వం".**

విరహవేదన పలికించడంలో కూడా కవి కలం పదునెక్కింది.

**"వలచిన ప్రేయసి ఒడి కనుమరుగై**
**తలచిన భవితం ఎండమావియై**
**అనురాగ స్మృతి ఆశనిపాతమై**
**అవిసిన గుండెను మెలిపెడుతుంటే**
**ఇంకిన రుధిరం ఆవిరులైతే**
**అలసిన మనసే ఉసూరుమంటే**
**కాదా, కవనం తీరని దాహం"**

'స్మృతి వాంగ్మూలం' కవితా పంక్తులు యివి.

మృత్యు స్పృహతో రాసిన కవితల్తో బాటు ప్రేమ కవితలు కూడా చాలానే రాశాడు.

తెలంగాణ ఇతివృత్తంగా రాసిన రచనల్లో 'దేవులాట' ఎన్నదగింది. తెలంగాణ ముఖ చిత్రాలను దృశ్యమానం చేసిన పాటయిది.

'దండు' మరో మంచి పాట. తెలంగాణ యాస, భాష పట్లా సంస్కృతీ, సంప్రదాయాల పట్లా ఈ కవికి మక్కువ ఎక్కువ. చులకన చేసిన వారిపై తీవ్రంగా కవితాస్త్రాలను సంధిస్తారు.

**"కట్టు బొట్టు నీకు రాదన్న దాని**
**కన్నీట మున్నీట కుమిలిపోయిందో**
**వొంపు సొంపులు హెయలు లేవన్న దాని**
**కలత సెందిన తనివి రగిలిపోయిందో"** యిదీ ఎద్దేవా. ఎంత గొప్పగా సమర్థిస్తున్నాడో చూడండి.

**"మోట సిమ్ముల పిట్ట గూల్లల్ల**
**సన్న సన్న, పోగుల్ల కలనేతనీది**
**సీతాకోక సిలుక పైటసింగుల్ల**
**రంగుల్లు పొంగుల్లు పూతల్లు నీవి"**

స్వీయానుభవం, పరాయి అనుభవం రంగరించి రాసిన కవితలు కడు హృద్యంగా అలరిస్తయి. తన చుట్టు వున్న సమాజం నుండి, తను జీవిస్తున్న జీవనం నుండి ఎన్నుకున్న వస్తువులు కవితలైనాయి.

**"దేవులాటలు లోన దేవుతుండాలె**
**కవితార్థ వస్తువుల వెతుకులాటెందుకంట?"**
యిలా తనకు తోచిన భావంతో, చేతికొచ్చిన భాషతో, చేతనైన శిల్పంతో కవితలల్లాడు. అందుకే "వాసి బలమసలైన కొలతకావాలె/ నాకైత మనుగడకు రాశిఫల మెందుకట?" అంటున్న ఈ కవి, తన సుదీర్ఘ కవన పయనంలో యిప్పటివరకు వెలువరించిన కవితలు వందలోపే.

**"పరవశించిన కాంక్ష**
**పరుగులెత్తాలె**
**ముసుగు తొడిగిన లోక**
**భీతి నాకెందుకట"** అంటు 'తృష్ణమాలిక" కవితలో తన మేనిఫెస్టోను విడుదల చేస్తున్నాడు.

బైరెడ్డి కృష్ణారెడ్డి రాసిన ఏ కవితా ఊసుబోక రాసినట్టు వుండదు. ఎంతో మధనపడీ, పడీ లేచీ, తనలోకి తాను పదే పదే చొచ్చుకెళ్ళి అనుభవించి మరీ రాసినట్టుగా తోస్తుంది. అందుకే అతను అంటాడు... "కవిత రాసిన ప్రతిసారి ఓ రిలీఫ్‌కి లోనవుతాననీ.. యిదే చివరి కవిత.. మళ్ళీ మరో కవిత రాయలేనేమోనని" ఏ కవీ కవిత్వం తన కోసం తాను రాసుకోడు. పుస్తక రూపంలో విడుదల చేస్తున్నాడంటే అది పాఠకులకు చేరాలనీ తద్వారా వారిని అలరించాలనీ సృజిస్తాడు. వస్తు వైవిధ్యం వుంటే సరిపోదు. వస్తు స్పష్టత కూడా అవసరం. తను ఏం రాస్తున్నాడు, వస్తువు ఏమిటో బోధ పడకపోతే ఆ కవిత్వం వ్యర్థం. పాఠకులు కవిరాసిన పంక్తుల వెంబడి పయనిస్తారు. కొందరు పంక్తుల మధ్య తడుముతారు. అనుభూతినిస్తే ఆనందిస్తారు లేదా పక్కకు పడేస్తారు. పాఠకుడు తనలోకి దూరి తన అంతరంగాన్ని పసిగట్టాలని కవి ఆశిస్తే ఎక్కువ మంది పాఠకులకు చేరువ కాలేదు. వస్తువుని పొరలు పొరలుగా విప్పడంలో సరళమైన భావ వ్యక్తీకరణ చాలా అవసరం. సాహిత్య ప్రయోజనమో.. సామాజిక ప్రయోజనమో ఏదో ఒకటి సిద్ధిస్తే ఆ కవిత్వం పది కాలాల పాటు నిలబడుతుంది లేదా పోతుంది.

యివన్నీ బైరెడ్డి కృష్ణారెడ్డికి తెలీదని కాదు. దాదాపు అయిదు వందలకు పైగా కవిత్వ పొత్తాలపై సమీక్షా వ్యాసాలు రాసిన నాకు కలిగిన అనుభవం/ అభిప్రాయం ఇది.

చివరగా.. సంకలనానికే హైలేట్‌గా నిలిచిన కవిత "ఇమ్మోర్టల్ వెంకటేశ్" గురించి ప్రస్తావించకుండా వుండలేక పోతున్నాను. యిదో యదార్థగాథకు కవితీకరణ. 'వెంకటేశ్' యిరవై సంవత్సరాల యువకుడు, 'Myasthenia gravia' అనే ప్రాణాంతక వ్యాధి గ్రస్థుడు. ఉన్న చోటు నుండి కదలలేని నిర్భాగ్యుడు. స్నానం చేయించడం, అన్నం తినిపించడం యిలా అన్నిపనులు తల్లి చేయించాల్సిందే. ఒక రోజు వెంకటేశ్ యిలా తన శరీరం వృథా కావడం ఎందుకు? బతికుండగానే తన శరీరాన్ని ఏ ఆసుపత్రికో దానం చేస్తే అవయవాలు అవసరమైన వాళ్ళకి Transplant చేయొచ్చు గదా! ఆ విధంగా తన బతుక్కి సార్థకత చేకూతుంది అని తీర్మానించుకుని "అమ్మా నన్ను దానం యిచ్చేసేయ్" అని తల్లిని బతిమిలాడ్తాడు. ఏ తల్లికైనా ఈ కోరిక తీర్చడం కష్టమే. గుండె దిటువు చేసుకుని కొడుకు కోర్కెను అంగీకరిస్తుంది. కానీ చట్టం ఒప్పుకోదు. ఈ నేపథ్యంలో రాసిన కవిత 'ఇమ్మోర్టల్ వెంకటేశ్'.

**"గోరు ముద్దలైతే ఏడిపించి పెట్టినవ్**
**కోరి చిరుతిళ్ళు అడిగితే చీవాట్లు పెట్టినవ్**
**అమ్మా! నా ఆయువును**
**పంచి పెట్టవే అన్నప్పుడు మాత్రం**
**త్యాగం నైజమెరిగిన పావురానివైనవ్"**

వంటి గుండెలు పిండేసే పంక్తులు కృష్ణారెడ్డి కవితా శక్తిని పట్టి యిస్తయి.

ప్రముఖ చలన చిత్ర దర్శకుడు, కవి బి.నర్సింగరావు స్పందిస్తూ బైరెడ్డి కృష్ణారెడ్డిలో ఒక వేమన, ఒక ఇలియట్, ఒక పికాసో దర్శనమిస్తారు. పుట్టుక పూర్వోత్తరాలు, జనన మరణాలు, అస్తిత్వ ఆలోచనలు ఇతని కవిత్వమంతా పరుచుకొని ఉంటాయి. అనుక్షణం కవితావేశం ఆవహిస్తుంది. అందుకే ఇతనొక అరుదైన కవి అంటారు. ఇంతకన్నా గొప్ప కాంప్లిమెంట్ ఏం వుంటుంది.

బైరెడ్డి కవిత్వాన్ని, కవితాత్మను ఆవిష్కరిస్తు సుంకిరెడ్డి నారాయణరెడ్డి అందించిన పీఠిక విశ్లేషణాత్మకంగా సాగి 'ఆర్తి' సంకలనాన్ని ఆద్యంతం చదివించేలా పాఠకుడ్ని ఉద్యుక్తుణ్ని చేస్తుందనడంలో ఏమాత్రం సందేహంలేదు.

ప్రతులకు:బైరెడ్డి కృష్ణారెడ్డి
ఆర్తి నివాసం
6-2-398, సాయిశ్రీ కాలనీ
నల్లగొండ- 508001.
సెల్: 9440072211
9490182181.



- రమణ వెలమకన్ని
సెల్: 9866015040


## జనం గుండెల్లో పైలం సంతోష్

పాటతో పెర్గిండే పాటతో ఒర్గిండే
పైలం సంతోసు మా పాటల సంతోసు
పాటల ఊటయ్యి పరవళ్ళు తొక్కిండే
పాటల సంతోసు మా పైలం సంతోసు "పాట"

ప్రజల పాట అయ్యిందు జనం ఆట అయ్యిండే
పైలం సంతోసు మా పాటల సంతోసు
ఉరకలు వేసిందు ఊపిరి పోసిండే
పాటల సంతోసు మా పైలం సంతోసు "పాట"

కరువు పాటతోని బాదలు చూపిండే
పైలం సంతోసు మా పాటల సంతోసు
వలస పాటతోని వెతలను చెప్పిండే
పాటల సంతోసు మా పైలం సంతోసు "పాట"

ప్రజల కోసం పాడిందు జనం కోసం ఆడిండే
పైలం సంతోసు మా పాటల సంతోసు
నలుపులో పుట్టిందు ఎరుపుతో ఎదిగిండే
పాటల సంతోసు మా పైలం సంతోసు "పాట"

గజ్జెలు కట్టిందూ గంతులు వేసిండే
పైలం సంతోసు మా పాటల సంతోసు
డప్పులు కొట్టిందూ దర్వులు వేసిండే
పాటల సంతోసు మా పైలం సంతోసు "పాట"

జీర గొంతుకోడూ జనం పాటగాడే
పైలం సంతోసు మా పాటల సంతోసు
జనం గుండెల్లో పాటతో పైలంగ వుండే
పాటల సంతోసు మా పైలం సంతోసు "పాట"



-ఉప్పెన
8106073661


# స్పందించే తత్త్వం కేతవరపు కలం (అలజడే) బలం!

పుస్తక సమీక్షలు


ప్రపంచాన్ని 2020లో వణికించిన కరోనా మహమ్మారి విలయ తాండవాన్ని నిశితంగా పరిశీలించి అద్భుతంగా లఘు కవితల్లో రాసిన రాజ్యశ్రీ ప్రశంసనీయురాలు. ఒకనాడు ప్లేగ్ వ్యాధి 1347లో ప్రపంచాన్ని గజగజలాడించింది. 7 కోట్లు బలి అయ్యారు. 1918లో స్పానిష్ ఫ్లూ అమెరికా, యూరప్ ఖండాలపైబడి 50 కోట్ల మంది ప్రజల్ని మంచాన పడేసింది. 5 కోట్ల మంది మృత్యువాడపడ్డారు. 1980లో ఎయిడ్స్ వ్యాధి 10 లక్షల మందిని పొట్టన పెట్టుకొంది... మన కళ్ళ ముందు ఎబోలా 12 వేల మందిని (2013)లో చంపింది. మార్చి చివరలో పెట్టిన లాక్‌డౌన్ దాదాపు 13 కోట్ల మందిని వీధుల పాలు చేసింది. ఆకలికి గురి చేసింది. దాదాపు 9 నెలలు గడిచినా దేశం - ఆర్థికంగాను, ఆరోగ్యంగాను ఇంకా కోలుకోలేదు... ఏ యుద్ధం లేకుండానే లక్షల్లో ప్రజలు అకాల మృత్యువాతపడటం ఓ చారిత్రక విషాదం... విదేశీయాత్ర జ్ఞానం మోసుకొచ్చేది. నేడు రోగాన్ని మోసుకొస్తున్నది. కాలాన్ని నమోదు చేసి ప్రజల్ని జ్ఞానవంతులు చేసేవాడే కవి. ఈ కవితా సంపుటిలో ఎన్నో కవితల్ని భావోస్ఫోరకంగా రాశారు రాజ్యశ్రీగారు. ఈ సంపుటికి డా॥ తిరునగరి, ఈ కవితా సంపుటికి ముందు మాట రాశారు. సామాజిక సేవా కార్యక్రమాలు-సాంస్కృతిక కార్యక్రమాల్లో గత 5 దశాబ్దాలుగా కృషి చేస్తున్న రాజ్యశ్రీగారి కవితల్లో కొన్నింటిని పరిశీలిద్దాం! (మచ్చుకు కొన్ని)

**"చైనా గబ్బిలాలు తిని / ప్రపంచ దేశాలకు**
**గబ్బు పట్టించింది /మూగజీవులశాపం / కరోనా కర్కశి రూపం"** అంటారు (పేజీ 15)

**కరోనాతో మళ్ళీ / ఆనాటి వస్తుమార్పిడి విధానం- క్యాష్‌లెస్ / కార్డ్‌లెస్ (పేజీ 34) అంటారు - పురాతన సమాజం నాటి స్థితి మళ్ళీ వచ్చింది కదా!!**

**కవిత్వంలో దేశభక్తి రగిలించటం ఒక కళ - ఆమె ఒక కవితలో అంటారు...**

**"విదేశీ విద్యపై / మోజు తగ్గిన యువత / స్వదేశీ విద్యపై మమత /**
**భారత్‌లోనే భవిత - ఇది "కరోనా" ఘనత -**





అంటారు. (పేజీ 63)

**ఆఖరి అస్త్రం / కరోనాను ఓడించే / "బ్రహ్మాస్త్రం" - 'ఇమ్యూనిటి" అంటూ ముగించారు. దైవభక్తి ఓ కవితలో చెప్పారు-**

**'డి' విటమిన్ లోపం - / కరోనాకి ఆహ్వానం / మన ప్రాచీన సూర్యనమస్కారాలే పరిష్కార మార్గం... (పేజీ 57)** అంటూ ఆరోగ్య రహస్యాలు చెప్పారు..

'కరోనా' రోగులతో / కలిసిమెలిసి పార్టీలు - వైరస్ సోకిన మొదటి వ్యక్తికి "నజనారాలు" అమెరికా "అలబామా"లో అమానుష క్రీడలు - (పేజీ 53) అంటారు.

ప్రపంచీకరణ ప్రభావంతో మానవ సంబంధాలు పూర్తిగా మృగ్యమైపోయాయి. తోటి వాన్ని దోచుకోవడం నుండి - మోసం చేయడం దాకా... జరుగుతోంది. ఇలాంటి తరుణంలో 'మనిషి' ఉనికే ప్రమాదంలో పడింది... ఈ అంశాన్నే రాజ్యశ్రీ ఇలా రాసారు ఒక చోట. ఆమె ఏమంటారు అంటే... "లాక్‌డౌన్" సంక్షోభంలో / పరస్పర సహకారానికి - పునాది - టైకుబ్యాంక్" - డబ్బు దాచుకున్నట్లే -

సాయం చేసి పని గంటలు - ఖాతాలో జమ - (పేజీ 49) అంటారు. మన వైద్య పెద్దలు ఏనాడో ఒక మంచి మాట చెప్పేవారు... అదేమంటే.. రోగిని కాదు - రోగాన్ని అసహ్యించుకో అని... రాజ్యశ్రీగారూ ఇదే అభిప్రాయాన్ని చక్కటి భావాల్లో పొందుపరిచారు.


"పాజిటివ్ రోగులపట్ల / నెగిటివ్ దృక్పథం -
పారదోలు - మహమ్మారిని - మానవత్వాన్ని కాదు"

అంటారు. (పేజీ 4) మనక రంతిదేవుడు గురించి పోతన భాగవతంలో చాలా గొప్పగా చెప్పాడు. ఓ వృద్ధురాలి గురించి ఆమె సేవ గురించి... రాజ్యశ్రీగారు ఒక చోట ఇలా రాసారు.

"మల్లె నెత్తిన పెట్టుకుని పోతానా? / అవసరానికి దాచుకున్న ధనం అనాథ రోగులకి దానం / వృద్ధురాలి దాతృత్వం తలదించుకున్న స్వార్థం" (పేజీ 18) అంటారు.

డా॥ తిరునగరిగారు అన్నట్లుగా వస్తు నవ్యత - అభివ్యక్తి నవ్యతతో కవిత్వాన్ని విషాదాన్ని - వాస్తవాంసాలతో అక్షరీకరించిన తీరు ప్రశంసనీయం.. ఆమె అక్షర కృషికి అభినందనలు -

రచయిత్రి డా॥ కేతవరపు రాజ్యశ్రీ
పేజీలు 64 : వెల 101/-
ప్రతులకు కవయిత్రి పేరుతో
ప్లాట్ నెం. 4, అశోక్‌నగర్, హైదరాబాద్.
సెల్ : 8500121990



- తంగిరాల చక్రవర్తి
9393804472


## ఆహ్వానం

సమైక్య సాహితి - కరీంనగర్.
(రి.నెం.3659/92)

శ్రీమతి ఇష్రత్ సుల్తానా కవిత్వం
'గమ్యం చేరేదాకా'
గ్రంథావిష్కరణ

తేది 10-12-2020 గురువారం రోజున
సమయం : ఉ॥ 10.30 లకు
వేదిక : ఫిలింభవన్, కరీంనగర్.

సభాధ్యక్షులు : శ్రీ మాడిశెట్టి గోపాల్ గారు
ముఖ్య అతిథి, ఆవిష్కర్త : డా॥ నందిని సిధారెడ్డి గారు
విశిష్ట అతిథి : శ్రీ జి.వి. శ్యాంప్రసాద్ లాల్ గారు, అదనపు కలెక్టర్, కరీంనగర్ జిల్లా
గౌరవ అతిథులు : డా॥ గండ్ర లక్ష్మణరావు గారు, డా॥ మలయశ్రీ గారు
ఆత్మీయ అతిథులు : డా॥ వైరాగ్యం ప్రభాకర్ గారు, డా॥ అడువాల సుజాత గారు
అంకితం : శ్రీ ఎ. గజేందర్ రెడ్డి గారికి...
పుస్తక సమీక్ష : శ్రీ కె.ఎస్. అనంతాచార్య గారు

ఆహ్వానించువారు :
డా॥ బి.వి.ఎన్. స్వామి
సహాధ్యక్షుడు, సమైక్య సాహితి, కరీంనగర్.




# స్థితప్రజ్ఞునికి శతవందనాలు

కిన్నెర ఆర్ట్ థియేటర్స్, 'నేటినిజం' దినపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో పి.వి. మనోహరరావుగారి సౌజన్యంతో భారతపూర్వ ప్రధాని కీ॥శే॥ పి.వి. నరసింహారావుగారి శతజయంతి సందర్భంగా వారి వ్యక్తిత్వ సాహిత్యాలపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో ప్రథమ బహుమతి పొందిన వ్యాసం ఇది.
-సంపాదకులు

మనదేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేటప్పుడు ఎవరో ఒక కారణజన్ముడు ఉదయించి మనలను ఆదుకుంటూ ఉంటాడు. అలాంటి పరిస్థితులే 1991 సం.లో రాజీవ్‌గాంధీ హత్య, హింసాత్మక ఘటనలు, ఆర్థిక, రాజకీయ సంక్షోభం లాంటివి మనదేశాన్ని చుట్టుముట్టాయి. వీటి నుండి బయటపడి దేశాన్ని ప్రగతిపథంలో నడిపించేది ఎవరా! ఎవరా! అని ఉత్కంఠతో ఎదురుచూసే భారతావనికి ఎవ్వరూ ఊహించరాని రీతిగా మహావిజ్ఞుడు. స్థితప్రజ్ఞుడు శ్రీ పి.వి. నరసింహారావుగారు తెరపైకి వచ్చారు. ఢిల్లీ పీఠాన్ని అధిష్టించారు. చాలా సున్నితం, మితభాషి, మందీ మార్బలం లేని ఈ వ్యక్తి ఏం చేస్తాడులే? అని విపక్షాలు, ఎన్నాళ్లుంటాడులే? అని సొంత పార్టీలోని అసమ్మతి నాయకులు పెదవి విరిచారు. పైగా పూర్తి మెజారిటీ లేని మైనారిటీ ప్రభుత్వం. చుట్టూ అన్నీ సమస్యలే. ధరించింది ముళ్ల కిరీటమే.

కాని ఈయన అందరు అనుకునే సామాన్యుడా? కష్టపడి స్వయంకృషితో ఏ రాజకీయ నాయకుని అండదండలు లేకుండా అంచెలంచెలుగా ఎదిగిన నిరాడంబర నిస్వార్థ రాజకీయ చతురుడు. 1921 జూన్ 28న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వరంగల్ జిల్లా లక్నేపల్లి గ్రామంకు చెందిన రుక్మాబాయమ్మ, సీతారామారావు దంపతులకు జన్మించారు. తర్వాత కరీంనగర్ జిల్లా వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రత్నాబాయమ్మ దంపతులకు దత్తత వెళ్ళారు చిన్నారి నరసింహారావు. ఇద్దరు తల్లుల ముద్దూ, మురిపాల ఫలితమే ఆయన సాహిత్యంలోను, రాజకీయ రంగంలోను అత్యున్నత శిఖరాలకు ఎదిగేలా చేశాయి. వరంగల్‌లో సరస్వతీ ప్రార్థనతో అక్షరాభ్యాసం ఆరంభించిన బాల నరసింహుడు 14 భాషలు నేర్చిన పండితుడుగా, సరస్వతీ పుత్రుడుగా, ఒక మేధావిగా ఎదుగుతాడని ఎవరు కలగన్నారు? ఆయనకు 10 సం॥లకే వివాహమైంది. ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు, హన్మకొండ ఇంటర్మీడియట్ కాలేజీలో చదువు కొనసాగించి ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి అయ్యారు. సరిగ్గా యిక్కడ నుండే ఆయన జీవితం ఒక పెద్ద మలుపు తిరిగింది. విద్యార్థిగా ఉంటూనే ఉద్యమాలవైపు ఆకర్షింపబడి దేశసేవ చేయడానికి అడుగులు వేశారు. 1939లో త్రిపురి (జబల్‌పూర్ దగ్గ)లో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశానికి హాజరై పార్టీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. ఎందరో రాజకీయ నాయకులు అవసరాన్ని బట్టి పార్టీలు మారుతూ ఉంటారు. ఈయన మాత్రం జీవితాంతం ఎలాంటి పరిస్థితులలోను పార్టీని వీడకుండా చిత్తశుద్ధితో పనిచేసిన ఉత్తమ కార్యకర్త. ఆనాడు చురుకుగా పార్టీ కార్యక్రమాలలోను, వందేమాతరం ఉద్యమంలోను పాల్గొని కళాశాల బహిష్కరణకు గురైనారు. అంతమాత్రాన ఆయన తన చదువును అర్ధాంతరంగా ముగించలేదు. అంతా నా మంచికేనని నాగపూర్ యూనివర్సిటీలో న్యాయశాస్త్ర విద్యార్థిగా సీటు సంపాదించి పట్టాతో బాటు స్వర్ణపతకాన్ని కూడా సాధించారు. కాని దానితో లభించిన ప్రభుత్వోద్యోగాన్ని తిరస్కరించి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. బూర్గుల రామకృష్ణారావు గారి వద్ద జూనియర్ లాయర్‌గా ప్రాక్టీస్ చేశారు. స్వామి రామానంద తీర్థుల అనుచరుడయ్యారు.

క్విట్ ఇండియాలాంటి ఉద్యమ సమయంలో కాకతీయ వారపత్రికను ప్రారంభించి 'జయ విజయ' అనుపేరుతో వ్యాసాలు వ్రాస్తూ తన కలంకు పనిచెప్పారు. 1951 సం॥లో అఖిలభారత కాంగ్రెస్ సభ్యునిగా నియమితులై 1952లో కరీంనగర్ లోక్‌సభకు పోటీచేసి, ప్రత్యర్థి కమ్యూనిస్టు చేతిలో ఓడిపోయారు. వైఫల్యం నిరాశకు కారణం కాకూడదు. క్రొత్త ప్రేరణకు పునాది కావాలి. దాని నుండి మంచి పాఠాలు నేర్చుకోవాలి అన్న ఆశావాది. అదే స్ఫూర్తితో 1957లో మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గట్టి పోటీల మధ్య కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. ఆయన పట్టుదల, ఆత్మస్థైర్యం ఆయనకు ఘనవిజయం తెచ్చిపెట్టాయి. అక్కడి నుండి ఆయన రాజకీయ పయనం వేగం అందుకొని, ముందుకు ఉరకలు వేసింది. పదవుల కోసం ఆయన ఎప్పుడూ పనిచేయలేదు, పాకులాడలేదు. అవే వాటంతటవి అతనిని వరించాయి. ప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా సేవలందిస్తూ పి.వి. 1962, 1967, 1972 ఎన్నికలలో ఎంఎల్ఏగా ఎదురులేని విజయం సాధించారు.

1962 సం॥లో న్యాయశాఖతో పాటు, జైళ్ళశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఓపెన్‌జైలు, ఖైదీలకు వయోజన విద్యలాంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి వారిలో పరివర్తన తీసుకొని రావాలని ఆయన ప్రయత్నం చేశారు. అందుకే ఆంధ్రప్రదేశ్ సంస్కరణలలో ప్రథమ స్థానంలో నిలిచింది. 1967లో వైద్య ఆరోగ్యశాఖామాత్యులుగా గర్భవతులైన గ్రామీణ పేద స్త్రీలకు ఆరోగ్య కార్యక్రమం రూపొందించారు. 1968-71 రాష్ట్ర విద్యామంత్రిగా ఆయనకు ఇష్టమైన శాఖ చేపట్టారు. తెలుగు అకాడమీని స్థాపించారు. జిల్లా గ్రంథాలయాలు ఏర్పాటు చేసి, అందులో మంచి పుస్తకాలు అందుబాటులోకి వచ్చేలా చూశారు. తెలుగు భాషను అధికార భాషగాను, కళాశాల విద్యాబోధన భాషగాను చేయడానికి ఎంతో కృషి చేశారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలే కొలమానం కాకుండా సంవత్సరం పొడవునా యూనిట్ పరీక్షలను నిర్వహించాలని ప్రతిపాదించారు. ఇలా ఆయన పనిచేసిన ప్రతిశాఖలోను తనదైన ముద్ర ఒకటి వేసుకొనేవారు. అందరి దృష్టితో పాటు శ్రీమతి ఇందిరాగాంధీ దృష్టిని కూడా ఆకర్షించారు.

1971-73 సం॥లో అనుకోని పరిస్థితులలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. భూసంస్కరణలు అమలుచేసి చరిత్రలో నిలిచిపోయారు. మనం ఈ రోజుల్లో భూకబ్జాల కోసమే రాజకీయాలలోకి వచ్చే నాయకులనే ఎక్కువగా చూస్తున్నాం. కాని పి.వి.గారు తన 790 ఎకరాల భూమిని ప్రభుత్వానికి ధారాదత్తం చేసి ఆదర్శంగా నిలిచారు. "టన్నులకొద్దీ బోధనకంటే ఒక చెంచాడు ఆచరణ విలువైనది" అన్నారు మహాత్మాగాంధీ. కాని ఈ భూ సంస్కరణలే ఆయన ముఖ్యమంత్రి పదవికి ముప్పుతెచ్చింది. విజ్ఞులైన వారి సేవలను విడిచిపెట్టేవారెవరు? ఆయనకు హస్తిన నుంచి పిలుపువచ్చింది. మొదట ఏఐసిసి కార్యదర్శిగా, తర్వాత కేంద్రమంత్రిగా శ్రీమతి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలకు సన్నిహిత సలహాదారునిగా విశేష సేవలు అందించారు.

1980 సం॥లో విదేశాంగ మంత్రిగా అంతర్జాతీయ విజయాలను అందించారు. 1982లో రక్షణమంత్రిగా వ్యవహరించి, హోంమంత్రిగా బాధ్యతలు తీసుకొని క్లిష్టతరమైన సమస్యలను పరిష్కరించారు. 1983 అలీన దేశాల తరఫున ఇరాన్, ఇరాక్‌ల మధ్య రాజీ కుదుర్చి చర్చలు జరిపారు. విద్యాశాఖలో ఉన్నప్పుడు కొత్తగా మానవ వనరుల శాఖను సృష్టించారు. జవహర్ నవోదయ విద్యాసంస్థలను స్థాపించి మారుమూల గ్రామ ప్రాంతాల్లో నివసించే పేద విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించారు. 1986, 89 సం॥లలో రాజీవ్ మంత్రివర్గంలో విదేశాంగ మంత్రిగా సేవలందించారు. ఇరుగు పొరుగు దేశాలతో చర్చలు జరిపి ముఖ్యంగా చైనా, పాకిస్తాన్‌తో శాంతి నెలకొల్పే ప్రయత్నం చేశారు. ఆయన విదేశాంగశాఖమంత్రిగా పాకిస్థాన్ వెళ్ళినప్పుడు పాకిస్థానీయులు పి.వి.తో మేము తాజ్‌మహల్, కాశ్మీరు వదిలిరావడం బాధగా ఉంది అన్న వెంటనే మొహంజదారో, హరప్పా కట్టడాలను కోల్పోయి మేము అంతకన్నా ఎక్కువ బాధపడుతున్నాం అని జవాబిచ్చారు. సమస్యలు వచ్చినప్పుడు ఆయన స్వీయానుభవంతో విశ్లేషించి పరిష్కార మార్గాన్ని సూచించేవారు.

ఇలా ఎన్నో పదవులలో రాణించి, గ్రంథ పఠనాలతో విశ్రాంత జీవితం గడపాలనుకొనే ఆయనకు 1991 జూన్ 21న రాజీవ్ హత్యానంతరం ప్రధాని పట్టంకట్టారు. కాని చుట్టూ సమస్యల సుడిగుండాలే. ప్రప్రథమంగా ఆర్థిక పరిస్థితి, అభివృద్ధి రేటు సున్నాశాతం. ద్రవ్యోల్బణం 16%. ప్రపంచ వాణిజ్యంలో ఎగుమతి పరిమాణం 2% నుండి 0.5% శాతానికి తగ్గింది. మన బంగారం నిల్వలను ఇంగ్లండు బ్యాంకులో తాకట్టు పెట్టాల్సి వచ్చింది. ఈ పరిస్థితులలో వెనకటి ప్రభుత్వాలు చేసిన తప్పు ఒప్పులను సమీక్షించుకొంటూ కాలం వృథా చేయకుండా అనుసరించవలసిన విధానాలను వెదుకుతూ అనేక ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. వాటి మూలంగా వృద్ధిరేటు 5 సంవత్సరాల్లో 7% పెరగడం ప్రపంచానికి ఆశ్చర్యం కలిగించింది. భగ్గుమంటున్న పంజాబ్ శాంతించింది. కాశ్మీర్ తిరిగి వికసించింది. ఆయన అమెరికా పర్యటనతో ఆ దేశంతో సత్సంబంధాలు, ఇండియా-ఇజ్రాయిల్ మధ్య రక్షణ సహకారానికి క్రొత్త అధ్యాయం ప్రారంభించబడింది. ఐక్యరాజ్యసమితి, భద్రతామండలిలో సభ్యత్వం కోసం కృషి చేసి భారతవాణిని వినిపించారు. అప్పటి ఆయన ప్రసంగం అగ్రదేశాల నాయకులను ఆలోచింపజేసినది. ఎం.పి. లాడ్స్ అన్నవి పి.వి. హయంలోనే ప్రారంభించారు. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఎంతో హుందాగా నిర్వహించి గౌరవంగా నడిపారు. గల్లీ నుండి ఢిల్లీకి ఎదిగి, ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అని చెప్పి తను పుట్టిన గ్రామాన్ని, అక్కడి వాళ్ళను ఎన్నడూ మరువలేదు.

ఆయన రాజకీయాల్లో అంత సతమతమౌతున్నా తనకిష్టమైన సాహితీరంగాన్ని విడిచిపెట్టలేదు. పురాణాలు, కావ్యాలు, ఆధునిక తెలుగు సాహిత్యం ఆకళింపు చేసుకొన్నారు. సాహితీరంగంలో అత్యున్నతస్థాయికి ఎదిగారు. ఆయనకు సంస్కృతం, తెలుగు, కన్నడం, హిందీ, మరాఠీ, ఇంగ్లీషు, ఉర్దూ, అరబ్బీ, పార్శీ, ఫ్రెంచ్, స్పానిష్ మొదలైన స్వదేశీ విదేశీ భాషలలో ప్రావీణ్యం ఉంది. తెలుగు, హిందీ, మరాఠీ, ఇంగ్లీషు, ఉర్దూలో చేసిన ప్రసంగాలు శ్రోతలను ఎంతగానో ఆకట్టుకునేవి. అమెరికా పార్లమెంటులో ప్రసంగించినప్పుడు సభ్యులు కరతాళ ధ్వనులతో ప్రశంసించారు. ఆయన స్నాతకోపన్యాసాలు, స్మారకోపన్యాసాలు పలు గ్రంథాలను రాసిన ఉపోద్ఘాతాలు, వివిధ సందర్భాలలో అందించిన సందేశాలు అమూల్యం. విశ్వనాథ వారు వీరు ఎంతగానో అభిమానించుకున్నప్పటికీ ఆయన కవిత్వాన్ని కూడా విమర్శించే ప్రతిభ కనబరిచారు. వేయి పడగలను హిందీలో 'సహస్రఫణ్'గాను హరినారాయణ ఆప్టే రాసిన మరాఠీ నవల "పాన్ లక్షల కోన్ ఘోటాకు"ను తెలుగులో "అబలా జీవితం" లాంటివి పాఠకుల ప్రశంసలందుకొన్నాయి. పి.వి., అటల్‌బిహారీ వాజ్‌పాయ్‌లు రాజకీయ ప్రతిద్వంద్వులైన ఆత్మీయ సాహితీ మిత్రులు. 'ఎక్యావన్ ఔర్ కవితాయే'ను వాజ్‌పాయ్ కవితా సంకలనం పి.వి.చేత ఆవిష్కరింపజేసి ఇది నా అదృష్టం అని చెప్పారు.

సంగీతం, సాహిత్యం, నాట్యం, నాటకం లాంటివి ఆయనకు ఎంతో ఇష్టం. ఇన్ని ఉన్నా అవసరాన్ని మించి ఒక్క మాట కూడా ఎక్కువ మాట్లాడేవారు కారు. కాని ఆయన చెప్పిన "మనం బతకాలంటే కలిసి బతకడం నేర్చుకోవాలి", "హడావిడి చేయడం కంటే గుట్టుగా జీవించడమే మంచిది", "సేవ చేయించుకోవడం కంటే చేయడమే ప్రశస్తమైనది" మాటలు అమూల్యమైన ముత్యపు మూటలు. స్పష్టమైన ఆలోచన, దృఢ నిశ్చయం, సంకల్పబలం, లౌక్యం, సమయస్ఫూర్తి ఆయనకు వెన్నెతో పెట్టిన విద్య. సన్మానాలు, సత్కారాలు, బిరుదులు ఆయన తిరస్కరించారు. నేటి నాయకులలాగ గోరంత పనిచేసి కొండంతగా చెప్పుకోవడం ఆయనకు చేతకాని పని. కొందరి రాజకీయ నాయకుల కుటిలనీతి వల్ల ఆయన దేశానికి చేసిన సేవకు తగ్గ గుర్తింపు రాలేదు. మన తెలుగువారు కూడా మనలోని నిజమైన ప్రతిభావంతులను గుర్తించరు. కాని తెలంగాణ ప్రభుత్వం పి.వి. శతజయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుతూ ఉండడం ఎంతో ఆనందదాయకం. ఆయనకు "భారతరత్న"ను కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తే స్థితప్రజ్ఞునికి శతకోటి వందనాలు అర్పించినట్లే.



-కడియాల ప్రభాకరరావు
సెల్:98490 38058

## మనం మాట్లాడుకొందామా!

మనం ఎలా వుండాలి!
ప్రమిదలా ఉండాలా!
నక్షత్రంలా ఉండాలా!
మనం ఎవరితో మాట్లాడుతాం!
బహుశా మాట్లాడలేక పోవచ్చు కూడా!
ఆలోచనలు విహంగాలు కదా!
ఎందరి నీడల్లో మనసు మీద వాల్చుకుంటాయి.
ఏవో కొన్ని రెక్కలు
నావి కొన్ని, నీవి కొన్ని
జీవితం తన వెంట
లాక్కొని పోవచ్చు.
అదో ఆకాశం ---
కొన్ని నక్షత్ర సమూహాలని
కొన్ని ఊదారంగుకలల్ని
ఆమె తన వెంట
లాక్కొని పోవచ్చు.
ఎక్కడైనా సందు దొరికితే
మాటలు కొన్ని
చెబుతాయి రహస్యంగా
అవి మనం వినక పోవచ్చు.
అవి ఆమెకు
సొంతం కావచ్చు.
పాఠ్యపుస్తకాలు కూడా
కావచ్చు నేమో!
ఆమె ఒడిలో పూలు
శకలాలు కాదు --
నా బ్రతుకుభారం మోసే
రేపటి గవాక్షాలు--
నేను అప్పుడప్పుడూ
మనసు తెరలపై
మాటల్ని కొలుస్తుంటాను.
అప్పుడప్పుడూ
జీవితాన్ని అడగాలనిపిస్తుంది.
ఆరడుగుల సమాధిని
నాకివ్వగలవా అని!
ఎందుకంటే కాలీకాలని
నాణెపు బొమ్మలా
మిగిలిపోతున్నాను.
మనిషి రహస్యం
తెలిసిన మానవస్వార్థం
ఆత్రంగా నా తుదిశ్వాసను
ఆహ్వానిస్తుంది.
మనం ఎవరితో మాట్లాడుతాం.
ఎవరితోనూ మాట్లాడక పోవడం
కాల నైజమేమో!
కానీ భీకరంగా కన్పించే
దృశ్యాన్ని ఎలా నొక్కను--
కాలంతో చేతులెలా
కలపను!



-ఏటూరి నాగేంద్రరావు
7416665323

## మేల్కొన్న ప్రపంచం

అకస్మాత్తుగా మేల్కొంది
ఆదమరిచి నిద్రిస్తున్న ప్రపంచం
ఓ భయంకర సుడిగుండంలో.
ఆలింగనాలు, ముద్దులు
అనుకోకుండా రూపు దాల్చాయి
మారణాయుద్ధాల వలె.
వింత కాకపోయినా
ప్రేమించేవారిని కలవకపోవడం
మారింది కొత్త పోకడగా.
ఆరుబయట ఆటాపాటల అలికిడి
వినిపించడం లేదు నిన్నటి వలె.
లేవు జీవితంలో పూర్వపు కాంతులు
ఉరుముల మెరుపుల
భయభ్రాంతులు తప్ప.
లేవు ఇరుగుపొరుగుల పలకరింపులు
జలదరింపులు తప్ప.
కనపడని కరొనా ముప్పు పొంచి
ఉందని దివారాత్రాలు ఉలికి పాట్లు.
అందం, ఐశ్వర్యం, అంతస్తు.. అన్నీ
కరోనా ముందు బలాదూర్.
ఇవ్వలేవు అవేవీ ఆయువు నిలిపే ప్రాణవాయువు.
బందీ అయ్యాడు మనిషి
గృహపంజరంలో కరోనాకు జడిసి.
మహమ్మారి ఇంతలా విజృంభించినా
ఆగిపోలేదు ప్రపంచం.
మనిషి ఉన్నా, లేకున్నా
ప్రపంచం నడుస్తూనే ఉంటుందని..
మనిషి మళ్ళీ తిరిగొస్తే
మామూలు 'అతిథి' గా తప్ప
'పెత్తనం' చెలాయించడానికి కాదని..
జీర్ణించుకోలేని ఓ మహా సందేశాన్ని
మానవాళికిస్తూ.



-ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## కవిత్వం

కన్నీళ్లను తుడిచేది కవిత్వం
భయాన్ని తొలగించేది కవిత్వం
ధైర్యాన్ని నూరిపోసేది కవిత్వం
పిరికితనాన్ని రూపుమాపేది కవిత్వం.
అనచబడ్డ ప్రజలకు ఆయుధం కవిత్వం
పోరుబాటకు సమరగీతం కవిత్వం
పీడితుల పాలిట పిడికిలి కవిత్వం
జనాన్ని జాగృతం చేసేది కవిత్వం.
పోరాటానికి దన్నుగా నిలిచేది కవిత్వం
మునుముందుకు నడిపించేది కవిత్వం
తనువెల్లా చైతన్యం నింపేది కవిత్వం
పాటై జనాన్ని కదిలించేది కవిత్వ
వేదంలో పుట్టింది కవిత్వం
హృదయం కరిగించేది కవిత్వం
నిత్యనూతనం కవిత్వం
అజరామరం కవిత్వం



- బూర దేవానందం
9494996143

## నిత్య స్మరణీయులు



మాతృభక్తులు (ధ్రువుడు, గరుత్మంతుడు)

-దోరవేటి
సెల్:9866251679

తల్లికి గౌరవమ్ముకయి తల్లడమందిన మానసంబు సం
ధిల్లెను భక్తిలోన; ఘనతేజము నందె తపస్సునందు ఘూ
ర్ణిల్లెను సచ్చరిత్రము సునీతికుమార! ధ్రువా! జగంబులన్
తెల్లము మాతృభక్తి భవదీయ శుభప్రద నామధేయమే!

ఉత్తాన పాద చరితము
నైత్తెను లోకమ్మునకు సునీతి, సురుచిలన్
ఉత్తముని దెలియ జేసెను
ఉత్తమగుణ ధ్రువకుమార! ఉజ్జ్వల తారా!

అమ్మకు దాస్యముక్తి కనహాయత మీరగ పోరుసల్పి, లో
కమ్ములనేలు శక్రుని కకావిక జేసి, సధానిధిన్ యమాం
తమ్ముగ నేలకున్ దిగిచి ధన్యుడవైతివి నీవు, నీ చరి
త్రమ్మె యుగమ్ములందున దలంచుదు రందుకె వైనతేయుడా!

మాతృదాస్య విముక్తికై మరణమునకు
వెరువకను పోరినట్టి ఓ వీరపుత్ర!
నీ స్వతంత్రేచ్ఛ, మాతృభక్తి, స్వశక్తి
తరతరమ్ముల కవని కాదర్శమాయె!

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 'అందని ద్రాక్ష పుల్లన ' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'అందని ద్రాక్ష పుల్లన' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
సంపాదకులు



*మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం*
*ఏకాంశ కవిత్వం నిర్వహణ:*
***డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839***

## అసంతృప్త జీవనం

చేతికందే పూలు చులకన
అందని నక్షత్రాల కోసం అర్రులు
చెంతనే స్వర్గ సుఖమున్నా
ఎండమావుల వెంట పరుగులు
అమృతతుల్యమైన ఆప్యాయత లభించినా
మోహమాయల వెంట ప్రదక్షిణాలు
ఇంటి తిండి ఇంపుగా ఉన్నా
పొరుగింటి పుల్లకూర పులకింత
అందిన అద్భుతాలనొదిలి
శూన్యమైన వ్యర్థాల వైపు పయనం
చెంతనున్న అమూల్య సంపదల నొదిలి
చేరలేని అగమ్యగోచరాల ఆలోచన
అందిన వాటిని ఆస్వాదించలేక
అందని వాటి కోసం ఆరాటం
అందని ద్రాక్ష పుల్లన ఎప్పటికైనా.
తెలుసుకోకుంటే నిరాశే ఎప్పుడైనా.



- డా.రామక కృష్ణమూర్తి,
9948285353

## అందని ద్రాక్ష

1. ఆటవెలది
పట్ట పగటి కలలు పనిచేయకుండనే
కోట్ల సొమ్ము కొరకు పాట్లు పడుచు
చేయరానిచెడుమోయువేళహృదికి
నందరాని ద్రాక్షలగును పులుపు!!.
2. ఆటవెలది
బుద్ధి,బలము,యుక్తి,పుష్టిగా శ్రమచేసి
ఫలమునాశపడనభాగ్యమగును
నొవ్వ కుండనాటు నోటితో పెట్టిన
కోయ లేని పంట కొంపచేరు!!.
3. ఉత్పలమాల
అందనిద్రాక్షపుల్లనగునాటలమాటలవృత్తికర్మలై
మందమతుల్ వికారమునమత్సరమానసులైనకాలమున్
సుందరస్వచ్ఛభావమునచూపులుచేతలుధర్మమార్గమున్
స్యందనమెక్క తీయని రసామృత మందును ద్రాక్షపాకమై!



- మాదుగుల నారాయణ మూర్తి,
9441139106

## కృషితోనాస్తి దుర్భిక్షం

కొందరికి
జీవితం వడ్డించిన విస్తరి
మరికొందరికి
ప్రతి చిన్న కోరికా గగన కుసుమం
తీరితే అది ఒక సువర్ణపుష్పమే
అన్ని కోరికలు తీరడం
అసంభవమే కావచ్చు
పట్టుదల కృషి వుంటే ఏదైనా సాధ్యం
ఆశయాలు నెరవేరలేదని
ఆశలు అంతరించాయని
నిశ్శబ్దంలో కలసిపోతే
మానవ పురోగమనం వుండేదా?
అసాధ్యాలను సుసాధ్యాలు చేయడం
మానవ సంకల్పబలంలో మిళితం
మహోన్నత ఆశయానికి
ఆత్మబలాన్ని తోడు తీసుకొని
గెలుపోటముల్ని
చిరునవ్వుతో స్వీకరిస్తూ
దీక్షా కంకణ బద్ధుడై
ముందుకు పయనించేవాడికి
అందని ద్రాక్షపండు అంటూ వుంటుందా?
కార్యసాధకుడికి
దారంతా ద్రాక్షారస ఝరులతో
రసమయం కాదా!?



-కాశినేని గీతాదేవి,
9346866304

## చుక్కలు


చుక్కలు చూస్తూ నిలిచాను
చూపునే దానిలో నిలిపాను
చీకటింట నిలిచాయి
అందరాని చుక్కలే.
పూసిన పువ్వులు వదిలేసి
చుక్కలనే పట్టాలన్న ఆరాటం
అందరానివి అని తెలియక
ఆనందమే కరువాయె.
అందిన పూలు వాడిపోయి
చుక్కలేమో మాయమాయె
ఆశలేమో మిగిలిపోయె
సంతోషం కరిగిపోయె.
అందని వాటిని కోరుకుని
ఆనందమే లేకపోయె
జీవనమే నిలువలేక
నా హృదయం వాడిపోయె.



- వి సంధ్యా రాణి,
9542299500

## నిమ్మలం

కోరికలు గుర్రాలైతె
జీవితం పరుగు పందెం
మనస్సు నిమ్మలమైతె
బతుకు బజారుపాలు కాదు.
పరిగెత్తి తాగే పాలకంటే
నిలబడి తాగే నీళ్ళు ఉత్తమం
అందనివి పనికిరావనుకుంటే
ఆనందానికి అవధులుండవు.
కోరికలు నెరవేరితే
సంతోషానికి కొదువుండదు
అద్దెడొడ్లు మోయలేనోడు
బుడ్డెడొడ్లు మోయనట్టు
ఎండమావులతోని దూపదీరనట్టు
అందని ద్రాక్ష పుల్లగనే ఉంటుంది.



- గుండం మోహన్ రెడ్డి,
9440161636

## అర్థమైంది..

కవిగా ఎదగాలని
కావ్యాలెన్నో రాయాలని
సన్మానాలూ సత్కారాలూ
నేనే పొందాలని
నాకో పిచ్చి ఆశ
అందుకు నేనే అర్హున్నని
నాకో పిచ్చి నమ్మకం.
రోజూ రాస్తూనే ఉన్నా
ప్రతి పత్రికకు పంపిస్తూనే ఉన్నా.
ఐనా
ఒక్కటంటే ఒక్కటి కూడా అచ్చవదే
ఒక్కరు కూడా తీసుకోరే.
నాలాంటి వారివే తీసుకోని పత్రికలు
నాకర్థంకాని భావాల రచనలకూ రచయితలకూ
పెద్దపీట వేస్తుంటే
అప్పుడర్థమయ్యింది
ఆ పత్రిక స్థాయేమిటో.
నా సామర్థ్యం గుర్తించని
పత్రికలు పత్రికలే కాదని
భాషే తెలియని వారితో సైతం
చప్పట్లు కొట్టించుకున్న నా రచనలు
ప్రచురించకపోవడమే నాకెంతో గౌరవమని
మనసు నింపుకున్నా
నాకు నేను శహబాస్ అనుకొని
గది గోడలకు వినిపిస్తున్నా.



- గుర్రాల వేంకటేశ్వర్లు
9490918014

## కీచకుడు ఇలా అనుకుంటే ..

ఉ॥అందములన్న దాని రుచిరంబని ద్రౌపది జూచి మెచ్చి యా
నందమిదే యనన్ వనితనంటు ప్రయత్నము జేసి బొందగన్
పొందును, దుర్మదాంధుడట బోయెను చావగ! వేరుమార్గమం
దందని ద్రాక్ష పుల్లననంకవె కీచకు ప్రాణమానముల్
ఉ॥కీచకుడున్నచొ గలుగు క్లిష్టపరిస్థితి ఘోర యుద్ధమున్
వీచును వాడు కౌరవుల విల్లును బట్టి ప్రతాపరుద్రుడై
గాచగ పాండునందనుల కౌరవసేన బలంబుహెచ్చగన్
కూచము కృష్ణుడై నిలిచి గూర్చ జయంబును కష్టమౌ గదా!
ఉ॥ తొల్లి ప్రయత్నమున్ కురుసుతోరగముల్ బరిమారి మారినన్
జెల్లును రాజ్యభాగమని జీవనమున్ గొనసాగజేసినన్
ఉల్లన ద్రాక్ష తీయననియూరకనున్న సమస్య గల్గునే?
యెల్లరు సౌఖ్యులై బ్రతుకునీ విధి యేల బలీయమయ్యెడిన్.



-ఆదిపూడి రోహిత్,
+1(818)835-7381

## అందని ద్రాక్ష ప్రభుత్వరంగం

ఓ ప్రభుత్వ రంగమా...
ఓ ప్రభుత్వ రంగమా..
ఎక్కడున్నావమ్మా...
ఏమయిపోతున్నావమ్మా
కేంద్రంలోనూ రాష్ట్రం లోనూ కనుమరుగేనా
నీ జాడ తెలిపేందుకు ఒక్క శక్తీ లేదా
హెవీ ప్లేట్లన్నీ ఎలక్ట్రికల్స్‌లో కలిసే
షిప్ యార్డు కు ఆర్డర్లు లేనే లేవాయె
జింక్-ఫాకర్ లకు మహా గట్టి తాళాలు
ఝూట్ మిల్లులూ చక్కెర మిల్లులూ తనఖాల పాలు
ఖనిజాలూ ఇసుకలూ దొడ్డిదారిన రవాణాలు
పాలూ పెరుగులూ పప్పు బెల్లాలూ
రిలయన్సూ హెరిటేజుల పాలు
నిండుకుంటున్నాయి రైతుల భోగాలు
అవుతున్నాయి వారి కడుపులు ఖాళీలు
ఎల్లలు లేని ఎగుమతులు
పెంచుతున్నాయి వెతలు
చూపాలి కనికరం
కల్పించాలి ఉద్యోగం
మారాలి వైఖరి
దేశ అభివృద్ధికి మరీ మరీ
ప్రభుత్వ రంగం కారాదు
అందని ద్రాక్ష
ఉపాధి అవకాశాలతో
కలగాలి ప్రయోజనం.



- ఉండవిల్లి సుజాతా మూర్తి,
74166 05529

## ఆశల నక్షత్రాలు ద్వార తోరణాలు

ఎన్నాళ్లుగానో ఎదురు చూపులు
మంచి అవకాశాలు వస్తాయని
అనుకున్నవన్నీ
నిరాశను మిగిల్చాయి
బాబుకు ఉద్యోగం
నాకు కులాసా
విశ్రాంతి తీసుకోవచ్చని అనుకున్నాను.
గట్టెక్కలేదు
జీవిత నావ తీరం చేరలేదు
పందిరిని అల్లుకోవాల్సిన తీగ కుచించుకు పోయింది.
ఏపుగా పెరిగిన మొక్క
ఎరువు లేక అట్లాగే ఉండిపోయింది
బోన్సాయి బ్రతుకులు ఎన్నాళ్ళు
కొన్ని జీవితాల్లో
ఎక్కడ వేసిన గొంగళి అక్కడే.
బ్రతుకుల్లో వెలుగులు వస్తాయని
చీకటి పోతుందని ఆశపడ్డ
కళ్ళకు కన్నీళ్లే మిగిలాయి
బతుకు అమావాస్య చీకటి అయింది.
ఈ బతుకులో
పున్నమి వెలుగులు
ఎప్పుడు వస్తాయో ఎవరికి తెలుసు
మంచీ మమతా పెంచే కాలం రావాలని
ఎదురు చూసి మోసపోయాను.
ఎప్పుడొస్తుందో మంచి రోజుల కాలం
అందాకా ఈ ఎదురు చూపులన్నీ
నా గుమ్మానికి వేలాడదీస్తాను.
ఆశల నక్షత్రాలను తోరణాలుగా
చేస్తాను నా ఇంటి ద్వారానికి
పచ్చ కార్పెట్ వేస్తాను
ఆహ్వానం పలుకుతాను
మంచి కాలానికి
మంచి రోజులకు..




-డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు,
7702537453


## ఆనందమే మహా భాగ్యం


అత్యాశ అనర్థం
శక్తికి మించిన సాహసం అపాయకరం,
ఉన్నంత లో సరి పెట్టుకుంటే ఉత్తమం
పోయేనాడు రాదు ఏది నీ వెంట
అందని వాటికి ఆశిస్తే
ఆనందమే లేకపాయె
లేని గొప్పతనం చూపిస్తే
ఉన్న గొప్పతనం ఊడిపోవు
ఓటమిని అంగీకరించక
కుంటి సాకులు చెప్పడం ఆత్మవంచన
అందని ద్రాక్ష పులుపు అనుకొని
ఆశ పడకుంటే అదే తృప్తి
పెద్దలు చెప్పిన మాట సద్దన్నం మూట.
ఉట్టిని అందుకోలేని వాడు
అంబరాన్ని ఎక్కి సంబరాలు చేస్తాడట
ఉండ ఇల్లు లేదుకాని
పట్టె మంచం కావాలట.
బుద్ధి మాటలు
పెడచెవిన పెడితే భంగపాటు ఖాయం
అలాగని ఆశయాలు లేకుంటే అసమర్థత
అత్యాశతో అలజడి
ఆనందమే మహా భాగ్యం
తీరని కోరికల వెంట పరుగు
మనసులో పెరిగే అశాంతి బరువు
గొప్పలకు పోకు
గోతిలో పడకు.



-డా. భూంపల్లి కేశవరెడ్డి,
9849473099





# లాక్ డౌన్ వ్యధల అక్షరం !

ప్రతీ వందేళ్ళకి ఒక మహమ్మారి వచ్చి ఊరిని కబళిస్తుంది అని పెద్దలు చెప్తారు ఎప్పుడో పంథొమిదవ శతాబ్దం లో అలా జరిగిందట అలానే ఈ శతబాధపు మామ్మహారి "కరొన". ఎక్కడో చైనా లో కనుగొనబడి ప్రపంచాన్ని తన గుప్పిట్లో పెట్టుకొని గడ గడ లాడిస్తుంది. కరొన కట్టడిలో భాగం గా ఎక్కడిక్కడ స్వీయ నిర్బంధాన్ని ఎర్పాటు చేసుకున్నారు మనుషులు. ఇది మనిషి నుంచి వ్యవస్థకి, వ్యవస్థ నుంచి సమాజాలకు, సమాజాల నుంచి దేశాలకి విస్తరిసించింది దీన్నే "లక్డౌన్" అనే పేరు తో పిలుస్తున్నాం. వ్యవస్థ లో ఉత్పత్తి ఆగిపోతే సమస్తం ఆగిపోతుంది. ఉపాధి రంగం కుదేలైపోయింది. ఉద్యోగ రంగాలు స్తంభించాయి . ఇది సూక్ష్మం గా ఈ నాటి దేశ పరిస్థితి ఇదంతా ఎందుకు చెప్పుకోవాల్సి వస్తుంది అంటే కవి/రచయత/బాల సాహిత్యం లో దిట్ట అయినా డాక్టర్ పత్తి పాక మోహన్ గారు లాక్ డౌన్ కష్టాలని అక్షర బద్ధం చేసి "లాక్ డౌన్" కవితల పుస్తకాన్ని మన ముందుంచారు.

ఈ కవిత్వం లో సామాన్యుడి కష్టాలు/బాధలు/వెతలు, సమాజం ఒక్కసారి గా ఎలా మారిపోయిందో అన్న చిత్రాన్ని ప్రతీ కవిత లో చూడొచ్చు "ఆకలి యుద్ధం లో క్షణం క్షణం చస్తూ బతకాలి " అవును ఇలాంటి యుద్ధాలని ఎన్నో చూసారు కాబట్టే రాయ గలిగారు. "లాక్ డౌన్ " డైరీ లో ఇలాంటి వాక్యాలు ఎన్నో హత్తుకుంటాయి. "బతుకు తెరువు పోయి/పొట్ట చేత పట్టుకొని నడవడం/ఆకలితో పోరాడడం/అబిట్ట్య చిక్కని అజ్ఞాత వాసం" నిజమే ఈ లాక్ డౌన్ అజ్ఞాత వాసం ఎన్నాళ్ళు చేయాలో తెలియదు, ఎప్పుడు ముగుస్తుందో తెలియదు అయినా తప్పదు ఎందు కంటే దేశం అంతా ఒక మామ్మహారి తో పోరాడుతుంది .

ఈ లాక్ డౌన్ అందర్నీ ఇంట్లోనే ఉండేలా చేసింది. ఒకప్పుడు వినోదం కోసం బయటకి వెళ్ళేవాళ్ళు ఇప్పుడు వెళ్లే ఛాయస్ లేదు కాబట్టి ఇంట్లోనే టీవీ లకి అతుక్కపోయారు అది ఒకందుకు మేలే చేసింది ఎందుకంటే పాత సీరియల్స్ ని మంచి కార్యక్రమాల్ని చూసే లా ప్రోత్సహించాయి అందులో ఒక "రామాయణం" దీనిగురించి పురాజ్ఞాపకం గా గుర్తు చేసుకుంటూ ఇలా అంటారు " జ్ఞాపకాల అలలను కదిలించి /మరో నూరేళ్ళకు నన్ను పునర్జీవున్నీ చేసింది " నిజమే పాత సంగతులు యాదికి వచ్చినప్పుడు భలేగా ఉంటుంది అందులో చిన్నప్పటి సంగతులు గుర్తు చేసుకున్నప్పుడు మరీను. ఇక లాక్ డౌన్ పుణ్యాన అన్ని వృత్తుల వారు ఇళ్లకే పరిమితం అయ్యారు. మరి సమస్త పనులు చేసే వారు పరిమితం అయితే ఎలా పరిస్థితి. అందుకే "ఛాలెంజ్ " ల పేరిట ఒకరికొకరు పని చేయడం నేర్చుకున్నారు . ఈ జాబితా లో ప్రముఖుల నుంచి మాములు వాళ్ళు వరకు పాల్గొన్నారు. ఇలాంటి ఛాలెంజ్ ల నేపథ్యాన్ని అక్షరీకరించారు "ఛాలెంజ్" కవితలో ....ఎన్నడూ గరిట పట్టని వాడు/ బువ్వ కూర వండుదు /సూర్యుని చూడని జీవితాలు తోటపని చేస్తున్నాయి" అవును అన్ని పనివాళ్లకే వదిలేసి సుఖం మరిగిన సెల్రబిటీ ల స్థితి ని తెలిపాడు చివర్లో చక్కని సందేశం ఇస్తారు "ఎవరన్నా ఆకలి మీద ఛాలెంజ్ విసుర్రాదుండిరి/ఇంకెవరన్నా అన్నాన్ని పడే పండియ్య రాధుర్రి ఏది ఒక సారి చూద్దాం" ..నిజమే పదిమంది మంచి కోరే ఇలాంటి ఛాలెంజులు రావాలి కదా ...

కూలి కోసం కడుపు కోసం పొట్ట చేతపట్టుకొని ఎక్కడెక్కడికో వలసలు పోతుంటారు. ఊహించని ఉపద్రవం మహమ్మారి రూపం లో ఎదురు పడితే ఎలా తట్టుకుంటారు . కరోనాని కట్టడి చేసేందుకు ప్రభుత్వం లాక్ డౌన్ పెట్టింది దీని వలన లక్షల కుటుంబాలు ఉపాధి ని కోల్పోయి రోడ్డు న పడ్డాయి. ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు చేతులెత్తేశాయి ...ఇక కలో గంజో ఉన్న ఊళ్ళో బతుకుందాం అని వలస బాట పట్టారు. బాధాకర నేపథ్యాన్ని "నడక" లో అద్భుతం గా చెప్పారు. "రోడ్డు చెమట పాదాలతో నడుస్తున్నాయి/ఎంత నడిచినా తొవ్వ దంగుతా లేదు /పెయ్యి మీది కుబుసం తొలిగి పోతలేదు." అవును ఇది ఒక్క రోజు ప్రయాణం కాదిది బతుకు కోసం యుద్ధం చేస్తున్నారు వాళ్ళు. పని ని నమ్ముకొని వచ్చినవాళ్లు యాజమాన్యాల ధోరణి తో రోడ్ న పడ్డారు.. అందుకేయజమానులు పుణ్యాన కూలీ లా వాడలన్నీ వెలి వాడలైనాయి/ ఫుట్ పాతాలు/పార్కులు ఆదరించే తల్లులు/"తాళం "తెరిచే లోపల పాణం ఆగేటట్టులేదు /గమ్యం వచ్చినా రాకున్నా బొబ్బలు బొబ్బలైన పాదాల ప్రవాహం ఆగేట్టు లేదు ..

తమ వారి కోసం/తమ బతుకు కోసం మొదలుపెట్టిన ఈ నడక ఎప్పటికి ఆగేట్టు లేదు ..గమ్యం వచ్చినా రాకున్నా ఈ నడక ఆగదు అని ఎంతో ఆర్ద్రత తో చెప్పారు . బహుశా ఈ కరోనా మరణాలను చూసే కావొచ్చు ఒకరకమైన వేదాంతం వచ్చిది. అవును "మరణం లేనిది" కవిత లో మరణం అంటూ లేనిదీ ఒక్క మృత్యువు కి మాత్రమే అని దాన్ని చూసి భయపడటం తగదని చెప్తారు.అది కరోనా రూపం లో రావడం కొంచం బాధాకరమే అయినప్పటికీ తప్పించుకోలేమని సత్యాన్ని ఎరుక పర్చారు. మరణం చివరి అంకం కాదు/నటన ముగించేందుకు మరణం మహా సౌందర్యలహరి/ఎప్పుడైనా , ఎక్కడైనా అనుకోకుండా వచ్చే అతిథి " ఇంత గొప్ప సత్యాన్ని ఎంత బాగా చెప్పారు. నిజమే మృత్యువు మన వెంటే ఉంటుంది ఎప్పుడు ఏ రకంగా, ఎవరి రూపం లో వస్తుందో ఎవరు చెప్పలేరు అది "కరొన " అయితే ఇహ చెప్పేది ఏముంది అందుకే ఆ మృత్యువుని చిన్న చిన్న జాగ్రత్తలతో తిప్పి కొట్టమంటాడు. ఇదే కవిత చివర్లో "శానిటైజర్ తో ఎదిరించావో కరోనా /నీ కాళ్ళకిందే పడే ఉంటుంది. తృణీకరించావో మృత్యువు నీ శిరస్సు కిరీటం లో కిరణమై మెరుస్తది " కరొన మృత్యువు రూపం లో వచ్చినా కూడా ఎలా ఎదిరిస్తే మనం తప్పించుకోవచ్చునో తగిన జాగ్రత్తలు చెప్తారు !

ఈ లాక్ డౌన్ కాలం లో హెల్త్ వర్కర్స్ ప్రాముఖ్యం అంతా ఇంతా కాదు. ఎటు చూసినా కూడా కరొన భయం తో జనం బయటకు రావడం మానేసిన్నప్పుడు ఒక్క "ఆశ " వర్కర్స్ మాత్రమే ఇంటి ఇంటికి తిరిగి కరొన బాధితుల సంఖ్య ని ప్రభుత్వానికి తెలియజేసారు. వారు నిత్యం ప్రమాదం లో ఉన్నారని తెలిసి కూడా ధైర్యం తో ముందడుగు వేశారు అలాంటివారికి తన అక్షరాలతో నమస్సులు తెలియజేసారు "ఆశ దీపాలు" అనే కవితలో ...

"దీపం చిన్నదా/పెద్దాదా అని కాదు ముఖ్యం "వెలగడం" ముఖ్యం" నిజమే కదా దీపం చూడటానికి చిన్నదిగా కనిపిస్తుంది కానీ అది ఇచ్చే వెలుగు చీకటి ని పారద్రోలుతుంది. అలాంటివాళ్ల జీతం చిన్నది అయినా బతుకు గోదారిని ఈదుతారు అల వోకగా అందుకే చివర్లో అంటారు "దీపం చిన్నదే కావొచ్చు/ "ఆశా" దీపాల వెలుగులు పెద్దది "లైట్ హౌస్ లాగ దారి చూపే ఆ అచంచల నమ్మకం గొప్పది "...... ప్రజల అందర్నీ కాపాడాలన్న వాళ్ళ సంకల్పం గొప్పది కదూ . ఈ లాక్ డౌన్ కాలం లో ప్రజలు ఇళ్లలో ఉండే వ్యర్థపదార్థాలను రోడ్ పై పడవేస్తే వాటిని పారిశుధ్య కార్మికులు ఎంత గొప్ప సేవ చేశారో వాళ్ళు నిజమైన వీరులు ....కరొన తో యుద్ధం చేసే క్రమం లో తమ పూర్తి సహకారాన్ని అందించారు., "వారియర్స్ " కవితలో ఇలా అంటారు.

**"తాము తరిగిపోతున్న మనల్ని గెలిపిస్తున్న ఘర్మ వీరులు పారిశుద్ధ కార్మికులు పరిశుద్ధ మనస్సులు /అక్షరాలా కొలతలకు అందని నిర్మల సేవా మూర్తులు "**

పారిశుద్ధ కార్మికుల సేవ వెల కట్టలేనిది. గొప్ప ఔదార్యం కలిగిన వారు.

"లాక్ డౌన్ " కవిత లో అసలు ఈ మహమ్మారి రావడానికి గల కారణాలు "లాక్ డౌన్" అంటే ఏమిటి ఇంతకు ముందు వచ్చిన విపత్తులకి వీటికి తేడా ఏమిటి చక్కగా వివరించారు. ఒకచోట

"భయం గుప్పిట్లో నిద్రపోతూ /క్షణ క్షణానికి ఉలిక్కిపడుతూ

ఎవరు చేసిన పాపమో మళ్ళీ మళ్ళీ కదుక్కొం టుంది/ ఇప్పుడు కాలం స్తంభించింది.

మనల్ని మనకే పరిచుతుల్ని చేసే "క్వారంటైన్ గా అవతరించింది. మన నిఘంటువులో కొత్త ఆరోపం

నిజమే కదా మనకి ఈ క్వారంటైన్ అన్న పదం వినపడలేదు దీన్నే మనం "నిర్బంధం/స్వీయ నిర్బంధం" గా పిలుచుకుంటున్నాం కదా .. ఈ కరొన ని కట్టడి చేయాలంటే కొన్ని సూత్రాలు పాటించాల్సిందే ...మాస్క్ వేసుకోవడం, భౌతిక దూరం పాటించడం అందకే "గ్లొబ్ గ్లోబంతా మూతికి బట్టకట్టుకుని /కరొన చుట్టూ మాత్రం తిరుగుతుంది అంటారు.

అవును ఇప్పుడు ఈ మహమ్మారికి మందు లేదు నివారణ ఒక్కటే మార్గం అందుకే కదా ఈ జాగ్రతలు అన్నీ చెప్తున్నారు

కరోనా ని సమర్థవంతం గా ఎదుర్కొనడం లో వైద్యుల పాత్ర ఎనలేనిది అందుకే మనవాళ్ళు అన్నారు వైద్యో నారాయణో హరి అని ...వైద్యుడిని దేవుడు తో పిలుస్తాము ఎందుకంటే ప్రాణాలు నిలబెడతాడు కాబట్టి. అందుకే"వైద్య నారాయుడు" లో డాక్టర్ గొప్పతనాన్ని వివరిస్తారు .

"ప్రపంచం అంతా భయంతో వణికిపోతున్న సమయం లో /అతడు మాత్రం కుటుంబాన్ని వదిలేసి సేవా మూర్తిలా నిలుస్తున్నాడు/ నిజమే కదా అందరూ భయం తో పారిపోతుంటే డాక్టర్ మాత్రం దగ్గరికి వచ్చి తన ప్రాణానికి ముప్పు ఉందని తెలిసినా ముందుకు వచ్చి చికిత్స చేస్తున్నాడు ఎంత గొప్పవాడు . మనం అతన్ని గౌరవించాలి " దేవీడిప్పుడు వైద్యుడి లా నడుస్తూ కనిపిస్తున్నాడు /రండి కలిసి దండం పెడదాము " కరొన తో యుద్ధం చేసే వీరుల్లో డాక్టర్ లు ముందు ఉంటారు వారిని గౌరవించడం సముచితం కూడా ..

లాక్ డౌన్ సమయం లో పారిశుద్ధ కార్మికులు/డాక్టర్ ల తరువాత అత్యంత ప్రభావితం చూపింది పోలీసు లు మాత్రమే....శాంతి భద్రతలను కాపాడుతూనే వ్యాధి ని మరింత గా విస్తరించకుండా ఎక్కడికక్కడ కట్టడి చేశారు అంతే కాదు కరోనా వచ్చిన వాళ్ళని ప్రజలలో కలవనీయ కుండా కాపలా కాసారు ....పోలీసు ని చూస్తే భయం తో వణికి పోతాం కానీ "టార్చిలైట్ " లా అందరికి దారి చూపే పోలీస్ గౌరవించబడాలి అంటారు .

"ప్రపంచం అంతా ముసుగు తన్ని ఇంట్లో నిద్రపోతున్న క్షణాన/నీవు రోడ్డు మీద టార్చి లైట్ లా కాపలా కాస్తావు/

మృత్యువు విశ్వ గీతమై నినదిస్తున్న గడ్డు కాలం లో నాలోగో సింహామై పహారా కాస్తుంటావు అయినా ఎందుకో కనెక్ట్ కాలేకపోతున్నాం "

మంచి సమాజం కోసం పోలీసులు పడుతున్న తపన ని అర్థం చేసుకోలేక కనెక్ట్ కాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తారు ఈ కవి.

కరొన మీద రాసిన నానీలు చాలా ఆలోచింప చేస్తాయి .. ..నిజానికి నానీలు చిన్నవే అయినా అర్థం లో మాత్రం చాలా పెద్దవి అందుకే నాలుగు పాదాల్లో నలభై పేజీల సారాన్ని చెపుతాయి అందులో

**"వర్క్ ఫ్రేమ్ హోమ్**
**అందమైన మాట**
**ఇప్పుడు చాకిరికి**
**కొత్త రాచ బాట"** నిజమే నిన్నటి దాకా ఉరుకుల పరుగుల జీవితం లో కిక్కిరిసిన ఉన్న ఆఫీస్ లో ఒకరికొకరు రాసుకుంటూ తిరిగేకాలం. మరి లాక్ డౌన్ ఆఫీస్ లో కాకుండా ఇంట్లో నుంచే పని చేసే సౌకర్యం వచ్చినప్పుడు పని తగ్గాలి కానీ పని పెరిగి ఒత్తిడి కి గురి అవుతున్నాడు కదా...

యాంత్రిక జీవితం లో ఒకరికొకరు పలకరించు కోవడమే గగనం . కనీసం కుటుంబ సభ్యులు కూడా ఒకరినొకరు చూసుకోవడం చాలా కష్టం అలాంటిది ఈ కరొన కాలం లో కుటుంబం అంతా ఒకరికొకరు దగ్గర కూర్చొని భోజనము చేయడం, కబుర్లు చెప్పుకోవడం ఇదంతా కరోనా మహిమనే అందుకే ఒక నాని లో అంటారు

**"ఎన్నాళ్ళయింధో**
**ఇంటిల్లిపాది కలిసి కూర్చోక**
**కరోనాధే**
**ఈ కమాల్"** నిజమే కదూ అప్పటిదాకా ఎక్కడి ఎక్కడికో ఎగిరిపోయిన పిట్టలన్నీ ఒకే గూటికి చేరుకోవడం మంచిదే కదా. చెడ్డలో కూడా మంచి అంటే ఇదే కాబోలు ..

కొన్ని నానీల్లో వలస కార్మికుల బాధల్ని/ఆకలి గావు కేకల్ని బీద బతుకుల పట్ల సహానుభూతిని వ్యక్తం చేస్తాయి.


**"నెత్తుటి పాదాలు**
**బతుకుల్ని కొలుస్తున్నాయి**
**నడకిదిప్పుడు**
**కొత్త భాష "** అంటూ వలస కార్మికుల వెతల్ని కళ్ళకి కట్టినట్టు చూపించారు అలాగే వలస కార్మికుల ఆకలి గురించి చెప్తూ ..


**"ఆకలిది**
**గమ్యం లేని యాత్ర**
**వలస కార్మికులది**
**ముగింపు లేని పాత్ర "** పాపం జీవిత నాటకం లో గమ్యం లేని ఔచిత్యం తో ముగింపు లేని ఒక వ్యధార్థ పాత్ర వలస కార్మికులది . ఎవరికీ వారి ఘోష పట్టదు ...ఎంత విచారం కదా...

ఇవి కేవలం కొన్ని మాత్రమే ఇలాంటి చక్కటి సందేశం కలిగిన కవితలు ఎన్నో ఈ "లాక్ డౌన్ " కవితా పుస్తకం లో దొరుకుతాయి. బాల సాహిత్యం లో గొప్ప కృషి చేస్తున్న డాక్టర్ పత్తిపాక మోహన్ గారి లో సమాజం పట్ల కన్సర్న్ ఉంది. బాధ్యత గా తనకు తోచినంత సహాయం చేయాలని అనుకుంటారు. అక్షరాలతో ప్రజల్ని చైతన్యపరిచేలా ఉంటాయి. కవి ఎప్పుడు ప్రజా పక్షమే అంటారు ఆ విషయము లో పత్తి పాక మోహన్ గారు ముందు ఉంటారు. అన్ని బంద్ పెట్టిన ఈ కరొన/లాక్ డౌన్ సమయం లో ఒక కవితా సంపుటిని ఆన్లైన్‌లో విడుదల చేయడం ముదావహం. మరిన్ని మంచి కవితా సంపుటులు వారి ద్వారా రావాలని కోరుకుంటున్నాను. డాక్టర్ పత్తి పాక మోహన్ గారికి అభినందనలు.

ప్రతులకు: వనపట్ల సుబ్బయ్య
భార్గవి హెయిర్ స్టైల్స్, నల్లవెల్లి రోడ్
బస్టాండ్ దగ్గర, నాగర్ కర్నూల్
నాగర్‌కర్నూలు- 509 209.(తెలంగాణ)

-పుష్యమీ సాగర్
9010350317





## ఆదర్శం

నీ కళ్ళముందున్న జీవిత కాలం
అపూర్వమైనదని తెలుసుకో
దాన్ని ఉన్నతమైన బాటలో నడిపించు
భారతీయు సంస్కృతీ సాంప్రదాయాల పరంగా
మన సమాజంలో కుటుంబ వ్యవస్థ ఉన్నతమైనది
ఆదర్శప్రాయమైనదని గ్రహించు
పెద్దలే కుటుంబానికి మార్గదర్శకులు
సాక్షాత్ దైవ స్వరూపులని తెలుసుకో
పెద్దలకు దశలవారీగా జరిపే
షష్టిపూర్తి వంటి వేడుకలు జరిపించి
భవితకు కావాలి ఆదర్శం
మానవ శరీరమే రథం
ఇంద్రియాలే గుర్రాలు కోరికలే పగ్గాలు
రథసారధి జీవుడు
నీ గమ్యం పరమాత్ముడి సన్నిధి
అపారమైన అనుభవ జ్ఞానంతో
ఛేదించు అంధకారాన్ని
పెద్దలను పూజించి
వంశవృక్షానికి కావాలి ఆదర్శం.

-రాయవరపు సరస్వతి
7989665525



## చదువన్నది.. ఒక దీపం

పల్లవి: చదువన్నది- ఒక దీపం
మనిషికది- మరో ప్రాణం
కడవరకు- నీతో వచ్చే నేస్తం
నిను నడిపించే- రేపటి కిరణం

చరణం:సూర్యుడే లేకుంటే
భూమికి వెలుగుండేనా
చంద్రుడే.. రాకుంటే
వెన్నెలపాట పుట్టేనా

అక్షరాన్ని నేర్వకుంటే
చైతన్యం చిగురించేనా
ఆలోచనే రాకపోతే
ఆవలితీరం తెలిసేనా
బతుకుబండి..కదిలేనా

కెరటాలు కదలందే
కదలి కథలందేనా
కలలన్నది రాకుంటే
ఆశయాలు నెరవేరేనా

అక్షరాన్ని నేర్వకుంటే
మనిషికి విలువచ్చేనా
ప్రశ్నలు పుట్టకపోతే?
పనిముందుకు జరిగేనా
ప్రగతిరథం కదిలేనా

వీచేగాలి లేకుంటే
జీవరాశి బ్రతికేనా
నిప్పున్నది లేకుంటే
రోజన్నది గడిచేనా.

అక్షరాన్ని నేర్వకపోతే
అజ్ఞానం ఓడిపోయేనా
కాలంతో కదలందే
విజ్ఞానం విరిసేనా
విషయాలు తెలిసేనా

భూభ్రమణం లేకుంటే
చీకటి వెలుగులుండేనా
ఆకలన్నది లేకుంటే
అన్నమన్నది పుట్టేనా

అక్షరాన్ని నేర్వకుంటే
మహాత్మాఫూలే అందరికీ
చదువు చెప్పగలిగేనా.

అక్షరాన్ని నేర్వకుంటే
భారతరత్న అంబేద్కర్
రాజ్యాంగాన్ని అందించేనా

వర్షరుతువు రాకుంటే
పచ్చదనం పుట్టేనా
శ్రమ అన్నది లేకుంటే
సంపదన్నది వచ్చేనా

అక్షరాన్ని నేర్వకుంటే
వానరుడే-నరుడయ్యాడనీ
డార్విన్ చెప్పగలిగేనా
అక్షరాన్ని-నేర్వకుంటే
చీకట్లను-తరిమేసే
ఎడిసన్-బల్బ్ వుండేనా

ఓ- అక్కల్లారా-అన్నల్లారా
ఓ చెల్లెల్లారా-తమ్ముల్లారా
నా మాటను-మరి వింటారా
మంచిగ-ఆలోచన చేస్తారా!

చదువన్నది-ఒక దీపమనీ
ఆ దీపమే- ఎన్నో దీపాలను
వెలిగించుననీ-గ్రహించాలె-మీరంతా
మీ జీవిత గమనాన్నే-ఇక మార్చాలె

అందుకే-

బడికెళ్ళలేని-రేపటి పౌరులారా!
సమయం చిక్కని-వయోజనులారా!
పలకాబలపం పట్టాలి
చదువులెన్నో చదవాలి
చరిత్రను తిరగ రాయాలి.

అంతా ఒకటై నడవాలి
మానవ-మహా ప్రస్థానంలో
మరో మహోదయమవ్వాలి.

- బి. గోవర్ధనరావు
సెల్: 944196 8930



## మౌనాన్ని దోసిటపట్టి

అంతరంగం అంతర్నేత్రమై
మాటను మౌనాన్ని కొలుస్తుంటుంది
దాచుకున్న ఉద్వేగాలు ఉలిక్కిపడుతుంటాయి
ఊరటనిచ్చేదెవరని

భుజంపై భారాన్ని దించాలంటే
కల్లోల కాసారాన్ని ఈదకతప్పదు
భుజం తట్టే చేతుల స్పర్శ కాదు
బరువు దించే కరములే వరములు


సమూహాలే కరువవుతున్నవేళ
ప్రయాణమూ ఒంటరిదే
ఓర్పును మాస్క్ చేసుకుని
దిగులు వైరస్ ను ఓడించాలి

సమయసందర్భాలు
సమీకరణాల ఎత్తుపల్లాలు
భయం మేకులు దిగ్గొడుతుంటే
ధైర్యంతో భయాన్ని దిమ్మిస చేయాలి

ప్రయత్నం లేని ఆలోచనలు
ఎన్నిచేసినా
ఎన్నదగిన మాటలెన్ని చెప్పినా
అడుగు నీదే..మడుగు నీదే

కొలిచే అంతరంగం అంతరాల పేటిక కాదుకదా
పూలుపూసే మౌనాన్ని దోసిటపట్టి
మాటను గారాలపట్టి చేసి
కష్టాల కాసారాన్ని దాటాల్సిందే


-సి.యస్.రాంబాబు
8374818961



## మురిసే పూవు

మల్లె , మందారం, బంతి , చేమంతి
గులాబీలు, జాజులు పువ్వులలో
ఎన్ని రాకలో ..ఎన్నెన్నెన్ని రంగులో
రాజసమేలుతూ తోటలో విరబూసి
ఊగిసలాడుతున్నాయి వగలు పోతూ
తోటమాలి కష్టం .. యజమాని అభిరుచి
కలగలిపిన డాబు దర్పం దాగివున్నాయి
.ఈ తోటలో ..సంపన్న కుటుంబంలో జన్మించి
ఆ స్థాయి జీవనవిధానంలో పెరుగుతూ
కార్పరేట్ బడులలో చదివే చిన్నారుల
రాజరికాన్ని ప్రదర్శిస్తూ ఉంటాయి
ఈ పూవులు ...తూరుపు రేఖలు చూడని నిశిలో. .
జరిగిన తప్పుకు ఊపిరి పోసుకున్న ప్రాణం
కుప్పతొట్టిలో కేరుమంటూ ఉంటే
.ఓ అమ్మ ఎత్తుకుని పెదాలు తడిపితే ..
మరో అమ్మ ఓ ముద్ద అన్నం పెడితే
గాలికి తిరుగుతూ ..కడుపు మంటతో
రాగాలు తీస్తూ మైమరచి పడుకునే పసివాడు
ఆ గొంతులోని మాధుర్యాన్ని అందరికి పంచేవాడే
వాడే రోడ్డుపక్కన పసివాడు
గాలికి కొట్టుకువచ్చి చెత్తాచెదారంలో చిక్కుకుని
మురికి నీటి సాయంతో
ఫలధీకరించి మొలకయిందో విత్తనం
నాలుగాకులకింద మొగ్గతొడిగి ఓ పూవై విరిసింది
అందరినీ అబ్బురంలో ముంచి మత్తెకించే సుగంధాలతో
ఈ పూవే మురికి గుంటలో మురిసే పూవు
పూవైనా పసివాడైనా ... పీల్చే గాలి ఒక్కటే..
ఆహారంలో తేడాలున్నా..
ఆకలి ఒక్కటే.. భేదం మరిచి స్నేహం చేస్తే..
విరిసే మమతల మందారం
కలిసిన మనసుల మల్లెల సుగంధం..!

-సుజాత తిమ్మన
9391341029



పుస్తక సమీక్షలు

# "కాలాన్నే.. తమతో పాటు పరుగెట్టించే కథలు"

అనునిత్యం ప్రతివ్యక్తీ, అనుభవాలను ప్రోవు చేసుకుంటూనే ఉంటాడు. అనుభవాలు, స్వానుభవాలే కానక్కరలేదు. జ్ఞాననేత్రంతో పరికించగలిగితే వేవేలు.

డా॥లక్ష్మి రాఘవగారు తనచుట్టు చోటు చేసుకుంటున్న అనుభవాల్ని, మనసుతో చూసి వాటిని కథలుగా మలుస్తారు అందుకే అవి సహజత్వాన్ని సంతరించుకుని పాఠకుడికి అతి దగ్గరవుతాయి.

టెక్నాలజీ మనలను ఎంత ఆవరించుకున్నా, ప్రపంచం ఎన్ని క్రొత్త పోకడలు పోతోన్నా "మానవ సంబంధాలు" మనిషి మనుగడ ఉన్నంత కాలమూ అవసరమే అని గుర్తించిందీ రచయిత్రి. అందువల్ల వీరి కథలు, కథల్లోని సన్నివేశాలు, సమస్యలు వాటికి చూపే పరిష్కారాలు నిరంతరం నిలిచే ఉంటాయి. ఇదీ- ఈ రచయిత్రి ప్రత్యేకత. వీరు సమాజాన్ని అర్థం చేసుకోవటమే కాదు, సమస్యలకు బాధ్యతా యుతంగా స్పందిస్తారు. సమాధానాలను అందిస్తారు.

మనిషి భౌతిక శరీరాలకే కాదు, మానసిక అంతరంగానికీ చికిత్స అవసరమయ్యే 'జబ్బులు' ఉంటాయని తెలుసుకుని వాటికి చికిత్స చేసే ప్రయత్నమే వీరి "మనసుకు చికిత్స" అన్నటైటిల్ కథ. ఎన్.ఆర్.ఐ.ల జనాభా అంతకంతకూ, పెరుగుతోన్న మన దేశంలో పెద్దవారి సంరక్షణ భారమైపోతుంటే-తల్లి యెడ తనయుడు బాధ్యత విస్మరించినా, మాతృ ప్రేమ తనయుడి యెడ ఎల్లవేళలా ఉంటుందని చెబుతుంది "ఎంతైనా అమ్మ" కథ. అవును. మరో వందేళ్ళు కాలం ముందుకు పోయినా కలుషితం కానిది'అమ్మ ప్రేమ' అని చెప్పే ఉదాత్త కథ! మనసున్న పాఠకుడిని కలిచి వేస్తుంది ఈ కథ.

'సమాజం మారాలి, మనుషులు మారాలి' అంటూ నినాదాలిస్తాం. కాని 'అమలు' వరకు వచ్చేసరికి ఎవరికి వారు తప్పుకుంటారు. 'మార్పు తేవటానికి 'బీజం' మొదట మనలోనే పడాలి' అని చెబుతుంది "మార్పు" కథ. బి.టెక్ చదివి మంచి ర్యాంకు తెచ్చుకుని, కేంపస్ సెలక్షన్‌లో ఏకంగా మూడు కంపెనీలు పిలిచినా, కాలేజీలో లెక్చరర్‌గా చేరాలని నిశ్చయించుకుంది రమ్య. కారణం తెలుసుకున్న తండ్రి రామచంద్రే కాదు. మనమూ, గర్వంగా 'ఫీల్' అవుతాము మార్పు" కథ చదివాక.

మనసుకు ఆర్థికావసరాలు, కుటుంబాన్ని నడిపించే భర్తకేకాదు, గడప దాటని, ఇల్లాలు భార్యకు కూడా ఉంటాయన్న గ్రహింపు ఉండాలనే ఉదాత్తభావం తండ్రిది. బాధ్యతలు పెంచి భారం కావటం ఎందుకు అన్న మహోదాత్త భావం తల్లిది. 'పెన్షన్' కథ చదివిన పాఠకులు కూడా అబ్బుర పడకుండా ఉండలేరు.







స్థాలీపులా కన్యాయంగా వివరించిన పై 4 కథలే కాదు సంకలనంలోని మిగతా 23 కథలూ పాఠకులను అలరిస్తాయి. 'పని లేదని ఆకలి ఆగదు' (చిన్న బతుకులు)' ఇది కలికాలం మనం చేసే తప్పులకు దేవుడు ఇక్కడే ఈ జన్మలోనే వేస్తాడు' (విధి). 'తల్లికి ఎప్పుడూ, పిల్లలలో ఎవరికి ఎక్కువ కష్టం ఉంటుందో వారి మీదే ఎక్కువ దృష్టి ఉంటుంది (మాతృ హృదయం).

ఆణిముత్యాల్లాంటి సత్యాలు ఈ కరోనా కష్ట కాలంలో మనలోని "ఆక్సీజన్" శాతాన్ని పెంచుతాయి. సుమారు ఎనిమిది నెలల కాలంలోనే ఇన్ని కథలు రాయగలిగిన ఈ రచయిత్రి కాలంతో బాటు నడవరు. కాలాన్ని తనతోబాటు పరుగెట్టిస్తారు.

ప్రతులకు: లక్ష్మి రాఘవ
3-99, అప్పగారి వీధి
కూరబలకోట-517 350
చిత్తూరు జిల్లా. ఏ.పి.
సెల్: 94401 24700


- కూర చిదంబరం
సెల్: 8639335675



## నేను కరోనాను!

నేను కరోనా వైరస్‌ను, నేను కరోనా వైరస్‌ను
చైనా దేశంలో పుట్టాను
అణువు కంటే చిన్నదానిని
అణుబాంబు కంటే బలమైనదానిని
కలెక్టర్‌నైనా, కార్‌ోబార్‌నైనా
కుబేరున్నైనా, కూలివారినైనా
ఏమతం వారైనా, ఏ జాతివారినైనా
యుమున్ని ఎదురించిన మానవుడైనా
నా పేరు వింటే చాలు
వెన్నుపాములో వణుకు పుడుతుంది
అణుబాంబును చూస్తే భయపడని మనిషి
నా పేరు వింటే బేజారైతాడు
ఏనుగులా ఉన్నవాన్ని
ఎలుకలా చేస్తాను
మొద్దుల ఉన్నవాన్ని
ముద్దగా మారుస్తాను
మొదలు లేకుండా చేస్తాను
నేను కరోనాను, నేను కరోనాను.

- సిరిగాద శంకర్
సెల్: 9493301985



## ఎన్ని రూపాలో!

ఉదయించే సూర్యుడు
సుప్రభాత సూర్యుడు
ప్రకాశించే సూర్యుడు
వెలుగుల సూర్యుడు
మండే సూర్యుడు
ప్రచండ సూర్యుడు
ఆగ్రహించే సూర్యుడు
దాక్కునే సూర్యుడు
గ్రహణం సూర్యుడు
అస్తమించే సూర్యుడు.

-యలమర్తి అనూరాధ
చరవాణి:9247260206



## తీర్పు

ఔను
నేను అడవికి
రాజుని
నా తీర్పే అత్యున్నతం

కొన్ని మృగాలు
మూకుమ్మడిగా
దాడిచేసాయి
దస్త్రం దస్కం దండిగా
నా కంటికి కనబడవు
నా నెత్తికి మత్తెక్కి చెప్పిన
మగత తీర్పు
అహో రాజ్యమా పరిధవిల్లు.

పండు ముదుసలి
వణుకుతూ
తిండి తినలేక మొత్తుకుంటుంటే కాదని
అర్ధరాత్రి కాటేసి మొరిగే కుక్క ని
స్వేచ్ఛగా తిరగమని వదిలేసా
నేనే రాజుని కాని నా వెనుక ఏదో తంత్రం.

యాడనో పుట్టి
తన మూలాలెతుక్కుంటూ
నా రాజ్యాన పుట్టిన బిడ్డల హక్కులకై
నినదిస్తున్న బిడ్డ
నాకు శత్రువు
బైటికి వదలను నా నైజం! నిజమూనూ!!.

నేను సావాలా నా వెనుక తంత్రం సావాలా
సావక పోతే రాజ్యమంతా శవాల దిబ్బ
దుర్భిణీ కి సైతం దొరకదు జీవి


-గిరి ప్రసాద్ చెలమల్లు
9493388201



## అనుభవాల మూట

ఒరేనాన్నా...!
జీవితం చిత్రమైందిరా...
ఎప్పుడు పరీక్ష పెడుతుందో
ఎందుకు శిక్ష విధిస్తుందో
ఎలాంటి క్రమశిక్షణ నేర్పిస్తుందో
అంచనా వేయలేని అమాయకుడిని...
నిత్యాన్వేషినైనా
విఫల యాత్రికుడిని...
నువ్వు 'బాల్య'మనే వంతెనదాటి
యవ్వన తీరంలో 'స్వేచ్ఛ'ను వెతుకుతున్నావు..
అది మరీ గడుసుదిరా
'బాధ్యత'ల ఊచలలో బందీ అయితే గానీ
నిన్ను చూడటానికి రాదు...
లోకం తీరు నీకు తెలియదు
చెబితే వింటుంది
వింటే చెబుతుంది
నీ ఆశల కొలిమిలో
సాన పట్టాల్సిన కోరికల కత్తులు చాలా ఉన్నాయి..
నువ్వు గమ్యం దిశగా పరుగెత్తుతున్నావు..
నేను నీ పాదాల క్రింద మాటువేసిన
ముళ్లదారిని ఆక్షేపిస్తున్నాను...
ఆ గతుకుల బతుకుబాటలో
అలసిపోయిన బాటసారిని కదా...!
నువ్వు వినోదయాత్రలో విహరించాలనుకుంటున్నావు...
నేను విజ్ఞానపు తీర్థంలో
నిన్ను పునీతుడిని చేయాలనుకుంటున్నాను...
ఒరే నాన్నా...!
ఒక్కసారి నా మాట వినురా
ఈ 'అనుభవాల మూట' విప్పిచూడు
ఇవి కేవలం నా వైఫల్యపు ఆనవాళ్లు కాదు
నా జీవన సాఫల్యపు పునాదిరాళ్లు...

- డాక్టర్ మడత భాస్కర్
8919328582



## ఆరాధనే ఓ బంధం?

నిజం ఎక్కడో ఉండి
మనిషి ఇక్కడున్నా
ఎందుకు?.
మనసు ఎక్కడో ఉండి
మాటలు ఇక్కడున్నా
ఎందుకు?.
నిజానికి ఎప్పుడూ తోడుండే
నమ్మకం ఇక్కడుంటే.
మనిషిలో మనసు....
మాటలో అందం...
ఆనందంలో అనుబంధం.
ఓ ఆరాధనగా
జీవితంలో సొంతకాబడే
కొన్ని రోజులు కోసం
ఎదురుచూస్తోంది.

- సాహితి
83094 63567



## తను తీసుకున్న గోతిలో


మాటేసి వేటేసి
పోటేసె వేటగాళ్ల కన్నా
దారుణం స్వార్థపరుల
దాష్టీకపు జిత్తుల బుద్ధి..

మాటాడి పూటా గడిపి
మాటిచ్చి సర్రున
తూటా పేల్చినట్లు
తటాలున వక్రబుద్ధి జూపి
తోటి మనిషన్న ఊసే లేని
తోడేళ్ళ స్వార్థం జూపి
తోడేస్తయ్ స్వార్థ మిడతలు..

లోపల స్వార్థ బుద్ధుండి
వెలుపల హర్ష బుద్ధుని
వెల్లడిస్తూ అదును జూసి
కాటేసే పాము కన్నా
కర్కషులు మోసగాళ్లు..

చేటు జేసి ఎదిగే
చెడ్డ నక్కలు ఆఖరికి
తను తీసుకున్న గోతిలో
తనే బోర్లా పడక తప్పదు
చేటూ కాక తప్పదు కదా..

-కొక్కె రాములు
9985341992



# దళిత కథ- పరిశీలన

> "మానవుల అవసరాలు తీర్చుకోవడం కోసం వృత్తులు ఏర్పడ్డాయి. ఈ వృత్తి విభజనలో అసమానత ఉంది. డా॥ అంబేద్కర్ అన్నట్లు అది శ్రమ విభజనే కాదు, శ్రామికుల విభజన కూడా అయింది. ఫలితంగా కొన్ని కులాల వాళ్ళు పేదరికానికి, అగౌరవానికి గురయ్యారు"

> రాజకీయాధికారం కాంక్షిస్తున్న దళితులు అందుకు అనుగుణంగా పొత్తులకు పోతున్నరు. ఐక్యతను సాధిస్తున్నరు. దాని వల్ల కొత్త సమీకరణాలు పాదుకొంటున్నవి. వీటికి వ్యతిరేకంగా నిలిచే శక్తులు కూడా బలం పుంజుకుంటున్నవి.

ప్రపంచంలో జాతి, మతం, వర్గాలు ఉన్నాయి. వీటితోబాటు మనదేశంలో కులం ఉంది. కులం అనేది ఎక్కువ సంకుచితమైనది కావడంతో వాటన్నింటికంటే ఇది ఎక్కువ ప్రమాదకరం. మన హిందూదేశంలోనే చీమ మొదలు బ్రహ్మ వరకు దైవత్వమే అన్నారు. ఇంత మహోన్నత మరే ఇతర దర్శన శాస్త్రాల్లోను గోచరించదు. అటువంటి సమతను కల్పించిన హిందూమతంలోనే నీచమైన కుల భేదాలు ఆచరించబడుతూ కొన్ని కులాలలోని మానవులను అంటరాని వారుగా చూశారు. ఆధునిక కాలంలో మతాంతరం చెందినా వారి కులం మారడం లేదు. వైవాహిక సంబంధాలు స్వీయ కులం వారితో మాత్రమే జరుగుతున్నాయి. మతాన్ని దాటినా కులాన్ని దాటజాలక పోతున్నారు. కుల విభజన ప్రపంచంలో మరెక్కడా లేదు, ఒక్క భారత్‌లో తప్ప. సమూలంగా భారత దేశంలో వర్ణ విభజనతో పాటు కుల వ్యవస్థ కొనసాగడం, వర్గ సంబంధాలతో పాటు కుల సంబంధాలు కొనసాగడం భారతదేశ ప్రత్యేక లక్షణం.

మధ్యయుగాలలో కులాన్ని వ్యతిరేకిస్తూ భక్తి ఉద్యమం సాగింది. ఉద్యమ కారులు కుల భేదాలను నిరసించారు. వీరిలో ఎక్కువ మంది అట్టడుగు వర్గాలకు చెందినవారు. దేవుని ముందు అందరూ సమానులేనని, ప్రార్థనలకు ఆంక్షలు, నిషేధాలు ఉండరాదని ప్రచారం చేసారు. ఈ ఉద్యమం సాంఘిక సమానత్వమనే భావనను ముందుకు తెచ్చింది. ఈ ఉద్యమానికి సాంఘిక/ఆర్థిక భావనలు ప్రాతిపదిక కాలేదు. కాని భక్తి ఉద్యమం భవిష్యత్తును బలంగా ప్రభావితం చేసింది. సమతాభావన మెల్ల మెల్లగా అంటరానితనాన్ని ప్రశ్నించుటను పునాదులు వేసింది. అస్పృశ్యత మహానేరం అనే గాంధీభావన ఉదారవాద సంస్కరణలను సూచించింది. "హరిజన" అనే పదం కొత్త వ్యక్తీకరణలకు బాటలు వేసింది. గాంధీ సమకాలికుడైన అంబేద్కర్ మరింత ముందుకెళ్ళి "దళితవాద" భావనలకు పునాదులు వేసారు. జ్యోతిరావుఫూలే, అంబేద్కర్ వెలుగులో దళిత సమస్యకు పరిష్కారాలు చూపిస్తున్నదే మౌలిక దళిత వాదం. మార్క్సిజం-లెనినిజం చెప్పిన సామ్యవాద దళిత వాదం. దీని ప్రకారం వర్ణ, వర్గ, కుల రహిత సమాజం నిర్మించబడుతుంది. మార్క్సిజం లోని మౌలికాంశాలు, అంబేద్కరిజంలోని అనుకూలాంశాల సమన్వయమే సరైన దారి చూపుతుందని సమన్వయ దళితవాదం నిర్ధేశిస్తుంది. దారి, తెన్ను లేకుండా దళితేతరుల్ని నిందిస్తూ ఆరోపణలు చేయడం, పలువురి దృష్టిని ఆకర్షించడం సంచలన దళితవాద ధోరణి. ఈ అన్ని వాదాల ప్రతిస్పందనగా దళిత కథ వెలువడింది. దళితుల దార్శనిక దళితుల కోసం రాయబడే సాహిత్యమే దళిత సాహిత్యమని ఒక వాదన. ప్రగాఢమైన సంవేదన, తిరుగుబాటు, మార్పులను సూచిస్తూ రాయబడేది దళిత సాహిత్యమని మరో భావన. దళితుల ప్రయోజనాల కోసం, ఎవరు రాసిన అది దళిత సాహిత్యం అనవచ్చని పలువురి అభిప్రాయం.

దళితవాదం వల్ల నిర్దిష్టత, నేటివిటి అనేవి కథలోకి వచ్చి చేరాయి. దళితులు తమ ఉనికిని పటిష్టపరచుకునే క్రమంలో దళితేతరులకు, తమకు మధ్య ఉన్న గీతను చెరిపేస్తూ సాహిత్యాన్ని సృష్టించారు. గతంలో జరిగిన అవమానాలు, వర్తమానంలో జరుగుతున్న అణచివేత నుండి దళిత స్పృహను పెంపొందించుకున్నారు. కోల్పోయిన దాన్ని పొందటం, రావలసిన దాన్ని లాక్కోవటం, ఒక డిమాండ్‌గా తమ కంఠస్వరాన్ని వినిపించారు. ఆర్థిక, రాజకీయాంశాలు, సాంస్కృతికాంశాలు, సంస్కరణ భావాలు, నూతన ప్రతిపాదితాంశాలు, దళిత స్పృహతో కథలకు వస్తువును అందించాయి. మొత్తానికి దళితవాదం సాహిత్యంలో తనదైన ముద్రను వేసింది. తెలంగాణ కథా సాహిత్యంలో దళిత కథలు పెద్దపీటనేఉంది. ఆకలి పోరాటాలు, ఆత్మగౌరవ ఆరాటాలు రెండూ దళిత కథకు పట్టం కట్టాయి.

మానవుల అవసరాలు తీర్చుకోవడం కోసం వృత్తులు ఏర్పడ్డాయి. ఈ వృత్తి విభజనలో అసమానత ఉంది. డా॥ అంబేద్కర్ అన్నట్లు అది శ్రమ విభజనే కాదు, శ్రామికుల విభజన కూడా అయింది. ఫలితంగా కొన్ని కులాల వాళ్ళు పేదరికానికి, అగౌరవానికి గురయ్యారు. అందులో దళితులు ప్రథములు. మిగతాకులాల కంటే వీరు అదనంగా అస్పృశ్యతను భరించారు. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో కడగొట్టువారు. అందుకే అందరికి ఊడిగం చేయాల్సి వచ్చింది. ఈ తీరును, విధానాన్ని ఇంగ్లీషు చదువు తీవ్రంగా వ్యతిరేకించింది. సంఘసంస్కరణకు పునాది వేసింది. కనుకనే సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో అస్పృశ్యతా వ్యతిరేకత ప్రధాన అంశమైంది. జాతీయ ఉద్యమంలో సమస్యగా నిలిచింది. దళిత సంస్కరణకోసం గాంధీ కృషి చేస్తే, అంబేద్కర్ దళితుల విమోచన కోసం పాటుపడ్డాడు. ఈ ప్రయత్నాలన్ని కథలో వచ్చిచేరాయి. బ్రాహ్మణీయ భావజాలాన్ని, మనుధర్మాన్ని నిరసించిన కథలువెలువడ్డాయి. వర్ణవ్యవస్థ కారణంగా, కులం కారణంగా న్యూనతకు గురైన చిన్న చూపుకు గురైన దళితుల జీవితం కథల్లో చేరింది. స్వేచ్ఛాసమానత్వాలతో చైతన్యవంతమైన మానవులుగా దళితులు ఎదగాలని, అలాంటి జీవితం కలగాలని కాంక్షిస్తూ కథలు వచ్చాయి. దళితులు మానవ హక్కులకు వెలిగా బతకడం శోచనీయం. వారు హక్కుల సాధనకోసం ఉద్యమించాలి. రిజర్వేషన్ల ఫలితాల వల్ల జీవితాల్లో వచ్చిన వెలుగులు, కథా వస్తువులయ్యాయి. కథ వారికి గళాన్నిచ్చింది. వారికి వెన్నుదన్నుగా నిలబడింది.

''దళిత'' అనుశబ్దానికి అర్థం ఖండించబడిన, చీల్చబడిన, వెలివేయబడిన అను అర్థాలున్నాయి. Dalith అంటే broken or reduced to pieces generally అనే అర్థాలు ఆంగ్ల నిఘంటువులో ఉన్నాయి. 1972లో మహారాష్ట్రలో దళిత ఫ్యాంథర్స్ మ్యానిఫెస్టో ప్రకటించిన ప్రకారం who is dalith?

Member of scheduled castes and tribes, neo buddhists the working peole, the landless and poor peasants, women and all these who are being explaited, politically, economically and in the name of religion.

తెలంగాణలో 'వెట్టి' అనేది అధికారికంగా అమలులో ఉండేది. పటేల్ దగ్గర జీతం ఆశించకుండా, ప్రతిఫలం లేకుండా దళితులు పనిచేసారు.

> తెలంగాణలో జరిగిన పరిణామాలన్నీ కథల్లో కనపడతాయి. కథా రచయితలు ఇక్కడ జరిగిన మార్పులను, పోరాటాలను, ఉద్యమాలను, నేపథ్యంగా తీసుకొని కథలు రాశారు. అలా కథ వొక చారిత్రక వనరుగా నిలిచింది. ప్రజల సుఖ దుఃఖాలను, ప్రజలు తమ అభివృద్ధి కోసం జరిపిన ప్రయత్నపరంపరను కథ పట్టించు కొంది. భండారు అచ్చమాంబ నుండి నేటితరం రచయితల వరకు రాసిన కథలు అన్నీ కూడా ప్రజల పక్షం నిలిచాయి. తెలంగాణలో జరిగిన వికాసం మొదలుకొని నేటి ప్రపంచీకరణ సందర్భంగా జరుగుతున్న విస్మృతి వరకు, పోయిన పోకడలన్నీ కూడా కథల్లో కనపడ తాయి. విస్మృతికి గురి అయిన సమూహాలు తలెత్తుకొని, తమ అస్తిత్వ ఆకాంక్షలను ఎలుగెత్తి చాటిన విధానాన్ని కూడా కథ అక్కున చేర్చుకుంది. తెలంగాణ కథ నడిచిన దారులను పరిశీలించి, కథ ప్రజల వెతలను ఏ విధంగా పట్టించుకుందో డా॥ బి.వి.యన్.స్వామి వివరిస్తున్నారు.
>
> – సంపాదకులు

ఇందులోని అమాన వీయతను చిత్రిస్తూ భాగ్యరెడ్డి వర్మ "వెట్టి మాదిగ" అనే కథ రాశారు. తెలుగు కథా సాహిత్యంలో ఇది తొలి తెలుగు దళిత కథ. బి.సీతారామరావు "గరీబోన్ని' కథలో వెట్టి గురించి రాసాడు. వెట్టికి వ్యతిరేకంగా బెల్లంకొండ నరసింహాచార్యులు "సీయూసీ సభలు" అనే కథ రాసారు. అంబేద్కర్ ప్రభావంతో మరాఠీలో వచ్చినంత విస్తృతమైన దళిత సాహిత్యం తెలుగులో రాలేదు. దళిత జీవితంతో మమేకమైన దళితేతర కథకులు తెలంగాణలో అనేకులు ఉన్నారు. బి.ఎస్.రాములు, కాలువమల్లయ్య తమ కథల్లో దళిత జీవన ఔన్నత్యాన్ని దళితుల సంవేదనను అక్షరీకరించారు. భూపోరాటాల మీద జరుగుతున్న వివిధ ఉద్యమాల వల్ల తెలంగాణా గ్రామాలు అగ్నిగుండాలుగా మారిన క్రమాన్ని చిత్రించిన కథ "అగ్నిగుండం". ఊళ్ళు అగ్నిగుండాలుగా మారితే, దళితులు అన్నలకు సహాయం చేస్తున్నారన్న నెపంతో పోలీసు హింసకు గురికావడం ఈ కథలో చూడవచ్చు. చదువుతో గెలుచుకున్న జీవితంలో, దళిత మేధావి సమాజానికి బందీ అయ్యే క్రమాన్ని "బందీ" కథలో చూడవచ్చు. స్త్రీవాదోద్యమాలు, సాహిత్యోద్యమాలు, స్త్రీ కెంతో ఆత్మవిశ్వాసాన్ని కలిగించినా, చైతన్యవంతులను చేసినా అవి దళిత శ్రామిక స్త్రీలనంతగా పట్టించు కోలేదన్నది కాదనలేని సత్యం. ఆ లోటును కొంత వరకు తెల్లబట్ట, ఇల్లాలు, ఎంగిలి చేత్తో, ఉద్ధరింపు కథలు తీర్చాయి. ఇవి దళిత స్త్రీ సమస్యలపై వచ్చిన మంచి కథలు.

దళితులు అనేక సామాజిక కట్టుబాట్ల బంధనాల్లో ఇరుక్కొని అవమానాలకు, అణచివేతకు గురయ్యారు. దళితులు ఆ బంధనాల నుండి విముక్తి పొందాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పేవి దళిత విముక్తి కథలు. కాలువ మల్లయ్య రాసిన "కిటుకు" జింబో రాసిన "చెప్పులు", దార్ల రామచంద్రం రాసిన "బతుకుబడి" దళితుల విముక్తి గురించి వచ్చిన మంచి కథలు. ఉద్యమాల వెలుగులో అంబేద్కర్ బాటలో, చదువుతో వచ్చిన చైతన్యంతో తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకున్న వైనాన్ని చెప్పినవి దళిత వ్యక్తిత్వ వికాస కథలు. తెలంగాణలో దొరలకు సవాల్ విసరడం, అవసరమైతే తిరుగు బాటు చేయడాన్ని చిత్రించిన కథలు ఆడెపు లక్ష్మీపతి "రాబందులు", జూకంటి జగన్నాథం "కళేబరం", బి.ఎస్.రాములు "రియల్ఎస్టేట్", కాలువ మల్లయ్య "వైరుధ్యాలు" సదానంద శారద ''ఉప్పునీళ్ళు'' మొదలగునవి. ఊరిబాయి, "చదువుకన్ను" "పాలు", "సదువు", "కర్రోడు" కథలు విద్య ఇచ్చిన చైతన్యంతో హక్కులు సాధించుకోవచ్చని తెలుపుతున్నాయి.

ప్రభుత్వ హాస్టళ్ళలోని విద్యార్థులకు అంబేద్కర్ భావజాలం అందడం, కారంచేడు, చుండూరు, పదిరికుప్పం సంఘటనలు, దళిత రచయితలు, కళాకారులు, మేధావుల ఐక్యవేదిక (దరకమే, 1992) ఏర్పాటు, హైదరాబాదులో జరిగిన అఖిల భారత దళిత రచయితల ప్రథమ మహాసభలు (1987 అక్టోబర్) ఇవన్నీ మొత్తంగా దళితుల పోరుబాటకు వెలుగుదారులు పరచాయి. ఆత్మగౌరవం అభివృద్ధి, సాంఘిక హోదా, రాజకీయ అధికారం, సమానత్వ కాంక్షలు దళితుల్లో కొలువుదీరాయి. దీనికి తగ్గట్టుగానే జాతీయ రాజకీయాల్లో దళితుల పట్టు, ప్రాభవాలు స్ఫూర్తినిచ్చాయి. వీటన్నిటి వల్ల వచ్చిన శక్తితో దళిత సమూహం ఒక ప్రబల శక్తిగా అవతరించింది. ఈ క్రమానికి చెందిన కారకాలు, కారణాలు, ఫలితాలు, నాయకత్వాలు, ప్రభావాలు, ఫలితాలు అన్నిటిని కథ పట్టించుకుంది సాక్ష్యంగా నిలిచింది.

దళితులపై ప్రదర్శించే కులవివక్ష గురించి అనేక కథలున్నవి. నిజాం కాలాన మత మార్పిడి గురించి తెలిపిన కథ "ఇనాంశెలక". ఇందులో దళితులు ఏ విధంగా దోపిడీకి గురి అవుతారో గూడ అంజయ్య తెలిపారు. కాళోజీ రాసిన "తెలియక ప్రేమ తెల్సి ద్వేషం" కథలో మనుషుల మధ్య ఉన్న కులద్వేషం బతికి ఉన్నప్పుడే కాదు, చచ్చిన తరువాత కూడా ప్రదర్శితం కావడం చూస్తాము. అస్పృశ్యత యొక్క పరాకాష్ట స్వభావం ఇందులో కనపడుతుంది. గుండెడప్పు కనకయ్య రాసిన "ఉత్పాదకులం" కథ దళితుల శ్రమను గౌరవించింది. బూతం ముత్యాలు "బొందలగడ్డ" కథ రాసాడు. ఇందులో దళిత ఉద్యమ కారులకు, బెల్టుషాపుల ద్వారా తాగవెట్టి వారిని నిర్వీర్యం చేయడం, దాని వెనుక ఉద్యమాన్ని దెబ్బ తీసే ఉద్దేశ్యం కనపడుతుంది. పరోక్షంగా కులనిర్మూలనోద్యమాలకు గండికొట్టడం కనపడుతుంది. డప్పు అనేది దళిత జీవితం నుండి విడదీయరానిది. డప్పు కొట్టడంలోను, డప్పు కొట్టుకుంటూ ఆ శబ్దానికి అను గుణంగా ఆటలు ఆడడం, పాటలు పాడడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. ఈ సంస్కృతిని, కళను ఆ సరళిని గోగుశ్యామల "జాడ" కథలో చిత్రించింది. మాదిగవారికి "డక్కలి" వారు ఉపకులం. వీరు జాంబవంతుని చరిత్రను పటం ద్వారా చెపుతారు. డక్కలిని మాదిగ ముట్టుకోడు. మాదిగలు తమకున్న దాంట్లో కొంత డక్కలి వారికి ఇస్తారు. అట్లా వారి జీవనం సాగుతుంది. ఈ విషయం "రామక్క మాన్యమ్" అనే కథ వివరిస్తుంది. జూపాక సుభద్ర రాసిన ఈ కథలో ఉపకులాల వారితో వీరికి గల సంబంధాల్ని విపులంగా చర్చించింది. ఉపకులాల వాళ్ళు ప్రధాన కులాలపై ఆధారపడుతరు. ఉపకులాల వారికి ఇచ్చేదాన్నిత్యాగం అంటరు. సిందోల్లు కూడా ఉపకులాల కిందికే వస్తరు. వీరిని ప్రధానకులాల వాళ్ళు అపహాస్యం చేసే సందర్భాలు కూడా ఉన్నవి. వాటిని గడ్డం మోహన్‌రావు రాసిన "ఇచ్చురుగాళ్ళు" కథలో తెలిపారు. గుడిపల్లి నిరంజన్ రాసిన "నీరటి కాడికల" కథ దళిత జీవిత విషాదాన్ని తెలుపుతుంది. 1990 నాటికి నల్లగొండ జిల్లాకు చెందిన బోయజంగయ్య తెలంగాణ దళిత కథకు దీపదారిగా నిలిచారు. గొర్రెలు, దున్న, ఎచ్చరిక, బొగ్గులు మొదలగు కథలు రాసిన జంగయ్య అస్పృశ్యత, నీటి సమస్య, కులపీడన, రాజకీయాధికారం, నీచవృత్తుల నిషేధం వంటి వస్తువైవిధ్య కథలు రాసాడు. ననుమాసస్వామి రాసిన "గంటీలు" కథా సంపుటిలో దళిత సమస్యలు, వాటిపై పోరు కనిపిస్తాయి. గుండెడప్పు కనకనయ్య రాసిన "మేమిట్లుండం" కథా సంపుటి దళిత ఆత్మగౌరవ పతాకగా చెప్పుకోవచ్చు. "గూడ అంజయ్య కథలు" నిజాం జమానాలోని దళితుల పాట్లను చిత్రించాయి.


తెలంగాణాలో "కట్టుబాట్లు" పేరున సాంఘిక అసమానతలు చలామణిలో ఉన్నాయి. కులం పునాదిగా భూస్వామ్య వ్యవస్థ బలంగా ఉంది. అంటరానితనం ఆచరణలో ఉంది. ఈ విషయాలను, జీవితాలను అందులోని యాతనను చిత్రిస్తూ అనేక కథలు వచ్చాయి. 1970-90ల మధ్య పోరాట సాహిత్యం విరివిగా వస్తున్న కాలంలో ఉద్యమ కథల్లో భాగంగానే దళిత కథలు వచ్చాయి. మెజారిటీ ప్రజల ఓట్లతో గెలిచి, హరిజన ఇతర దళిత వర్గాల ఓట్లతో అధికారానికి వచ్చి, వాళ్ళకే వ్యతిరేకంగా నిర్ణయాలు చేసే కపట రాజకీయ నాయకుల బండారాన్ని బయటపెట్టే కథ సి.హెచ్. మధు రాసిన "బావి" ఇందులో హరిజనులకు హోటళ్ళలో వేరే గ్లాసులు పెట్టేవిషయాన్ని ఎదిరించడం కనపడుతుంది. బి.దామోదర్‌రావు రాసిన "ఎట్టి" అనే కథ పరమ దయనీయమైన దళితుని గాథ. ఇతడే రాసిన "గొర్లు" అనే కథలో దళితుడైన నర్సింలు రిజర్వేషన్ కింద ఎన్నికై మంత్రి పదవి పొందుతాడు. దీనంతటికి కారణం అగ్రకులాల ఆశీస్సులు. వారి చెప్పుచేతుల్లో బందీ అయి తన కులం వారిని పట్టించుకోకపోవడం కథలో కనపడుతుంది. పై కులం వాళ్ళు నర్సింలును కొన్నారు అనే సారాంశం కథ ద్వారా రచయిత తెలియజేశాడు. దార్ల రామచంద్ర రాసిన "కిర్రుచెప్పులు" కథా సంపుటిలో దళితులు అభివృద్ధికి చేరే క్రమంలో ఎన్నిపాట్లు ఎదుర్కోవాల్సి ఉంటదో కనపడుతుంది.

భూస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్న తెలంగాణలో దళితులు అణచివేయబడ్డారు. భూ పోరాటాలు ఫలించిన సమయంలో కూడా దళితుల పరిస్థితిలో మార్పురాకపోవడం వల్ల ఇక్కడ దళితవాదం బలంగా వినిపించింది. అక్షరాస్యత దళితుల్లో కూడా వ్యాప్తి చెందినందువల్ల దళితులు తమ అనుభవాలను పరిస్థితులను జీవనస్థితిగతులను వర్ణిస్తూ కథలు రాసారు. తెలంగాణలో దళితులేకాదు, దళితేతరులు కూడా దళితవాద స్పృహతో కథలు రాసారు. ఈ దశలో కులం ప్రధాన ఎజెండాగా మారడం గమనించదగిన విషయం. ఎవరి అనుభూతులను వారు కథీకరించుకోవడం వల్ల కథ శక్తి వంతమవు తుందనే వాదం ఒకటి బలంగా ఉంది. ఈ ధోరణిలో వచ్చిన దళిత కథ బలంగా జీవితాన్ని చిత్రించింది. బోయ జంగయ్య కథలు, గూడ అంజయ్య కథలు, గుండెడప్పు కనకనయ్య "మేమిట్లుండం" కథలు మొదలగు వందలాది కథలు దళిత జీవిత చిత్రణలు. పడాల రాములు "బలి" డప్పోల్ల రమేష్ "దునియల" మాస్టార్జీ" "అవసరమొస్తే" దళిత కథల్లో మచ్చుకుకొన్ని, దళితవాద భావజాలం నుండి జాలువారిన వాస్తవ జీవిత చిత్రణలు గుర్రం సీతారాములు రాసిన "కొన్ని ఎముకలు... ఇంకొన్ని గింజలు" కథ. పసునూరి రవిందర్ రాసిన "అవుటాఫ్ కవరేజ్ ఏరియా" "వేరెవర్ యూగో" లాంటి కథలు దళిత సామాజిక జీవితాల్ని చిత్రించాయి. కె.వి.నరేందర్ రాసిన "బర్రె" కథ ప్రతీకాత్మకంగా సాగిన దళిత భావజాలకథ.

స్త్రీవాద భూమికగా దళితకథలు కూడా వెలువడ్డాయి. అగ్రకుల స్త్రీలకన్నా, వెలివాడ స్త్రీలు మరింత అణచివేతకు గురవుతున్నరనే స్పృహ ఈ వాదానికి పునాది. దళిత స్త్రీ జెండర్ వివక్షతో బాటు, కుల వివక్ష కూడా భరించాల్సి ఉంటుందనే ఎరుక ఈ వాదనలో ఉంది. జాజులగౌరి, జూపాక సుభద్ర, గోగుశ్యామల వంటి వారు దళిత స్త్రీ సమస్యల్ని చిత్రించారు. ప్రేమించి పెళ్ళాడి మోసపోయిన దళిత రచయిత్రి కథ జూపాక సుభద్రరాసిన "ఆదర్శ వివాహం". కులాంతర వివాహాలు చేసుకున్న కింది కులాల ఆడవాళ్ల జీవితాలన్నీ పెద్దకులపు మగవాళ్ళ వల్ల జరిగిన విధ్వంసాలు కింది కులం మగవాళ్ళను చేసుకున్న పెద్దకులపాడవాళ్ళు సుఖంగానే ఉన్నరు అనే సూత్రీకరణ "ఆదర్శ వివాహం" కు కథాంశం అయింది. గోగుశ్యామల రాసిన "మన్నుబువ్వ" దళిత కుటుంబంలో సాగుతున్న ఆకలి, పేదరికాల్ని చిత్రించింది. స్త్రీవాద దృక్పథంతో రాసిన కథకులు కూడా ఉన్నారు.చైతన్య ప్రకాశ్ రాసిన "రేణ" కరుణ రాసిన "తాయమ్మ" కథలు ఉద్యమ చైతన్యం గల స్త్రీ కష్టాలను దృశ్యీకరించిన కథలు తెలంగాణలోని భూస్వామ్య సంస్కృతి నుండి వచ్చిన కులం కట్టుబాట్లు స్త్రీల పట్ల ఎంత కఠినంగా ఉంటాయో అనేక కథల ద్వారా తెలుసుకోవచ్చు. పద్మజ రాసిన "రాజేశ్వరి", కాలువ మల్లయ్య రాసిన "ఎంగిలిచేత్తో" మరియు రాజీవ కథలు ఇందుకు ఉదాహరణలు. టేకుమాల్ ప్రభురెడ్డి రాసిన "కనువిప్పు", ఉమాపతి రాసిన "ఏది పుణ్యం-ఏది పాపం, పడాల రాములు, బాలసరస్వతి, బి. నర్సింగరావు, దారం మల్లారెడ్డి, పోగుల రాజన్న, సి.హెచ్. నారాయణ, జయధీర్‌తిరుమలరావు మొదలగువారి కథల్లో స్త్రీలపై సంఘంలో జరిగే వివక్ష, హింస, దౌర్జన్యాలు చిత్రితమైనాయి.

అంటరానితనం అనేది ఒక ప్రమాద కరమైన కరోనా వైరస్ లాంటిది. అది మనుషులను ఆత్మన్యూనతకు గురిచేస్తుంది. ఒప్పిస్తుంది. పాటింపజేస్తుంది. అంటరాని తనమనే వివక్షకు గురి అయినవారు కూడా తమ కింద కులాల పట్ల అదే వివక్షను పాటించడం ఆశ్చర్యం గొలిపే విషయం. ఇదే విషయాన్ని సిద్దెంకి యాదగిరి "పంచు కోండ్రి" అనే కథలో వివిధ సందర్భాల్లో రకరకాలుగా చెబుతాడు. ఈ కథలో రిజర్వేషన్లను దామాషా పద్ధతిలో పంచుకోవాలి అనే అభిప్రాయం వ్యక్తమైంది. మాదిగల పట్ల ఉన్న వివక్ష కథ ద్వారా తెలుస్తుంది. కనుకనే ఎ.బి.సి. డిమాండ్ వచ్చింది. అందుకు విరుద్ధంగా "ఏకీకరణ" వాదన వచ్చింది. ఎస్సీలలో చీలిక తేవద్దు అని ఏకీకరణ వాదులు అంటున్నరు. ఇది ఎడతెగని వాదనగా మారింది. ఆ మేరకు ఇది కులంలో ప్రభావాన్ని చూపింది. మన్నెఏలియా రాసిన "అపచారమపచారం" అనే కథ అస్పృశ్యత పరాకాష్టను విడమరిచింది. గుడి బావిలో పడ్డ పందిని తీయడానికి పనికివచ్చిన దళితుడు, గుళ్ళోకి రావడానికి పనికిరాకపోవడం ఒక వైచిత్రి. ఈ కథ ముగింపు మాత్రం నేటి సామాజిక వాస్తవికతకు దగ్గరగా ఉంది. "పంది రెండు కాళ్ళు పట్టి లేపి శక్తినంత కూడగట్టుకొని బలంగా ఆవేశంతో గుళ్ళోకి విసిరేసిండు. గురి తప్పి గోడకు తాకి మెట్ల మీద పడింది.'' అణచిపెట్టబడినవారి తిరుగుబాటును కథా ముగింపు సూచించింది.

"అగ్రకులాల స్త్రీలకు పితృస్వామ్యమే శత్రువు అంటారు. పితృస్వామ్య విముక్తే వారి విముక్తి. కాని దళిత మహిళల విముక్తి చాలా పీడనలతో ముడిపడి ఉంది. కుల హింసలు, శ్రమదోపిడి, దొర, దొర్సాని, ఇంటి మగస్వామ్యాలు, ఆకలి హింసలు యివన్నింటి నుంచి దళిత మహిళ విముక్తిచెందాల్సివుంది అని జూపాక సుభద్ర అభిప్రాయ పడింది. ఈ భావజాలంలో వచ్చిన కథలు అనేకం ఉన్నాయి. మాదిగలకు బతుకమ్మ లేకుండా చేసిన కుట్రల్ని బహిర్గతం చేసింది. జూపాక సుభద్ర రాసిన "గద్దెత్కపోయిన బత్కమ్మ" జాజులగౌరి "విద్యార్థి" కథ, గోగుశ్యామల "రడం" కథలు దళితుల పిల్లలు చదువు కోసం పడే యాతనల్ని చిత్రించాయి. మాదిగ ఆశ్రితకులమైన మాస్టికులస్తుల సమస్యలను చిత్రిస్తూ "మాస్టిపోశవ్వ" అనే కథను మేరీమాదిగ (పాలడుగు మేరీసుకుమారి మాదిగ) రాసింది. ఈమె కథల్లో దళిత సమస్యలు వివిధ కోణాల్లో కనిపిస్తాయి. దళితవాదం వచ్చాక దళితుల సాధక బాధకాల్ని తమ సొంతగొంతుకతో కథలుగా చెప్పుకున్నారు. ఆ క్రమంలో వారి కులమాండలికాలు కథా సాహిత్యంలోకి వచ్చి చేరాయి. దాని వల్ల కొత్తశైలి చేర్పుగా కథకు అబ్బింది. రోజురోజుకు మారుతున్న పరిణామాలు,రాజకీయ అధికారం చేజిక్కించుకోవాలన్న ధోరణి కులస్పృహను అధికం చేసింది. మాదిగ దండోరా, మాల మహానాడు ఉద్యమ ప్రభావాలు, ప్రతిపక్ష అధికార రాజకీయాల ధోరణులను గుర్తుకు తెచ్చాయి. వీటన్నిటి ఫలితాలు ఒక వైపు, రిజర్వేషన్స్ ఇచ్చిన జీవితాల వల్ల ఎదిగిన దళితులు తమ పూర్వులకంటే మిన్నగా బతకడం ఒకవైపు కనిపిస్తుంది. ఈ క్రమం అంతా కూడా కథల్లో నిక్షిప్తం అయింది. రాజకీయాధికారం కాంక్షిస్తున్న దళితులు అందుకు అనుగుణంగా పొత్తులకు పోతున్నరు. ఐక్యతను సాధిస్తున్నరు. దాని వల్ల కొత్త సమీకరణాలు పాదుకొంటున్నవి. వీటికి వ్యతిరేకంగా నిలిచే శక్తులు కూడా బలం పుంజుకుంటున్నవి. కావున సంఘర్షణ అనివార్యమవుతున్నది. అలాంటి అనివార్యత నుండి కొత్త దళిత కథపుట్టుకొస్తున్నది.



-బి.వి.యన్.స్వామి
సెల్: 9247 817732

---

## గోల్కొండ సాహితీ కళా సమితి ఆధ్వర్యంలో జరిగిన గూగుల్ మీట్ కార్యక్రమంలో

# వైభవంగా మణిపూసల పురస్కారాల ప్రదానోత్సవం

ఇటీవల తెలుగు సాహిత్యంలో విశేషమైన జనాదరణ పొందిన నూతన కవితా ప్రక్రియ మణిపూసలు. వడిచర్ల సత్యం రూపొందించిన ఈ లఘురూప సాహితీ ప్రక్రియలో శతాధిక, సహస్రాధిక కవితలు రచించిన అరవై మంది కవులకు 2020 సంవత్సరానికిగాను గోల్కొండ సాహితీ కళా సమితి హైదరాబాద్ వారు మణిపూసల పురస్కారాలను ప్రదానం చేసింది.

సమితి నిర్వహిస్తున్న సాహితీ పక్షోత్సవాలలో భాగంగా తేది 22.11.2020 ఆదివారం రాత్రి జరిగిన గూగుల్ మీట్ (వెబినార్) ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించింది. మెట్లకుంట రాములు గారి ప్రార్థనా గీతంతో ప్రారంభించిన ఈ సభకు అధ్యక్షులుగా ప్రముఖ రంగస్థల నటుడు, గాయకుడు మాలేల అంజిలయ్య గౌడ్ గారు,ముఖ్య అతిథిగా డా. చంద్ర ప్రకాష్ రెడ్డి గారు, ఆత్మీయ అతిథిగా వడిచర్ల సత్యం లు పాల్గొన్నారు. ఇందులో ముఖ్య వక్తగా విచ్చేసిన ప్రముఖ కవి పండితుడు, "మణిపూసల రామాయణ" రచయిత ఆశీర్వాదం గారు "ఆధునిక తెలుగు సాహిత్యంలో మణిపూసల పాత్ర" అనే అంశం పై ప్రత్యేక ప్రసంగం చేశారు. అతితక్కువ కాలంలో ప్రక్రియ ఎదుగుతున్న క్రమాన్ని, వెలువడిన రచనలను, మణిపూసలు ఎక్కువ మంది కవులను ఆకర్షించడానికి గల కారణాలను సోదాహరణగా వివరించారు. జూన్ 9, 2019 న రవీంద్రభారతిలో ఒకేసారి సామూహికంగా 25 మణిపూసల పుస్తకాలను ఆవిష్కరించి, సాహిత్య చరిత్రలో ఒక విప్లవాన్ని సృష్టించాయి మణిపూసలని పేర్కొన్నారు.

"పద్యబంధమున్న కవిత
వచన వాసనున్న కవిత
మణిపూసలె తెలుసుకోండి
జనరంజకమైన కవిత!" అంటూ..... తెలుగు సాహితీ ప్రపంచంలో మణిపూసలకు గల వైశిష్ట్యాన్ని వివరించారు. సాహితీ వేత్తలు, విమర్శకులు, అవధానులు, కవి పండితులెందరి చేతనో మణిపూసలు ప్రశంసలను అందుకున్న సందర్భాలను తెలియజేశారు. సామాజిక విలువలతో కూడిన అనేక రకాల మణిపూసల హృద్యంగా పాడినారు.

అనంతరం డా. చంద్ర ప్రకాష్ రెడ్డి గారు సమితి ఆధ్వర్యంలో వివిధ రకాల మణిపూసల అవార్డుల ప్రదానోత్సవ ప్రకటన చేయగా,వెంటనే ఘనపురం పరమేశ్వర్ గారు అరవై మంది కవుల పేర్లను చదివి వినిపించారు. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లతో పాటు ముంబయి, అమెరికాల నుంచి కూడా ఒక్కొక్కరు ఉన్నారు.

మన రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన ప్రతిభా భారతి, వాంగె సంధ్యారాణి, గంగ్యాడ ఆంజనేయులు, పసుల చంద్రశేఖర్, మాదరం వనజ, కవిత, శ్రీలత, టి. గోపాల్, వడ్ల నరసింహా చారి(మణికర్ణిక), బి. రాజయ్య, బీరప్పోల్ల అనంతయ్య, సరోజ, సుజాత, గుగ్గిల్ల నాగభూషణాచారి, పిన్నింటి మహేంద్రా రెడ్డి, ఖుషిప్రియ, వలిపే సత్యనీలిమ, టి. పల్లవి, చీకోటి రాములు, పి. వెంకటేష్, అనుపటి రామచంద్రయ్య, పిట్ల రాజయ్య, కాల్వ రాజయ్య, మేకల లింగమూర్తి, గొంగుపల్లి కిష్టయ్య, దన్నవరం నరేందర్ రెడ్డి, కడారి దశరథ్, సిస్టర్ అనసూయ, గడ్డం శంకర్, కందుకూరి భాస్కర్, కోడెం సాంబయ్య, సుర్వి విఘ్నేశ్వర గౌడ్, చౌకి రాజేంద్ర, మోటూరి అర్పిత, గాదాసు రజిత, లిఖిత్ కుమార్ గోదా, సుబ్బా జ్యోత్స్న దేవి, బండారు సునీత, పటేల్ శివకుమార్, జోగన్నగారి రాజ నరేందర్ రెడ్డి, తూర్పు బస్వరాజు, కె. పాండురంగ విఠల్, కేసమళ్ల వెంకటయ్య, మరాటి అరవింద్, దేవళ్ళ వెంకట హాసిని, బి. కిరణ్ గౌడ్, కె. హర్షవర్ధన్,ఉన్నారు.

మణిపూసలను గేయాల వలె మధురంగా ఆలపించిన డా. డాకన్న గారు మణిపూసల స్వరభూషణ పురస్కారాన్ని, వినూత్న రీతిలో "కందగర్భ మణిపూసల కృష్ణ శతకం" రచించిన అష్టావధాని ఐతగోని వెంకటేశ్వర్లు "విశిష్ట మణిపూసల కవిశిరోమణి" పురస్కారాన్ని అందుకున్నారు.

అలాగే ఆంధ్ర ప్రదేశ్ చెందిన మాల్లారెడ్డి రామకృష్ణ, కనకవల్లి బాలకృష్ణ ప్రసాద్, జామి సత్యనారాయణ, ధనాశి ఉషారాణి, ఆరెకటిక నాగేశ్వర రావు, చెన్నా సాయి రమణి, డా. వూటుకూరి వరప్రసాద్, కె. శైలజ, డా. గాజుల నరసింహ ఉన్నారు. అంతేగాక నవీ ముంబయి కి చెందిన దోమల జనార్ధన్, అమెరికాకు చెందిన దాస్యం మాధవి కూడా ఈ అవార్డులు పొందినారు.

గత ఏడాది లో 160 మంది కవులకు మణిపూసల పురస్కారాల నివ్వగా, ఈ సంవత్సరం 60 మంది కవులకు మాత్రమే ఇచ్చారు.

ఈ సమావేశంలో గోల్కొండ సాహితీ కళా సమితి, ప్రధాన కార్యదర్శి జె. రామకృష్ణ రాజు గారు ప్రముఖ సాహితీ వేత్తలు గంటా మనోహర్ రెడ్డి , శతావధాని మలుగ అంజయ్య గారు, కాగ్నా కళా సమితి అధ్యక్షులు పటేల్ శివకుమార్, ఉపాధ్యక్షులు సయ్యద్ యూసుఫ్ లతో పాటు దాదాపు వంద మంది కవులు, రచయితలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రంగుల ప్రపంచం

అందమైన ప్రపంచం
అద్భుతమైన పట్టణ
ప్రాంతాలు
చూడముచ్చటైన
హరివిల్లు.
ఈ ప్రపంచంలో
పై పై రంగులకే
విలువ ఈ సమాజంలో
రంగే ప్రధానం జనాలకి.
విలాస జీవితానికి
బానిసై
అడ్డదారుల్లో యువత
లోకమంతా ఒక మాయ.
ఆమడ దూరంలో
సామాన్యమైన ప్రజలు
రంగుల ప్రపంచనికి.

-మిద్దె సురేష్
9701209355





డిసెంబర్ 5 శనివారం నియోగి రచించిన 'అక్షరా అడుగు జాడల్లో పంచ సహస్రావధాని" గ్రంథ ఆవిష్కరణ సభలో గుదిబండి వెంకటరెడ్డి, జి. కృష్ణవేణి, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥కె.వి.రమణాచారి, డా॥ కేతవరపు రాజ్యశ్రీ, నియోగి, జంధ్యాల కుసుమ కుమారి, చంద్రాదిత్య.
● నియోగిని సత్కరిస్తున్న అతిథులు.

## మనిషి

నేను పుట్టానని అంటాడేకాని
చస్తానని చస్తే అనడు
తాను ఏనాటికైనా చావవలసిందె
అందుకు మంచి నడవడి కావాలి
అప్పుడే పుట్టుకకు అర్థం
నాటి రాక్షసులు మేలేమో
జాలి ,సహృదయాలు ఉండేవేమో
నేటి కామ, నీచ, నికృష్టులకులేవు
దయాదాక్షిణ్యాలు
ధనమున్నవాడు ధనవంతుడౌతాడు
మంచి మనసున్నవాడె నిజమైన గొప్పవాడు
ఓడించినవాడు గొప్పవాడు కాదు
ఓటమి దశలో పయణిస్తున్న వారిని
గెలిపించేవాడే నిజమైన గొప్పవాడు.



-ఎలగందుల లింబాద్రి
చరవాణి. 7659834393.



# మట్టికాళ్ళ.. ముట్టడి!

వాళ్ళు నల్లని మట్టిని పిసికి
తెల్లని మెతుకులు పంచేవాళ్ళు
తమ వెన్నుల్ని వలిసి
ఆకలిని తీర్చే అన్నదాతలు వాళ్ళు!
ప్రపంచమునకు భోజనము పెట్టి
వానకి భుక్తి లేదన్న జాషువా
మట్టి మనుషులు వాళ్ళు.

ఏటికేతం పెట్టి ఎన్ని పుట్లు
పండించినా అప్పులు తప్ప
ఆస్తులు లేని అభాగ్యులు వాళ్ళు.
వాళ్లను పాలించే పాలకులు
నియంత్రించే బడా బాబులు
వాళ్ళ చెమటను మట్టిలో పిండిగ
చపాతిలా కడుపు నింపుతున్న వాళ్ళు.

శ్రమకు తగిన ఫలితం కోసం
పండించిన పంటకు గిట్టుబాటుకై
దళారి 'మార్కెట్' మాయల అంతానికి
కదం తొక్కుతున్న మట్టి కాళ్ళ కవాతు.
ఢిల్లీ పంటపొలాలను మాయం చేసే
కార్పోరేట్ వ్యవసాయ బిల్లుల రద్దుకై
పండించిన పంటకు మద్దతు ధర
నకిలీ విత్తన కల్తీ మోసపు దళారి వ్యవస్థలో
వడ్డీలేని రుణం కోసం అప్పుల్తో
ఆత్మహత్యలు లేని వ్యవసాయం కోసం
కాళ్ళావేళ్ళాపడుతున్నా దేశ వెన్నెముకలు
నేల రాలిపోతున్నవి.

రైతేరాజు, జైకిసాన్
మన్‌కీ బాత్‌లో మద్దతు ధరల్ని
పాతరేసి.. రైతు 'బంధు'వులకు
పచ్చని బతుకుల్ని ఎరవేస్తున్నరు.
మార్కెట్ దళారికి బలిపెడుతున్నరు!
అప్పులు వడ్డీలు అడ్వాన్సులు కల్తీమందులు
విత్తనాలు రైతుపాలిట విషపు గుళికలై
ఆత్మ'హత్య'లకు పురికొల్పుతూనే వున్నవి.
ఎక్కడైనా అమ్ముకోవచ్చని దళారీ కోసం
చేసిన చట్టం రైతుమేలు కోసం అని..
అంబాని.. ఆదానీల కార్పోరేట్ వ్యవసాయానికి
'డిస్కం'లు భూముల్ని అప్పగించడానికి
రైతు రక్షణ కోసం అంటూ
ఉల్లినూనె పప్పుల్ని అప్పగించడానికి
రైతు రక్షణ కోసం అంటూ
ఉల్లినూనె పప్పుల్ని నిత్యావసరాలు కావని
కార్పోరేటు కోసం ప్రజల్ని మోసం చేసే
ఏపిఎంసిలను మూసి రైతును
మోసం చేయ చూస్తున్న వ్యవసాయ
బిల్లుల అంతానికి పంటపొలాల
నుండి ఢిల్లీ పాలనను ముట్టడించిన
మట్టి 'కాళ్ళ ముట్టడికి' జేజేలు!
కార్పోరేట్ ఫార్మింగ్‌తో రైతు పంటను
దాచుకొని దోచుకొనే దళారీ
పీడనపై పిడికిళ్ళు బిగించిన
మట్టి చేతులకు మొక్కుదాం!
బారికేడ్లను. వాటర్‌కేన్లను
టియర్ గ్యాస్‌లను బంకర్లను
దాటుకొని, ఖలిస్తాన్, దేశద్రోహుల
అర్బన్ నక్సలైట్ల షాహీన్ బాగ్ పోరు
పేద మట్టి మనుషుల పోరును
అణచాలనుకున్న పాలకుల
విద్రోహాల్ని గోతుల్లో పూడ్చేసి
కొత్త చరిత్రను సృష్టిస్తున్న
మట్టికాళ్ళ ముట్టడికి మద్దతునిద్దాం.
'అన్నం పెట్టే రైతు నోట్లో మన్ను కొట్టే'
'దళారీ' బిల్లు పాలన నిలువరిద్దాం!!
(ఢిల్లీ రైతు పోరాటానికి, దేశవ్యాప్త
బంద్‌కు మద్దతుగా...)



-సహచరి
సెల్ 94409 70454

# అన్నదాత బతుకు ఆగమేనా...?

దేశానికి అన్నం పెట్టే రైతన్న అరిగోస పడుతుంటే
గుడ్లప్పగిచ్చి చూస్తూ గుర్రుగొట్టి పడుకోవడమేనా
ఈ మానవ జాతి పని..?
ఎండకెండి వానకుతడిసి
బుక్కెడు బువ్వతినకుండ పంట పండిస్తే..
వరదలొచ్చి పంట నీట మునిగితే
రైతు గుండె పగిలి చెరువైతంది
పంట పండిచ్చిన రైతుకు
రేటు పెట్టుకొని అమ్ముకునే హక్కు లేదు
దలారెవడోవచ్చి తక్కువకు తండుకొని
ఎక్కువకు అమ్ముకుంటు ఎదిగిపోతాండు !
నాయకులు కండ్లున్నా..గుడ్డివాళ్ళైతరు
అధికారులు అందులై
మైకులను పక్కనెట్టి మూగోళ్ళైతరు !
మా బాధలినుండ్లి , మా గోస సూడుండ్రంటే....
రబ్బరు బుల్లేట్లతో కాలిపిస్తరు
వాటర్ టాంకుల నీళ్ళతో కొట్టిత్తరు
ఓట్లప్పుడు చేసిన హామిలకు తూడ్లుపొడిసి
రైతులను ముప్పతిప్పలు పెడతరు
అడిగితే నడ్డివిరగగొడతరు
సన్నవడ్లేయ్యమన్న కారు
కొనడానికి రోడ్లేక్కుతలేదు
రైతులెంట ఉంటమన్న కమలం
పగపట్టిన పామోలే
రైతులపై పగతీర్సు కుంటాది
రైతుల పై సినిమాలు తీసి కోట్లుదండుకున్న
యాక్టరు ఎటుబాయే..?
మైకుల ముందర హామిలిచ్చిన
నాయకులు ఎటుబాయే...?
ఒకదిక్కు తంతనేవున్నరు
మళ్ళి వాళ్ళెనకనే బోతున్నరు
నిలబడ్డోడు "చావో రేవో " అన్నట్లు వుండాలే గని
అడుగులకు మడుగులొత్తుడేందో..?
ఈ కష్టబోతులకు ఎన్నడర్థమైతదో ఏమో ..?
అర్థచేసుకో రైతన్నా ...!
ఆచీతూచి అడుగు ముందుకేయన్నా !

-తాండ్ర చిరంజీవి
సెల్ : 9959180762.

# బువ్వ రుచి

హాలం చేతబట్టి
పొలం దున్నుతూ
బురద తొక్కిన
రైతుకు తెలుసు
బువ్వ తీపి.
నారు నాటి
నీరు పెట్టి
కలుపు తీసిన
రైతుకు తెలుసు
బువ్వ రుచి.
ఎరువు వేసి
కంచె నాటిన
చెమట రాల్చిన
రైతుకు తెలుసు
బువ్వ రుచి

- జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315



# రోడ్డు పై" రైతు గుండె" ??

రైతులు పొలాల్లో లేరు
రాదారి పై కదలని శిలసదృశ్యాలు
స్పీడు బ్రేకర్లకు తోడు కూడ ?

ఈ రోజు కిసానుల నిరసనలే
ఉరుములు పిడుగులు
ఆకాశానికీ ఆశ్చర్యం ?

పంట పై మమకారం రైతుకే తెల్సు
పాలకులకేం తెలుసు
వ్యాపార గణితం ?

అందరూ అన్నదాత వెంటే
మెతుకు తిన్నవాడికి
ఈ ధర్మం - స్వధర్మం !

రైతు గుండె రోడ్డు పై
కొట్టుకోడం దేశామంతా వినిపిస్తోంది
చెవిటి వారు ఎవరు మరి ?


రైతు క్షేమంగా ఉంటేనే
ప్రతి ఇల్లు అక్షయ పాత్ర --
బువ్వ కుత కుత ఉడుకుడు !



- కందాళై రాఘవాచార్య
8790593638

# నేలను ముద్దాడే యోధుడు

రోడ్డెక్కటం అతనికి కొత్తా కాదు
ఇష్టమూ కాదు
సేద్యం జూదమని
పెదవి విరిస్తావేమో నువ్వు
అతనికి అది వేదం
చివరాఖరికి మిగిలేది నిర్వేదం
అని తెలిసినా పట్టువదలడు
పట్టు కోల్పోతున్నా...
ఉసురు తీసుకుంటాడు కానీ
వ్యవస్థను కసురుకోడు.
మట్టితో సంభాషిస్తాడు
ముద్దాడుతాడు
ఆదాయం శూన్యమైనా
మట్టే మాణిక్యం అనుకునే
మట్టిలో మాణిక్యం అతను
పంటను పండించి కానుకిస్తాడు
మట్టి రైతుల బంధాన్ని చూసి
అలిగిన వరుణుడు
కార్చే కన్నీరు పంటను ముంచేసి
రైతుకు దుఃఖాన్ని ఇచ్చినా
నేలను ముద్దాడే యోధుడతను...
అన్నదాతకదా చేయిచాపడు
చేయందించటమే తెలిసినవాడు
కార్పొరేట్ రాబందులు
కబంధహస్తాలను చాచుతుంటే
సామూహిక దుఃఖాన్ని
భుజాన పైపంచ చేసుకుని రోడ్డెక్కాడు
గట్టుతెగిన యేరులా
అన్నదాత కంటనీరు
కుదురుగ ఉండనిస్తుందా
ఊపిరాడనిస్తుందా
రెక్కల కష్టాన్ని
దోచేసే శక్తులనెదిరించేందుకు
రోడ్డెక్కటం కొత్తకాదతనికి...



-సి.యస్.రాంబాబు
8374818961

# పోరుబాటలో రైతులు

కథం తొక్కి కదిలి వెల్లినారు నా పల్లే రైతులు
పిడికిళ్ళు బిగించి గళం విప్పినారు ఢిల్లిలో రైతులు ॥కథం॥

హలం పట్టి పొలం దున్ని దునియాకంతా అన్నం పెట్టె
దేశానికే వెన్నుపూసలు అన్నదాతలు యేకం అయ్యి
ప్రభుత్వాలపై తిరగబడినారు నా పల్లే రైతులు
పాలకుల ప్రశ్నించి లేచినారు ఢిల్లిలో రైతులు ॥కథం॥

కాల్లకు బేడీలైన కరెంట్ నూతన సంస్కరణలను
మెడలకు ఉరితాళ్ళైన మూడు చట్టాల రద్దుకోసము
బారికేట్లను బద్దలు కొట్టినారు ఢిల్లీలో రైతులు
బరిని తెగించి యుద్దం చేస్తున్నారు ఢిల్లీలో రైతులు ॥కథం॥

గిట్టుబాటు ధరల కోసం రైతు రుణాల విముక్తి కోసం
పోరుబాట పట్టిన రైతుల ఉధ్యమాలు చేసే రైతుల
అరెస్టులు ఇక చెల్లవ్ చెల్లవ్ అంటూ నా పల్లే రైతులు
గెలిచేదాక వెల్లం అంటున్నారు ఢిల్లీలో రైతులు ॥కథం॥

రక్తం గడ్డ కట్టుతువున్నా చలి పులి చంపుతువున్న
ప్రాణాలే పోతువున్నా పట్టిన పట్టును విడవకుండ
ఢిల్లీలో బైటాయించినారు నా పల్లె రైతులు
పల్లె పల్లెను రగిలించినారు ఢిల్లీలో రైతులు ॥కథం॥

స్వేచ్ఛా మార్కేట్ పేరున వ్యసాయాన్ని ధ్వంసం చేసే
చిన్నకమతాలను కాలబెట్టి కార్పోరేట్లకు అప్పచెప్పే
పాచికలింకా పారవ్ అంటున్నారు నా పల్లే రైతులు
పార్లమెంట్ నే దున్నివేస్తున్నారు ఢిల్లీలో రైతులు ॥కథం॥

-ఉప్పెన
8106073661

# అన్న (దాత)ల ఆక్రోశం

మట్టిని నమ్ముకుని
మట్టిలో పుట్టి, మట్టి సారంతో
పంటలు పండించి
అందరి ఆకలిని తీర్చే అన్నదాతలు నేడు తమ
నేలతల్లిని వదిలి
తమ ఉనికి కోసం, న్యాయం కోరి
రాజధాని రహదారులను
చీమల దండులా ఆక్రమించారు.
ఆరుగాలం శ్రమించి చెమట చుక్కలతో
నేల గర్భాన్ని తడిపి నాటిన గింజలన్నీ
మొలకలై పంటగా మారి
రైతన్న పాదాలను ముద్దాడితే
కడుపుకింత ముద్ద
బ్రతుకుకో భరోసా దొరుకుతుందని
భ్రమించిన అమాయక ఆశాజీవికి
మార్కెట్ మాయాబజార్ లో
దళారుల సిండికేట్ స్వార్థానికి
గిట్టుబాటు మాట దేవుడెరుగు
పెట్టుబడే చేతికి రాక చతికిలపడి
అప్పులకు జడిసి,స్పృహలో
ఏ ఆసరా కానరాక
చీడపురుగులను హతం చేసేందుకు
దాచిన మిగిలిన మందు తాగి
తల్లి మట్టి ఒడిలోనే కలిసి పోయే
దౌర్భాగ్య దుస్థితిలో ఉంది రైతురాజ్యం.
మెతుకులను పండించే మార్మిక కళ
అన్నదాతలకు మాత్రమే తెలిసిన
సహజ వారసత్వ విద్య
కోటీశ్వరుడి కోట్ల నోట్ల కట్టలు
మతం, కులం, ప్రాంత విద్వేషాలను
రగిల్చి ఓట్లను దండుకునే
రాజకీయ రాబందులకు
చేతకాని, అంతుచిక్కని
అద్భుత జీవకళ వ్యవసాయం

శ్రమించడం, పండించటం, పంచటం,
జనాల ఆకలిని తీర్చటం తప్ప
ఏ స్వార్థం, ఏ మోసం
ఏ రాజకీయం తెలియక
తన బ్రతుకేదో చచ్చి నిలుపుకుంటూ
దేశానికి 'కనిపించని వెన్నెముక' ఉనికిని
కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అందించే
కొత్త కుట్ర చట్టాలకు నిరసనగా
ఎగసిన మౌన ఉప్పెనలై
పాలకుల దిమ్మ తిరిగేలా
ఢిల్లీ కోటను ముట్టడించిన
రుద్ర కృషీవలుల ఘర్జనలకు జతగా
అందరం ఒక్కటై గొంతు కలపాలి
మానవతతో రైతులను రక్షించుకోవాలి
( దేశరాజధానిలో జరుగుతున్న
రైతన్నల ప్రభంజనానికి మద్దతుగా )



-డా. కె. దివాకరా చారి
9391018972

# రైతుకు గిట్టుబాటేది

పాలకుల మాటే మంత్రమనీ నమ్మిన రైతు
సన్న ధాన్యం సాగుచేస్తే మిగిలింది కన్నీరు
దోమపోటు రైతుకు పొడిచెను వెన్నుపోటు
పైరు దిగుబడి తగ్గితే రైతుకు గుండెపోటు
సన్నాలకు మద్దతు లేదంటే పెరిగే రక్తపోటు
అకాల వర్షాలు రైతుకు వేసెను కాటు.
ధాన్యానికి గిట్టుబాటు కోసం రైతు రోడ్డెక్కే
వరి గింజలు అమ్ముకోలేక కంటతడి పెట్టె
ఆలి పిల్లల బతుకెట్లని దిగులు పడవట్టె
ప్రభుత్వాలు కర్షకున్ని కాదనవట్టె.
ఎద్దు ఏడిస్తే ఏవుసనీ దండగనీటరు
రైతేడిస్తే రాజ్యం దండగనీటరు.
దేవుడా కర్షకుడిగా అవనిపై ఎందుకు
పుట్టించావనీటున్నాడు కృషీవలుడు
పాలకులు ఇకనైనా మేల్కోవాలి
రైతు పంటకు మద్దతు ధర ప్రకటించాలి
పాలకులు రైతు పక్షపాతి కావాలి
రైతు సంక్షేమమే పరమావధి కావాలి
హాలికునికి భరోసాను కల్పించాలి
క్షేత్రకుడి జీవితంలో సంతోషం నింపాలి.



-యాదవరనీ చంద్రకాంత్ గౌడ్
9441762105

# రైతు

ఆత్మహత్యలు
పరిష్కారం కాదని...
సమస్యల పరిష్కారానికి
హక్కుల పోరాటం చేస్తే
పట్టించుకో రెందుకు?.
నీడతో, గుడ్డతో.
మాన రక్షణ ..!
రైతన్న కూటితో .
ప్రాణ రక్షణ!
ఆలోచిస్తే మార్గం
పంతం తో అనర్థం



-యెల్డి సుదర్శన్
9892411067

# నా రైతు గాథ

ఓ రైతు నీ శ్రమకు లేదు
దాపరికం
కోడికూయంగానే
మేలుకొంటివి
ఆదిత్యుని
పలకరింపుతో పైకి లేచి
ఉదయభానుని
నీడలో ప్రయాణిస్తూ
కారడవిలో
ఒంటరిగా పయనిస్తివి.
పొలంలో
హలం పట్టి
అందరి ఆకలిని
తీర్చే
అమృతాన్ని అందించిన
ఓ రైతన్న
నేడు
నువ్వు
ఆకలితో
అలమటిస్తూ
బీడుబడిన భూములను
బిడ్డలాగా
హక్కున్న చేర్చుకుంటివి
ప్రకృతితో
సంబంధమును
కలుపుకుంటివి.
కానీ
నేడు
నీకు గిట్టుబాటు లేక
పెట్టుబడి రాక
ధరణిని
నమ్ముకున్న
నువ్వు
దళారులతో
మోసపోతున్న
ఓ రైతన్న
నీ కష్టం
అనంత విశ్వసృష్టికి
తీరని ఋణం
వాయువును
ఊపిరిగా పోసుకొని
బక్క చిక్కిన పొట్టతో
ఆయుష్షుని పెంచుకొని
వరి పొలంలో
అధైర్య పడని నడకలతో
నాగలిని నమ్మి
గొడ్లను నమ్మి
నీ పనిలో
దాగిన నైపుణ్యాన్ని
ఈ ప్రపంచానికి
పరిచయం చేస్తూ
నీకు సాటి లేరని....
ఇక రారని...
శ్రమభలంతో..
బుద్ధిబలంతో...
పచ్చన్ని పొలాల్లో
అడుగులు వేస్తూ
నీ శ్రమతో
కూడిన నైపుణ్యానికి
యాంత్రిక కృషి సరి రాదనీ
నీ దరి చేరదని నిరూపిస్తివి.
పచ్చని పొలాలను
కంటికి రెప్పలా
కాపలాకాస్తు
నీరాబడి కోసం
ఎదురు చూస్తూ
చిన్న చిన్న చినుకుల కొరకు
ఆశతో ఎదురుచూస్తూ
ప్రకృతి వైపు
కన్నీరు కారుస్తూ
పటిమతో
ప్రజలకొరకు
శ్రమనే ఆయుధంగా
కలిగి
నావికుడిలా
రాజ్యాన్ని రక్షించే
యోధుడిలా
ఈ ధరణిపై వెలిసిన
ఓ రైతన్న
నీకు సలాం అన్న.
నీ శ్రమకు
రాబడి రాదని....లేదని
తెలిసినా నివ్వురు గప్పిన నిప్పులా
ఉన్న ఓ కర్షక
నీవు నిజంగా ధన్య జీవివి
పుణ్య జీవివి.
కాని
నేడు
అందరి
ఆకలి తీర్చి
ప్రాణం పోసే
ఓ అన్నదాత
నీ శ్రమ ఒక అరణ్య రోధనలా
మారినందుకు
చింతిస్తూ
మీ అభివృద్ధే
దేశాభివృద్ధి
అని గుర్తుచేస్తూ
ప్రాణం పోయుట
తెలిసిన
ఓ రైతన్న
ఈ ఉవిధపై నీ శ్రమ
ఉషస్సులా ఎగరాలి...
నీ శ్రమకు తగ్గ ఫలితం
రావాలి
అన్నం పెట్టె
రైతే
రాజు అని
ఈ పాలకులు
గుర్తించాలి
నీవే మాకు ఎప్పటికి
ఆధారం ఆదర్శమవ్వాలి.
నీ శ్రమకు
నా నమస్సుమాంజలితో...
మా ఆకలిని తీర్చే నీకు
వందనం.....
అభివందనం ...




-డా.తెలుగు తిరుమలేష్
9908910398

# రగులుతున్న భారతం

ఇన్నాళ్లు మా రక్తం
ఎర్రటి నేలలో
పచ్చని పంటల
కోసం ప్రవహించింది
నేడు ఉరకలై
తరంగములై
జ్వలిస్తున్నది
పాడిపంటలు
ఈ దేశ జీవనానికి వేధిక
ఆ వేధికపై మంటలు
రగిలిస్తే దేశదిమ్మరులు
పగిలిపోతాయి.
ఓర్పు ,సహనం
మా కాడెద్దులు
కన్నీటి చుక్క,చెమట చుక్క
మాకు రెండు కవలపిల్లలు.
వీటి ద్వారా భారతాన్ని
సస్యశ్యామలం చేసాం
ఈ పచ్చ నోట్లు
దోచుకునే వారు మాకేం చేశారు
ఒక సీసా పురుగు మందు
రెండు బార్ల ఉరి తాడు.
మా చెమట చుక్కల్ని
దేశాభివృద్ధిని
ప్రభుత్వేతరలకు కట్టబెడుతున్నారు
ఇది కాదా దేశాన్ని అమ్మడం అంటే,
తన భవిష్యత్తు గొంతులో
వడ్ల గింజలు వేయడం అంటే,
భరతమాతకు కొరివి పెట్టడం
అంటే,
మీరెన్ని చేసినా
సామాన్యుడే ఆహుతి అవుతాడు.
పాలకుడు పాషాణ హృదయుడైతే
ప్రజల కన్నీళ్లు ఆయనను
కరిగించలేవు..!
పాలకుడు మొండివాడైతే
ప్రజల కష్టాలు ఆయనను
కదిలించలేవు..!
నేడు కనీస మద్దతు
ధరలకు రక్షణ లేకపోతే
ఈ దేశ భవిష్యత్తుకు
రక్షణ ఎక్కడిది..?
గుండెపై తన్నుతున్న
ప్రియ"వేటు" జెండాలకు
ఈ మట్టిమనుషులు
ఈ దేశంలో స్థానం
ఎలా ఇస్తారు..
అందుకే భారతం రగులుతున్నది.

-విశ్వసారథి
6301535477



# పోటెత్తిన నాగళ్ళు !

పండించిన పంటను
పండించినోడు కాక
పాలకుడి కనుసన్నల్లో
కష్టం అంతా కన్నీరై కదిలిపోయే
కుట్రలు కాగితంపైకి వచ్చాక
కర్శకుడి కళ్ళు ఎరుపెక్కాయి
పోరు పిడికిళ్లు బిగుసుకున్నాయి
కాళ్ళు కదనరంగం వైపు దూసుకెళ్లాయి
తప్పిద నిర్ణయాలకు నిరసనగా
డిల్లీ నుంచీ గల్లీ దాకా
రైతు ఘర్జనలు మిన్నంటాయి
దేశానికి పంటలు ప్రమిదలు అయినప్పుడు
అరచేతులు అడ్డుపెట్టి కాపాడాలి
ఆకలి తీర్చే అన్నదాత అడుగులకు
ఊతం అన్నది నమ్మకమై నిలబడాలి
ఊరించే యేరులా
రైతు నడక సాఫీగా సాగాలి
చిందించిన స్వేదం
నాలుగు రూకలై నవ్వులు పూయించాలి
దేశ వెన్నెముకకు
ప్రభుత్వాలు బాసటగా నిలిచి
మద్దతు ధరను ఆమోదించాలి
రైతు కన్న కలల్ని సాకారం చేయాలి
జై కిసాన్ అన్న నినాదాన్ని నిజం చేయాలి...!!

-మహబూబ్ బాషా చిల్లెం
9502000415



# నిజం

అవును నిజం..
రైతు వ్యవసాయం జూదం
పండితే వరి
ఎండితే ఉరి.



-మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603

# మట్టి పిడికిలెత్తి..!

మట్టి సలసల మసిలి..
కోపాగ్నితో ఎగిసి పిడికిలెత్తింది !

కర్రు కొలిమిలో ఎర్రగా కాలి..
నిరసనల చురకల వాత పెట్టింది !

కోడవలి కోపతాపంతో చట్టాల్లోని...
కలుపును కోసే తెగువ చూపింది !

గడ్డపార భీకరంగా గర్జించి...
కార్పొరేటును కాటేయ చూసింది !

ఎడ్లబండి ఎగిసి పడి...
రోడ్డుకు అడ్డు పడి కన్నెర్ర చేసింది !

కర్షక లోక సంద్రం ఏకమై..
నాగేటి సాళ్లల్లో గింజై రగిలింది !

రైతు గొంతు రౌద్రంతో...
ఢిల్లీ పీఠం దద్దరిల్లింది !

ఏకతాటిపై భారతం...
రైతుపక్షపాతియై హోరెత్తింది !
నేలతల్లి నిశ్శబ్ద నినాదం...
అధికారాన్ని నిలదీసింది !

నాగటి సాళ్లు సాగి...
మౌనాన్ని చీల్చి మాట మె?లిచింది !

భారతమంతా బందుతో..
అష్టదిగ్బంధం దిగ్విజయమైంది !

కలుపు చట్టాలపై సమరశంఖంతో..
పల్లె పట్నం జనం ఏకమైయ్యింది !

అన్నదాతకు అండదండగా..
భారతమాత నిలబడి గళం సలిపింది !

నేను సైతం అంటూ...
పంట పైరు రైతెంట నడిచింది !

ఒక్కటై నిలిచిన భారతం..
విష చట్టాల సంకెళ్లు ఛేదిస్తోంది !



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037




డిసెంబర్ 8, మంగళవారం త్యాగరాయ గానసభలో చీకోలు సుందరయ్య వెలువరించి "ఒక గురువుగారు- నలుగురు శిష్యులు" పుస్తకావిష్కరణలో పెన్నా శివరామకృష్ణ చీకోలు సుందరయ్య, బైస దేవదాసు, కె.శివారెడ్డి, ఆవిష్కర్త కె. శ్రీనివాస్, కళా జనార్ధనమూర్తి, డా॥ నందిని సిధారెడ్డి, డా॥ నాళేశ్వరం శంకరం, రఘుశ్రీ, కె. ప్రభాకర్

చీకోలు సుందరయ్యను సత్కరిస్తున్న అతిథులు బైస దేవదాసు, కె.శివారెడ్డి, కె. శ్రీనివాస్.

# అక్షరం కోసం పరితపించే అక్షర ప్రేమికుడు కె.శివారెడ్డి

## -ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్

తన అరుదైన వ్యక్తిత్వంతో అక్షరం కోసం పరితపించే అక్షర ప్రేమికుడు గురువు కె. శివారెడ్డి బోధి వృక్షం లాంటివారని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ అన్నారు. శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్, త్యాగరాయ గానసభల ఆధ్వర్యంలో మంగళవారం గానసభలో ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయులు చీకోలు సుందరయ్య రచించిన 'ఒక గురువు గారు నలుగురు శిష్యులు' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించిన కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక కవిత్వానికి జీవధార 'ద్వారక' అని అక్కడ కవితాబృందాలు కలుసుకుని ఆధునిక కవిత్వంపై చర్చించేవారన్నారు. కవిత్వం పంచుకుంటే పెరుగుతుందని కవులు ఆశలకోసం కాదు ఆశయాల కోసం పనిచేశారన్నారు. సాహితీకృషిని రచన రూపంలో వెలికి తేవాల్సిన అవసరముందని, తెలుగు రాష్ట్రాల్లో అలాంటి సాహితీకృషి చేసిన కవుల సమూహాలు చాలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి కవి సమూహాల చర్చలు సాహిత్యంలో కొత్త అంశాలను ఆవిష్కరిస్తాయన్నారు. గురువు శివారెడ్డి కవిత్వాన్ని ప్రేమిస్తూ ఆయనతో చర్చిస్తూ విభేదిస్తూ ఏకీభవిస్తూ తమ మార్గంలో పయనిస్తున్న నలుగురు శిష్యమిత్రుల మనసులోని మాటను అక్షర రూపంలో తేవడం అభినందనీయమన్నారు. శివారెడ్డితో అతి సన్నిహితంగా ఉన్న నలుగురు కవులు డా॥ నందిని సిధారెడ్డి, కందుకూరి శ్రీరాములు, ఆశారాజు, డా॥నాళేశ్వరం శంకరం మనసులోని మాటలను రచయిత చీకోలు సుందరయ్య పఠనీయంగా రచించారన్నారు. అలాంటి సాహితీశిష్యుల గురించి ఈ పుస్తకంలో చీకోలు సుందరయ్య చక్కగా వివరించారన్నారు. సుందరయ్య అనుభవాల నుంచి వచ్చిన పుస్తకమన్నారు. నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె. శివారెడ్డి, డా॥నందిని సిధారెడ్డి, డా॥ నాళేశ్వరం శంకరం, పెన్నా శివరామకృష్ణ, గానసభ అధ్యక్షుడు కళా వి.యస్. జనార్ధనమూర్తి, రఘుశ్రీ, బండారుపల్లి రామచంద్రా రావు, కె. ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా॥నందిని సిధారెడ్డి మాట్లాడుతూ కవిత్వమే జీవితంగా కె. శివారెడ్డి బతుకుతున్నారని తెలుగు సాహిత్యానికి మంచి కవిత్వం అందిస్తున్నారని అన్నారు. కవిత్వ బలం శివారెడ్డి స్నేహం, ఆత్మీయత.. కవిత్వంపై శివారెడ్డికి ఉన్న నిబద్ధతకు ప్రధాన ఆకర్షణ అన్నారు. ద్వారక సర్కిల్ శక్తివంతమైనదని సినారెకి సైతం నచ్చిందన్నారు. కవి డా॥ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ కవి శివారెడ్డిలోని వామపక్ష భావజాలంతో కూడిన తాత్త్వికత విద్యార్థి దశలో పిడిఎస్‌యూలో ఉన్న తనను బలంగా ఆకర్షించిందన్నారు. చీకోలు సుందరయ్య ఈ పుస్తకం తీసుకురావడం అభినందనీయమని సాహితీ విమర్శకుడు పెన్నా శివరామకృష్ణ అన్నారు. కవి శివారెడ్డి మాట్లాడుతూ నలుగురు శిష్యులను తాను శిష్యులుగా భావించడం లేదని వారంతా తన సహచరులని అభివర్ణించారు. చివర మానస అధ్యక్షులు రఘుశ్రీ వందన సమర్పణ చేశారు.

# కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా'

### పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

ప్రథమ బహుమతి విజేత

### శీర్షిక: పరేషాన్ పురపాలక ఎన్నికలు

నగరపాలక ఎన్నికలు నేడువచ్చేను
ఉయ్యాలో ఉయ్యాలో
హైదరాబాది ఎన్నికలు వచ్చెను
ఉయ్యాలో ఉయ్యాలో..
ప్రతిరోజు ఉయ్యాలో
ఎన్నో పార్టీలు ఉయ్యాలో
గల్లీ గల్లికిఉయ్యాలో
ప్రచారం చేసింద్రుఉయ్యాలో..
ప్రచారం చేసి ఉయ్యాలో
ఎన్నో బహుమతులు ఇచింద్రు ఉయ్యాలో
ఆనంద ఉత్సాహాలతో ఉయ్యాలో
ఎన్నో
ప్రచారాలు జరిగే ఉయ్యాలో
పొద్దున్నే లేవగానే ఉయ్యాలో
పురపాలక ఎన్నికలు ఉయ్యాలో...
హక్కులకోసం ఉయ్యాలో
పోరాటాలు ఎన్నో ఉయ్యాలో
భాగ్యనగరన ఉయ్యాలో
పురపాలక ఎన్నికలు ఉయ్యాలో
హైదరాబాద్ అంత ఉయ్యాలో
నిరక్షరాస్యత వలె మారెను ఉయ్యాలో
సగం ఒట్లే వేసింద్రుఉయ్యాలో...
కరోనా మహమ్మారి కి ఉయ్యాలో
భయపడిబయటకు
ఉయ్యాలో
రాలేనిపరిస్థితులు ఉయ్యాలో
ఇంట్లోనే కూర్చుంద్రుఉయ్యాలో
ఓట్లు ఏమో వేయక ఉయ్యాలో పార్టీలన్నీ ఉయ్యాలో
పరేషాన్ అయ్యేనుఉయ్యాలో.



-సింగీతం సంతోష్ కుమార్
88971 52205

ద్వితీయ బహుమతి విజేత

### శీర్షిక: గారడీ వేషాలు

(విశ్వనగర వింతలు)

నాలుగేండ్ల కొక్కసారి నయాజాతరలో
సుట్టాల మాదిరిగా కోడికూరలో
మునిగినా,తేలుస్తమని హామీలో
వార్డు వార్డుకు,గల్లి,గల్లికి పూనకాలో
పేదోండ్ల ఇండ్లల్ల పెద్దోళ్ళ ఠికానాలో
రోడెక్కిన నాయకుల చమత్కారాలో
బల్దియా ఎన్నికల్లో ఎన్ని సిత్రాలో
ఆ అక్కా,ఈ అక్కా ఊకదంపుడు ఉపన్యాసాలో
పొద్దుగాల లేసినసంది బాకాలే బాకాలో
ఎక్కడ యేసిన గొంగడి యాడనే ఉండునో
పడవలేసుకొచ్చి,పలకరించినామనో
అన్నీ ఉచితమే గానీ,ఓటుకో నోటో
టీచర్లను పక్కనబెట్టి తీన్మార్ ఆడ్రింరో
బూతులకాడనే పైసలు పంచుడో
ఆని మీద ఈడు,
ఈని మీద ఆడు దుమ్మెత్తిపోసింరో
రండో రండో అన్నలారా!అక్కలారా!
అన్నీ మర్సిపోయి,ఓటేద్దాం రాండో
కార్పొరేటర్లను ఎంచుకొని
కబ్జాలు చేయించుకో
సదువుకొన్నోళ్ళు ఓటెయ్య రారో
ఇంటికాడ పండుకొని సోమరులైనారో
కండబలం,
డబ్బుబలం ఉన్నోళ్ళు దంచుకుతింటున్నరో
విశ్వనగర ఇసిత్రాలెన్నో!
విశ్వనగర ఇసిత్రాలెన్నో!



-డా.రామక కృష్ణమూర్తి
99482 85353



నారాయణగూడలోని తెలంగాణ పద్మశాలి సంఘం భవన్‌లో తెలంగాణ పద్మశాలి సంఘం వారు ఇటీవల జి.హెచ్.ఎం.సి. ఎన్నికల్లో గెలుపొందిన కార్పోరేటర్లు ఏనుగుల పావని వినయ్‌కుమార్ (గాంధీనగర్ డివిజన్ బి.జె.పి. కార్పొరేటర్), శాంతి సాయిజెన్ శేఖర్ (నాచారం డివిజన్ టిఆర్ఎస్ కార్పోరేటర్), ఆలె భాగ్యలక్ష్మి భాస్కర్‌రాజ్ (గౌలిపుర డివిజన్ బిజెపి కార్పోరేటర్), దంపతులను ఘనంగా సత్కరించిన దృశ్యం.

# భీంపల్లి శ్రీకాంత్ కు బోగ అంబయ్య స్మారక సాహిత్య పురస్కారం



ప్రముఖ పాలమూరు కవి దివంగత బోగ అంబయ్య స్మారక సాహిత్య పురస్కారం పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ కు లభించింది. డిసెంబర్ 6 న పాలమూరు జిల్లా భూత్పూర్ మున్సిపాలిటీలో జరిగిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సాంస్కృతికరంగం బాగుపడాలంటే సాంప్రదాయ కళలను బతికించుకోవాలన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కవులు, రచయితలు, నటులు, కళాకారులు ఎంతో మంది ఉన్నారని, వారికి రావాల్సిన గౌరవం దక్కలేదన్నారు. కళారంగ పోషకులు ఉంటేనే కళారంగం బతికి బట్టకడుతుందన్నారు. విశిష్ట అతిథి సావరిన్ సంస్థ చైర్మన్ డాక్టర్ బోగ కోదండపాణి మాట్లాడుతూ నాటకరంగాన్ని బ్రతికించడానికి, నాటకాలను ప్రదర్శింపచేయడానికి తన వంతు సహకారం అందిస్తానని, పేద కళాకారులకు ఆర్థిక సహాయంతో చేయూతనిస్తానని పేర్కొన్నారు. అనంతరం భీంపల్లి శ్రీకాంత్ కు బోగ అంబయ్య స్మారక సాహిత్య పురస్కారాన్ని శాలువా, మెమెంటోతో పాటుగా నగదు బహుమతితో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, కార్యక్రమ అధ్యక్షులు మురలీధర్ గౌడ్, సహకార సంఘం అధ్యక్షులు కదిరే అశోక్ రెడ్డి, బాదేపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణ గౌడ్, రంగస్థల నటులు బెల్లం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ భవన నిర్మాణం దేశానికి గర్వకారణం

## పటిష్ట భారతానికి చిహ్నంగా ఉంటుంది
## ప్రదాని మోడీకి లేఖ రాసిన సిఎం కెసిఆర్
## వర్చువల్‌గా పాల్గొంటానని ఆకాంక్ష

హైదరాబాద్,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): దేశ రాజధానిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబోయే సెంట్రల్ విస్టాకు శంఖుస్థాపన చేయబోతున్న సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రధాన మంత్రికి కేసీఆర్ లేఖ రాశారు. గొప్ప ప్రాజెక్టు అయిన సెంట్రల్ విస్టా దేశానికి గర్వకారణంగా నిలుస్తుందని సీఎం కొనియాడారు. దేశ రాజధానిలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం అవసరాలకు తగినట్లుగా లేకపోవడమే కాకుండా, అవి వలస పాలనకు గుర్తుగా ఉన్నాయని సీఎం అభిప్రాయపడ్డారు. దేశ రాజధానిలో ఇలాంటి నిర్మాణం అవసరం ఎప్పటి నుంచో ఉందని పేర్కొన్నారు. సెంట్రల్ విస్టా ప్రాజెక్టు ఆత్మగౌరవానికి, ప్రతిష్టకు, పునరుజ్జీవనానికి, పటిష్టమైన భారత దేశానికి చిహ్నంగా నిలుస్తుందన్నారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు త్వరితగతిన నిర్మాణం కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అలాగే ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొనాలని ఉందని సిఎం కెసిఆర్ తెలిపారు. వర్చువల్ ద్వారా కొత్త పార్లమెంట్ శంకుస్థాపనకు హాజరవు తానని లేఖలో కేసీఆర్ వెల్లడించారు. కొత్త పార్లమెంట్ దేశ ఆత్మగౌరవానికి, జాతికే గర్వకారణమని అభివర్ణించారు. కొత్త భవన నిర్మాణం వేగంగా పూర్తి కావాలని కోరుకుంటున్నానని కేసీఆర్ తెలిపారు. కాగా.. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మోదీకి కేసీఆర్ లేఖ రాయడం చర్చ నీయాంశంగా మారింది.

# విలేకరిని బెదిరించిన ఎమ్మెల్యేపై కేసు

## జర్నలిస్టుల ఫిర్యాదుతో మహిపాల్ రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు
## తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ప్రకటన

సంగారెడ్డి,డిసెంబర్9(ఆర్ఎన్ఎ): ఫోన్ చేసి విలేకరిని దారుణంగా బెదిరించిన ఘటనలో పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై పోలీసులు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేశారు. నీ ఇంటికొస్తా.. నీ కాళు.. చేతులు నరుకుత నంటూ పటాన్ చెరువు వార్త దినపత్రిక విలేకరి సంతోష్ నాయక్‌ను అసభ్యకర పదజాలంతో దూషించిన టిఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పై పోలీసులు కేసు నమోదు చేశారు. కబ్జాలపై వార్త రాసినందుకు ఎమ్మెల్యే దూషించిన వైనం సంచలనం రేపింది. బాధితుడితో కలసి అమీన్ పూర్ పోలీస్టేషన్లో టీయూడబ్ల్యూజే, ఐజేయు విలేకరుల సంఘం ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన పోలీసులు ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే తీరుపై అధికార టిఆర్ఎస్ బహిరంగంగా ఎలాంటి స్పందనా వ్యక్తం చేయలేదు. టిఆర్ఎస్ తీరుపై బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ ఘాటుగానే స్పందించారు. అయితే కాళ్లు, చేతులు నరుకుతా.. చంపేస్తానంటూ జర్నలిస్టు సంతోష్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వెనక్కి తగ్గారు. తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నాననీ తెలిపారు. ఈ మేరకు బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేసిన ఆయన.. జర్నలిస్టులంటే తనకు గౌరవం ఉందని, కబ్జాలతో తనకు సంబంధం లేదని వ్యాఖ్యానించారు. అయితే తన పరువుకు భంగం కలిగించేలా వార్తలు రాశారని, ఆరోపణలకు సంబంధించిన వార్తలు రాసే ముందు వివరణ తీసుకోవడం జర్నలిస్టుల ధర్మమని ఆయన అన్నారు. తన వివరణ కూడా తీసుకోకుండా వార్తలు ఎలా రాస్తారని ఆయన ప్రశ్నించారు. తనపై తప్పుడు వార్తలు రాశారంటూ జర్నలిస్ట్ సంతోష్‌పై పటాన్‌చెరు టీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి రెచ్చిపోయిన విషయం తెలిసిందే.

# పిసిసి పీఠంపైనే కాంగ్రెస్ నేతల దృష్టి

## నేత ఎవరైనా కష్టమే అంటున్న పరిశీలకులు

హైదరాబాద్,డిసెంబర్9 (ఆర్ఎన్ఎ): జాతీయ స్థాయిలోనే కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం లేకుండా పోయినందున తెలంగాణ కాంగ్రెస్ పరిస్థితి అనిశ్చితిలో పడింది. పిసిసి చీఫ్‌పై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్ ప్రకటించారు. అయితే మొన్నటి వరుస ఎన్నికల్లో పరాజయాలతో కాంగ్రెస్ రాజకీయాలు కేవలం నేతలకే పరిమితం అయ్యాయి. ఎప్పటికప్పుడు ఎదురుదెబ్బలు తగులుతున్న కారణంగా రాష్ట్రస్థాయిలో ఆ పార్టీ నాయకులలో ఐకమత్య లోపం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఇలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా గ్రేటర్ ఎన్నికల్లో తమ పరిస్థితికి మీడియానే కారణమని రేవంత్‌రెడ్డి నిందించారు. మీడియా మద్దతు ఉంటే చాలు, ఎన్నికలలో గెలిచి పోవచ్చు అని ఎవరైనా భావిస్తే అంతకంటే అవివేకం ఉండదు. టీఆర్ఎస్‌కు మీడియా మద్దతు పుష్కలంగా ఉన్నప్పటికీ పరాభవం నుంచి తప్పించుకోలేక పోయారన్న వాస్తవాన్ని రేవంత్‌రెడ్డి గ్రహించకుండా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కేసీఆర్‌కు సొంత పత్రిక, చానెల్ ఉన్నాయి. ఇతర పత్రికల చందా దారులందరికీ పదిరోజుల పాటు తన పత్రికను ఉచితంగా పంపిణీ చేసినా కేసీఆర్‌కు పరాభవం తప్పలేదు. గ్రేటర్ ఎన్నికల తర్వాత కూడా ఖమ్మంలో జరిగిన ఒక సభలో వేదిక మీదనే బహిరంగంగా పరస్పరం విమర్శించుకున్న కాంగ్రెస్ నాయకుల తీరును ప్రజలు మరచిపోలేరు. రేవంత్ వంటి చురుకైన నాయకుడు నిరాశ నిస్పృహలతో మీడియాను నిందించి ఉండవచ్చు. రాజకీయాల్లో అవకాశం కోసం ఓపిగ్గా ఎదురుచూడాలి. ఇకపోతే ఇప్పుడు ఓటమికి కారణాలను విశ్లేషించి ముందుకు సాగాల్సిన సమయంలో పిసిసి పీఠం కోసం పోరాడుతున్నారు. ఎవరికి వారు తామే కాంగ్రెస్ అధ్యక్షపదవికి కరెక్ట్ అన్న రీతిలో ముందుకు సాగుతున్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,జగ్గారెడ్డిలు తామే బెటర్ అని ప్రచారం చేసుకుంటున్నారు. టిడిపి నుంచి వచ్చిన రేవంత్ విషయంలో విహెచ్ లాంటి సీనియర్లు అడ్డుపుల్లలు వేస్తున్నారు. మొత్తంగా పిసిసి ఎవరికి దక్కినా కాంగ్రెస్ ఇపపట్లో బతికిబట్టకట్టడం అసాధ్యమని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

## జ్ఞాపకాలు

నాటి సభలు, సమావేశాలు... డిసెంబర్ 3 నుండి డిసెంబర్ 6 వరకు

డిసెంబర్ 3




డిసెంబర్ 4





డిసెంబర్ 5 & 6




# సోనియా గాంధీ చొరవతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు..

## కాంగ్రెస్ వేములవాడ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి
## వేములవాడలో ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 8 (నేటినిజం ప్రతినిధి):కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ప్రత్యేక చొరవతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు జరిగిందని కాంగ్రెస్ పార్టీ వేములవాడ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామిఅన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ఆయనమాట్లాడుతూ తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చిన దేవతగా సోనియాగాంధీని అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సంక్షేమం జరుగుతుందని, వచ్చే కొద్ది రోజుల్లోనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ నాయకులు ముడక చంద్రశేఖర్ ,సం ద్రగిరి శ్రీనివాస్ గౌడ్ , కనికరపు రాకేశ్ , తంగె ళ్ల గణేష్, వనపర్తి



శంకర్ ,పోతగంటి వెంకన్న ,శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.